భారత ప్రభుత్వం, పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG) - సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ వారి సహకారంతో

# ‘సమాచార హక్కు మరియు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’

డా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ .

గ్రామీణ స్వయం సహాయక బృందాల (SHG)/ గ్రామ సంఘాల (VOs)/ మండల మహిళా సమఖ్య (MMS) నేతలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం

*శిక్షణా కరదీపిక*

## తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ

## డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ

**డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం**

**సమాచార హక్కు మరియు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

**భారత ప్రభుత్వం, పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG) - సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ వారి సహకారంతో డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ 'సమాచార హక్కు మరియు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ను ఏర్పాటు చేస్తోంది (Centre of Excellence on Right to Information and Capacity Building for Gram Sabha).**
**ఈ కేంద్రం, తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహకారంతో - పంచాయతీ రాజ్ సంస్థల అధికారులకు, ఎన్నికైన మహిళా ప్రతినిధులకు మరియు మండల మహిళా సమాఖ్య (MMSs) నాయకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించబోతున్నము.**

**ఈ శిక్షణా కార్యక్రమాలకు హాజరయ్యే శిక్షణార్థుల ఉపయోగార్థం ఈ కరదీపికను తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శిక్షణ కేంద్రం (TGIRD) వారి సహకారంతో రూపొందించడమైనది.**

**డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ మానవ వనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ ప్రభుత్వం**

**రోడ్డు నెం. 25, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033**

**అంతర్జాతీయ సంబంధాలు & భద్రతా కేంద్రం (సీఐఎస్)**

**భారత ప్రభుత్వం, పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG) - సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ వారి సహకారంతో**

**'సమాచార హక్కు మరియు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'**

**డా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ .**

**గ్రామీణ స్వయం సహాయక బృందాల (SHG)/ గ్రామ సంఘాల (VOs)/ మండల మహిళా సమాఖ్య (MMS) నేతలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం**

**తేదీ : 01.09.2025 to 03.09.2025**

**కోర్సు సమన్వయకర్త**: శ్రీమతి జి. ఝాన్సీ రాణి, ఫ్యాకల్టీ

**ఉద్దేశ్యాలు**

1. సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకత మరియు జవాబుదారీతనం పెంపొందించడానికి స్వయం సహాయక బృందాల (SHG) సభ్యులకు అధికార సాధికారత కల్పించడం.
2. గ్రామసభలలో పాల్గొనడం మరియు సమ్మిళిత భాగస్వామ్య పాలన కోసం మహిళా గ్రామసభల నిర్వహణ .
3. గ్రామీణాభివృద్ధి కోసం డిజిటల్ వేదికలను ఉపయోగించి స్వయం సహాయక బృందాలు (SHGలు) మరియు గ్రామ పంచాయతీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలను నెలకొల్పడం.
4. సుస్థిరమైన సంస్థ అభివృద్ధి కోసం స్వయం సహాయక బృందాల (SHG) సూత్రాలను అమలు చేయడం మరియు సామాజిక సంక్షేమం కోసం ఆరోగ్య, పోషణ మరియు సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడం.
5. నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం మరియు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, గృహ హింస వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడానికి సంఘ-ఆధారిత పరిష్కారాలను అమలు చేయడం.
6. మహిళా మరియు బాలల రక్షణ చట్టాలను అర్థం చేసుకోవడం మరియు చట్టపరమైన అవగాహన మద్దతు కోసం బలమైన స్వయం సహాయక బృందాల సామాజిక కార్యాచరణ కమిటీలను (Social Action Committees) ఏర్పాటు చేయడం

## శిక్షణ ప్రణాళిక

| సమయం | అంశం | పద్ధతి / ప్రక్రియ | గెస్ట్ ఫ్యాకల్టీ |
|---|---|---|---|
| **మొదటి రోజు (01.09.2025)** | | | |
| 10.30am<br>11.00am | నమోదు & పరిచయాలు | | **కోర్సు టీమ్** |
| **11.00 to 11.15** | **టీ విరామము** | | |

| సమయం | అంశం | పద్ధతి / ప్రక్రియ | గెస్ట్ ఫ్యాకల్టీ |
|---|---|---|---|
| 11.15 to 12.15 | తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 – సామాజిక చైతన్య వేదికగా గ్రామసభ<br>i. భారత రాజ్యాంగం & తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 - గ్రామసభ ప్రాముఖ్యత<br>ii. గ్రామసభ & ప్రజాపాలనలో భాగస్వామ్యం<br>iii. మహిళా గ్రామసభ | ఇంటరాక్టివ్ లెక్చర్ (సమావేశాత్మక ఉపన్యాసం / పరస్పర చర్యల ఉపన్యాసం) | శ్రీమతి కె. నాగమణి కార్యదర్శి, తెలంగాణ గ్రామపంచాయతీ ట్రైబ్యునల్ |
| 12.15 to 01.15 | ఇందిరా మహిళా శక్తి విధానం 2024 & IMS మిషన్ 2025 – మహిళల సమగ్ర సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమములు | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ నవీన్ కుమార్, డైరెక్టర్, ఐబి, SERP |
| **01.15 to 1.30** | **గ్రూప్ ఫోటో** | | |
| **01.30 to 02.30** | **మధ్యాహ్న భోజన విరామం** | | |
| 02.30 to 03.30 | గ్రామ పంచాయతీ స్థాయిలో పారదర్శకత<br>i. హక్కు సమాచార హక్కుచట్టం, 2005: స్వచ్ఛందంగా  సమాచార వెల్లడి<br>ii. గ్రామ సభ సమాచార హక్కు<br>iii. సమాచార హక్కు మరియు లింగ సమానత్వం<br>iv. పారదర్శకత & బాధ్యతాయుతం – సామాజిక తనిఖీ | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ శ్రీనివాస్ మాధవ్ కన్సల్టెంట్, ఆర్సీయూ డా. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఐటీ |
| **03.30 to 03.45** | **టీ విరామము** | | |
| 3.45 to 4.45pm | గ్రామ పంచాయతీతో సమన్వయం:<br>స్మార్ట్‌ఫోన్ యాప్‌ల పరిచయం -GPDP (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) డేటా /  (గ్రామ పేదరిక నిర్మూలన ప్రణాళిక) – పారిశుద్ధ్యం, ఆరోగ్యం & పోషణ, గ్రామ పంచాయతీ స్థాయి కమిటీలు | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీమతి వసంత సేనా ప్రాజెక్ట్ మేనేజర్, ఐబి, సర్ప్ |
| 4.45 to 5.15 | చిరు బృంద చర్చల కొరకు తయారి - చర్చలు<br>1. గ్రామ సభ బలోపేతం: వివిధ భాగస్వాముల పాత్ర<br>2. మహిళా గ్రామ సభ: కమ్యూనిటీ మొబిలైజేషన్ వ్యూహాలు<br>3. పంచాయితీలలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం & బలోపేతం చేయడం<br>4. కట్నం & గృహహింస<br>5. మత్తు పదార్థాల దుర్వినియోగం<br>6. ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు ఆటలు | గ్రూప్ చర్చ | **కోర్సు టీమ్** |
| **రెండవ రోజు (02.09.2025)** | | | |
| 10.00 to 10.30 | పునఃశ్చరణ | | |

| సమయం | అంశం | పద్ధతి / ప్రక్రియ | గెస్ట్ ఫ్యాకల్టీ |
|---|---|---|---|
| 10.30 to 11.30 | మహిళా సాధికారత – రాజ్యాంగ నిబంధనలు (73వ సవరణ & 106వ సవరణ) – నూతన అవకాశాలు | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ శ్రీనివాస్ మాధవ్ కన్సల్టెంట్, ఆర్సీయూ |
| **11.30 to 11.45** | **టీ విరామము** | | |
| 11.45 to 12.45 | స్వయం సహాయక సంఘాల సంస్థాగత నమూనా, నిర్మాణం, పనితీరు, సమన్వయం -– కేస్ స్టడీస్ | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ టి. రవీందర్ రావు, ప్రాజెక్ట్ మేనేజర్, SERP |
| 12.45 to 01.30 | చిరు బృంద ప్రదర్శనలు | | **కోర్సు టీమ్** |
| **01.30 to 02.30** | **మధ్యాహ్న భోజన విరామం** | | |
| 02.30 to 03.30 | బాల్యంలో లింగవివక్షా భావాలను చెరిపివేయడం – డిజిటల్ యాక్టివ్ | ఇంటరాక్టివ్ లెక్చర్/ ప్రయోగాత్మక పద్ధతి / సమూహకార్యకలాపా | శ్రీమతి తేజస్విని DHEW కోఆర్డినేటర్, హైదరాబాద్, |
| **03.30 to 03.45** | **టీ విరామము** | | |
| 3.45 to 4.45pm | స్త్రీ, శిశు సంరక్షణ మరియు అభివృద్ధికి సంబంధించిన చట్టాలు – స్వయం సహాయక బృందాల )SHGs) సామాజిక చైతన్య కమిటీలు | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ శ్రీనివాస్ మాధవ్ కన్సల్టెంట్, ఆర్సీయూ |
| 04.45 to 05.30 | చిరు బృంద ప్రదర్శనలు | | **కోర్సు టీమ్** |
| **మూడవ రోజు -3 (03.09.2025)** | | | |
| 10.00 to 10.30 | పునఃశ్చరణ | | |
| 10.30 to 11.30 | ఆరోగ్యం మరియు పోషణ - స్వయం సహాయక సంఘాల పాత్ర | బ్లెండెడ్ పద్ధతి | శ్రీమతి సునీత ,డైరెక్టర్ హ్యూమన్ డెవలప్మెంట్ యూనిట్, SERP |
| **11.30 to 11.45** | **టీ విరామము** | | |
| 11.45 to 12.45 | నాయకత్వ నైపుణ్యాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సామాజిక ఆత్మవిశ్వాసం. | ఇంటరాక్టివ్ లెక్చర్ | శ్రీ శ్రీనివాస్ మాధవ్ కన్సల్టెంట్, ఆర్సీయూ |
| 12.45 to 01.30 | గ్రామ సభ : మహిళల భాగస్వామ్యం<br>ఐపీసీ నైపుణ్యాలు మరియు సామాజిక సమీకరణ వ్యూహాలు | | |
| **01.30 to 02.30** | **మధ్యాహ్న భోజన విరామం** | | |
| 02.30 to 03.30 | మహిళల నాయకత్వానికి సవాళ్లు: వ్యూహాలు ఎన్నికైన మహిళా ప్రతినిధులకు మద్దతు | ప్రయోగాత్మక పద్ధతి/ సమూహకార్యకలాపా | **శ్రీమతి భారతి, సీనియర్ ఫ్యాకల్టీ (మాజీ)** డా. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఐటీ |
| **03.30 to 03.45** | **టీ విరామము** | | |
| 03.45 to 04.45 | ఓపెన్ హౌస్ సెషన్( చర్చా సమావేశం) | | **కోర్సు టీమ్** |
| 04.45 to 05.15 | మూల్యాంకన & వీడుకోలు కార్యక్రమం | | **కోర్సు టీమ్** |

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | వివరాలు | పేజి.నెంబర్ |
| --- | --- | --- |
| 1. | మహిళా స్నేహపూరిత గ్రామపంచాయితీ ( Women Friendly Grama panchayat) బాలల స్నేహపూరిత గ్రామపంచాయితీ ( Child Friendly Grama panchayat) మరియు బాల సభ | 1-10 |
| 2 | ఇందిరా మహిళా శక్తి | 11-26 |
| 3. | పరిపాలనలో పారదర్శకత మరియు జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టం | 27-32 |
| 4. | గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (GPDP)& గ్రామ శ్రేయస్సు పునరుద్ధరణ ప్రణాళిక | 33-48 |
| 5. | స్వయం సహాయక సంఘాల సంస్థాగత నమూనా , నిర్మాణం, పనితీరు మరియు సమన్వయం | 49-61 |
| 6. | మహిళా చట్టాలు | 62-76 |
| 7. | బాలల చట్టాలు | 77-93 |
| 8. | నాయకత్వం | 94-104 |

# అధ్యాయము 21

## శిశు, లింగ అనుకూల గ్రామ పంచాయితీ



**21.1** "స్థిరాభివృద్ధి గమ్యాలు" అంటే 2015లో 193 దేశాలు తమకై తాము సంయుక్తంగా విధించుకొన్న విశ్వజనీన లక్ష్యాలు, సూచికలే, ఈ 17 లక్ష్యాలు 2030 నాటికి కీలకమైన వివిధ సామాజిక, ఆర్థిక రంగాలలో మనం చేరుకోవాల్సిన స్థాయిని సూచిస్తాయి. ఇవి లింగ సమానత స్త్రీలు, పిల్లల శక్తీకరణ పైన కూడా దృష్టి సారించినాయి (SDGs) మరో ముఖ్యమైన లక్ష్యమేదంటే పిల్లలు గురవుతున్న హింస, అత్యాచారం, అక్రమ రవాణాలను అంతమొందించి పిల్లలకు స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడమే.

తెలంగాణా ప్రభుత్వము పిల్లలు మరియు మహిళల స్నేహ పూర్వక గ్రామ పంచాయితీల ద్వారా రాష్ట్రంలోని అందరు స్త్రీలు, పిల్లల సమగ్రాభివృద్ధి సాధించటం లక్ష్యంగా పెట్టుకొనింది. అంటే గ్రామ పంచాయితీలలో

1. పిల్లల ఎదుగుదల మరియు వారి మనుగడకు ఎంతో కీలకమైన వారి మొదటి 1000 రోజుల జీవితాన్ని పూర్తి సంరక్షణలో ఉంచడం.

2. మానవకల్పిత ప్రమాదాల నుండి నిస్సహాయులైన పిల్లలను రక్షించి, సమాజములో వారికి ఏవిధమైన భయము / ప్రమాదాలు లేకుండా పెరిగే వాతావరణాన్ని కల్పించడం.

3. ఏలాంటి వివక్షతలు లేకుండా, మానవకల్పిత ప్రమాదాల బారి నుండి మరియు సాంప్రదాయక దురాచారాల ప్రభావము ఏవి మహిళలు మరియు పిల్లల అభివృద్ధికి అవరోధం కాకుండా నిరోధించాలి.

తెలంగాణా ప్రభుత్వ రాష్ట్ర పంచాయితీ రాజ్ చట్టం 2018 ద్వారా మరియు స్త్రీ, శిశు అభివృద్ధికై వివిధ రకాలైన సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెట్టింది. అంతేకాక " ఆదర్శ గ్రామము " అంటే ఒక కల్పన మాత్రమే కాక గ్రామములోని పౌరులందరు ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల వారు స్వశక్తీకరణ చెంది, సామాజికంగా సంఘటితం అయినప్పుడు మాత్రమే ఆదర్శ గ్రామము ఏర్పడుతుంది.

" ఊయల ఊపిన చేతులే ప్రపంచాన్ని శాసిస్థాయి " మరియు " నేటి బాలలే రేపటి పౌరులు " లాంటి సామెతలు చెప్పినట్టుగానే జాతీయాభివృద్ధిలో కీలకమైన పౌరుల యొక్క శారీరక, మానసిక ధృఢత్వ, మంచి నడవడిక, పద్ధతులు మరియు పౌరసత్వ లక్షణాలు వారి నిర్మాణాత్మక దశలోనే రూపుదిద్దుకుంటాయి అయితే వీటిపై వారి చిన్న తనములో ఎదుర్కొన్న శారీరక, మానసిక హింస, లైంగిక దాడులు లాంటి చెడు అనుభవాలు కూడా వీటిని ప్రభావితం చేస్తాయి. పిల్లలను గుణవంతులుగా తీర్చి దిద్దడంలో వారికి సరైన పోషణ కల్పిస్తూ, నైతిక విలువలను నేర్పడం మరియు మానసిక స్థైర్యాన్ని కల్పించడంలో మహిళలు ముఖ్యంగా తల్లులు కీలక పాత్ర పోషిస్తారు. అందుకే మహిళల భద్రత గౌరవ మర్యాదలకు భంగము కల్గించి, వారి వ్యక్తిత్వము మరియు అభివృద్ధిని ప్రభావితం చేసే సనాతన సాంప్రదాయల నుంచి మహిళలకు విముక్తి కలుగజేయాలి.

మనదేశంలో గ్రామ పంచాయతీలే స్థానిక ప్రభుత్వ వ్యవస్థలో అతి ముఖ్యమైన భాగం, ప్రజాస్వామ్యములో విజయవంతం అవ్వాలంటే సమాజములోని ప్రజలు మరియు వారి తరపున ప్రాతినిధ్యం వహించే ప్రజా ప్రతినిధులు మొదలైన వారు పరిపాలనలోని వివిధ స్థాయిలలో పాల్గొనాలి. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిలో స్థానిక పరిపాలన విభాగము / గ్రామ పంచాయతీల ఆలోచనలు ఎలా ఉండాలి అంటే :-



ఎ. స్థానిక అవసారలను / సమస్యలను గుర్తించాలి.

బి. గ్రామ స్థాయిల నుంచి ప్రణాళికలు తయారు చేయాలి.

సి. ప్రభుత్వ పథకాలు మరియు కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలి.

**21.2 పిల్లల స్నేహ పూర్వక గ్రామ పంచాయితీ అంటే ఏమిటి ? అది ఎలా ఉండాలి ?**

- గ్రామ పంచాయతీలోని సభ్యులందరు శిశు అనుకూల కార్యక్రమాలను అర్థం చేసుకొని అభివృద్ధి చేసి వాటిని అమలు చేయాలి. పిల్లల అవసరాలను/ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వారికి ఎటువంటి సేవలను అందించాలి మరియు ఇంతవరకు అమలులో ఉన్నవాటిని ఎలా మెరుగుపరచాలి అనే అంశం పై ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి.

- ఈ కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు గ్రామపంచాయతీ సభ్యులు మరియు గ్రామపరిధిలో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగస్తులు అందరూ పాల్గొనేలా చూడాలి. దీనివల్ల వారంతా సరియైన అవగాహనతో మరియు పరస్పర సహకారంతో పిల్లల శ్రేయస్సుకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సక్రమంగా అమలు చేస్తారు. అంతేకాక వారందరు కలసి గ్రామంలోని పిల్లలను సంరక్షిస్తూ, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ వారు సమాజంలో ఏ విధమైన వివక్షతలకు గురి కాకుండా చూస్తారు.



- తల్లిదండ్రులు మరియు వారి సంరక్షకులందరికి పిల్లల సమస్యలన్నింటి పైన పూర్తి అవగాహన కలిగి ఉండాలి. పిల్లల మాటలను శ్రద్ధగా ఆలకిస్తూ వారిని అన్ని రంగాలలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలి. వారికి పూర్తి రక్షణ కల్పిస్తూ సమాజంలో వారు ఏ విధమైన వివక్షతలకు గురి కాకుండా చూడాలి.

- ఎప్పుడైతే బాలలు తమకు సంబంధించిన అంశాలు/ సమస్యల విషయాలలో వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకొంటామో, అప్పుడు పిల్లలు కూడా ఎంతో నమ్మకంగా, సంతోషంగా ఉంటారు. వారి కోసం ఏర్పాటు చేయబడ్డ విద్యా, వైద్యం, వినోదం, క్రీడలు మొదలయిన అవకాశాలను వారు పూర్తిగా వినియోగించుకోగలుగుతారు.

**21.3 పిల్లల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీగా ఉండటానికి గ్రామ పంచాయితీ ఏమి చేయాలి?**

**1. బాలల హక్కులు, అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సమస్యలపై అవగాహన కల్పించడము:**

పిల్లల హక్కులు, అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు వారి సమస్యలపైన గ్రామంలోని పంచాయతీ సభ్యులకు,

వివిధ శాఖల ఉద్యోగులకు, గ్రామ ప్రజలకు, స్వయం సహాయక సంఘ సభ్యులకు, తల్లిదండ్రులకు క్రమంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండాలి. వారు పిల్లల సమస్యలు సరియైన దృక్పథంలో అర్థం చేసుకోవడంతో పాటుగా పిల్లల సమస్యలపై సున్నితంగా స్పందిస్తారు. ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడానికి ఆ గ్రామపంచాయతీలు ఇటువంటి విషయాలపై అపార అనుభవం కలిగిన శిక్షకులను ఎస్.ఐ.ఆర్.డి (SIRD), రాష్ట్ర పంచాయతీ శిక్షణ సంస్థలు, ఎన్.జి.ఓల సహాయ సహకారాలను పొందవచ్చు. అంతేకాక పిల్లల అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్న గ్రామ పంచాయతీల సహకారాన్ని కూడా తీసుకోవచ్చును.

**2. నిర్థిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడము:**

అందరిని సంప్రదించి గ్రామపంచాయతీలు శిశు అనుకూల గ్రామపంచాయతీలను నెలకొల్పడానికి నిర్థిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్రక్రియ కోసం ఒక ప్రత్యేక గ్రామసభను ఏర్పాటుచేసి ఆ సభలో పిల్లలకు స్నేహ పూర్వక పంచాయతీలను ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని విషయాలను గుర్తించి వాటిపై చర్చించాలి. అంతేకాక ఆ గ్రామంలోని పిల్లలను కూడా సంప్రదించి వారి అభివృద్ధి మరియు సంరక్షణ కోసం నిర్థిష్ట లక్ష్యాలను ఏర్పాటు చేయాలి.

**3. స్వీయ పరిశీలన (Self Assessment):**

మనం అందుకోవలసిన లక్ష్యాలను నిర్దేశించుకున్న తరువాత, అధికారులు, లబ్ధిదారులు (Stakeholders) పంచాయతీ సభ్యులందరు కలిసి ఇప్పుడు గ్రామంలో ఉన్న స్థితి గతులను ఒకసారి బేరీజు వేసుకొని (ఉదా: అంగన్‌వాడీ కేంద్రంలో శిశువులకు అనుకూల పరిస్థితులు ఎలా ఉన్నాయి అని గమనిస్తూ) మనం నిర్దేశించుక్ను లక్ష్యాలకు మరియు వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించాలి.

**4. కార్యచరణ ప్రణాళికలను తయారు చేయడం :**

అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుతమున్న వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకున్న తరువాత ఒక సంవత్సర కాలానికి సరిపడ కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలి. ఈ ప్రణాళిక తయారు చేసేటప్పుడు అందుబాటులో ఉన్న వనరులన్నింటిని దృష్టిలో ఉంచుకొని, దీనికి అవసరమైన నిధుల సమీకరణకు వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను/ పథకాలను సమన్వయం చేస్తూ ప్రతి ఒక లక్ష్యాన్ని సాధించడానికి ఒక కార్యచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలి.

తదుపరి ఈ కార్యచరణ ప్రణాళిక అనుమతి కోసం ఒక ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేసి, గ్రామసభ యొక్క అనుమతిని తీసుకొని దాని అమలుకు గ్రామపంచాయతీ పరిధిలోని నిధులను కేటాయించడము లేదా ఇతర మార్గాల ద్వారా నిధుల సమీకరణను చేపట్టాలి.

**5. కార్యచరణ ప్రణాళిక అమలు, పర్యవేక్షణ మరియు మూల్యాంకనం :**

శిశు అనుకూల పంచాయతీల ఏర్పాటు లక్ష్యాలను చేరుకోవడానికి ఈ కార్యచరణ ప్రణాళిక ఒక సాధనంగా (రూపంగా) ఉపయోగపడుతుంది. ప్రణాళికను గ్రామంలోని పౌరులు, తల్లిదండ్రులు మరియు పిల్లల సహకారంతో అమలు చేయాలి. అంతేకాక వారందరిని ఈ కార్యక్రమం యొక్క పర్యవేక్షణలో భాగస్వాములుగా ఉండేలా ప్రోత్సహించాలి మరియు ఈ ప్రణాళికను సంవత్సరం లేదా రెండు సంవత్సరాలకు ఒకసారి మూల్యాంకనం చేసేలా గ్రామసభలో తీర్మానించాలి.

**గ్రామ పంచాయతీలు పనితీరును పరిశీలించే కొన్ని ముఖ్య సూచికలు:**


1. గ్రామపంచాయతీ పరిధిలోని జనన, మరణాలను నమోదు చేయడం

2. గ్రామపంచాయతీ పరిధిలో పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల స్థితిగతులను పరిశీలించడము (coverage & percentage)

3. పాఠశాల మరియు అంగన్‌వాడి కేంద్రాలలో రక్షిత త్రాగునీటి సరఫరాను పరిశీలించడం

4. 3 నుండి 6 సం॥ల వయస్సు కలిగిన పిల్లలందరిని గ్రామపరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు మరియు పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలలో నమోదు చేయడం

5. ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరు (children with special needs) గ్రామ పరిధిలోని పాఠశాలలో నమోదు చేయడం

6. పాఠశాల మరియు అంగన్‌వాడి కేంద్రాలలో నాణ్యమైన ఆహారము మరియు వివక్షతలు లేని వసతులను కల్పించడం

7. కౌమారదశలో ఉన్న పిల్లలందరు "సబల" మరియు "సాక్షము" పథకాల ద్వారా లభించే సేవలన్నింటిని వినియోగించుకునేలా చేయడము.

8. గ్రామంలోని ఏ పిల్లలు కూడ బాల కార్మికులుగా నియమించబడకుండా చేయడం

9. గ్రామ శిశు సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి, దాని ద్వారా శిశు రక్షణ కార్యక్రమాలు చేపట్టేలా చేయడం

10. బాల్య వివాహాలను నియంత్రించడం.

11. పాఠశాలల యందు బాల బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యము కల్పించాలి.

**21.4 పిల్లల భాగస్వామ్యం వలన ఉపయోగాలు:-**

- పంచాయతీ, పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లలకు లభించే సేవల వినియోగం మెరుగుపడుతుంది
- పిల్లల యొక్క సామాజిక, వ్యక్తిగత నైపుణ్యాలు మరియు జ్ఞానం అభివృద్ధి చెందుతాయి. పౌరసత్వం పై ఒక సానుకూల దృక్పథంతో పాటు నిర్ణయాధికారాలు కూడా మెరుగుపడతాయి
- పిల్లలలో ఆత్మ స్థైర్యము మరియు ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
- నిస్సహాయక స్థితిలో ఉన్న పిల్లల పై జరుగుతున్న దాడులు మరియు వివక్షతలను తగ్గించి వారికి ఒక సురక్షితమైన వాతావరణాన్ని కల్పించగలుగుతుంది.
- పిల్లలు వారి సహచరుల యొక్క నిర్ణయాలను గౌరవిస్తూ, కొన్ని ప్రత్యేక సందర్భాలలో పెద్దలు తీసుకున్న నిర్ణయాలను కూడ అర్థం చేసుకోగలుగుతారు.
- గ్రామసభ, బాలసభ లాంటి సమావేశాల ద్వారా వారికి, చురుకైన పౌరసత్వము, జాతీయత అంటే ఏమిటో తెలుస్తుంది.

**21.5 పాఠశాలల్లో పిల్లల భాగస్వామ్యాన్ని పెంచే పద్ధతులు: -**



పిల్లలు వారి పాఠశాలలోని వివిధ రకాల కార్యక్రమాలలో పాల్గొన్నట్లయితే వారు విద్యను ఆనందంగా ఆస్వాధిస్తారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా పిల్లల భాగాస్వామ్యాన్ని పెంపొందించవచ్చు.

**1. స్కూల్ క్లబ్:**

విద్యార్థులే స్కూల్ క్లబ్‌లను ఏర్పాటు చేసుకుంటారు. వీరికి ఉపాధ్యాయులు/తల్లిదండ్రులు సలహాదారులుగా ఉంటారు.

వారి ప్రోద్బలంతో పిల్లలు క్లబ్‌ల ద్వారా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తారు.



ఉదా:- ఆర్ట్స్, సైన్స్, కథలు, వృత్తిపరమైన శిక్షణలు మొదలగునవి, పిల్లలు వారికి నచ్చిన కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎవరికి ఇష్టమైన కార్యక్రమంలో వారు చేరవచ్చు. ఇందులో ప్రవేశానికి ఏ విధమైన రుసుములు అవసరం లేదు.



ఒకే విధమైన ఆలోచనలు, ఇష్టాలు, అభిరుచులు ఉన్న విద్యార్థులందరు ఈ క్లబ్ ద్వారా చేరువౌతారు. ఇలాంటి కార్యక్రమములు నిర్వహించడం వలన విద్యార్థులలో భాగస్వామ్య ధోరణి మెరుగుపడడంలో ఉపకరిస్తుంది.

**2. స్కూల్ పార్లమెంట్ :**

స్కూల్ పార్లమెంట్ ద్వారా పిల్లలు వారి యొక్క పౌర మరియు సామాజిక నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను, భాగస్వామ్య పద్ధతులు, నిర్ణయాధికారము మరియు సంభాషణ చాతుర్యాన్ని పెంచడంలో సహకరిస్తుంది. పిల్లలకు ఎన్నికల ప్రక్రియలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పని తీరును అర్థం చేసుకోవడంలో ఈ స్కూల్ పార్లమెంట్ విధానం ఎంతగానో సహాయపడును.

**3. పరిపాలనలో పిల్లల భాగస్వామ్యము :**

గ్రామ జనాభాలో పిల్లల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. కాని వారు పిల్లలు అవడం చేత ఓటు వేసే హక్కు గాని, ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కాని, పంచాయతీలలో సభ్యులుగా ఉండే అవకాశం కాని వారికి లేదు. అందుకనే పిల్లల యొక్క అవసరాలను మరియు సమస్యలను గుర్తించి అర్థం చేసుకోవడానికి ఒక ప్రత్యామ్నాయ సమావేశాలను ఏర్పాటు చేసి వారిని ఈ సమావేశంలో పాల్గొనేలా చేయాలి.

బాల గ్రామసభ మరియు గ్రామ స్థాయి శిశు సంరక్షణ కమిటీలో పిల్లలు పాల్గొనే అవకాశాలను కల్పిస్తూ వారిని కూడ పరిపాలనలో భాగస్వామ్యులను చేయాలి.

**a. పిల్లల గ్రామసభ:**

పిల్లల గ్రామసభ ద్వారా పిల్లలను గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక రచనలో భాగస్వామ్యులను చేస్తూ, ప్రజాస్వామిక పద్ధతులను అర్థం చేసుకొనేలా చేయాలనే ముఖ్య ఉద్దేశంలో పిల్లల గ్రామసభలను ఏర్పాటు చేయాలి. ఈ సభలో గ్రామంలోని ప్రతి వార్డు నుంచి 10-18 సంౢల వయస్సు కలిగిన పిల్లలందరిని పాల్గొనేలా చేసి, వారి ద్వారా గ్రామంలోని పిల్లల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన పథకాలు / కార్యక్రమాల అమలులోని లోపాలను గుర్తించి వాటిని పరిష్కరించి సక్రమంగా అమలు చేయడానికి పిల్లల సలహాలు, సూచనలు స్వీకరించాలి. అంతేకాక ఈ సభలో అన్ని వర్గాల వారి పిల్లలు పాల్గొనేలా ప్రోత్సహించాలి.

**b. గ్రామస్థాయి పిల్లల రక్షణ కమిటీలో పిల్లల ప్రాతినిధ్యం :**

గ్రామస్థాయి పిల్లల రక్షణ కమిటిలో తప్పని సరిగా ఆ గ్రామం నుండి 14 సంౢలకు పైబడిన ఇద్దరు (ఒక బాలిక మరియు 1 బాలురు) ప్రాతినిధ్యం వహించాలి. అంతేకాక వారిని కమిటీ సంబంధిత సమావేశాలు/చర్చలలో పాల్గొనే అవకాశం

కల్పించి వారి యొక్క అభిప్రాయాలను/ సూచనలను ధైర్యంగా వ్యక్తపరిచే అవకాశాలను కల్పించాలి.

C. **పిల్లలకు అనుకూలమైన ప్రదేశాలు :**

గ్రామంలోని సామాజిక ప్రదేశాలైన గ్రంథాలయం, పార్కు, ఆట స్థలాలను ఏ విధమైన లింగ, కుల, మత, ఆర్థిక స్థాయిలతో సంబంధం లేకుడా గ్రామంలోని అందరు పిల్లలకు అందుబాటులో ఉండాలి. ఇలాంటి స్థలాలలో వారు ఏవిధమైన జంకు, సంకోచం లేకుండా వారి వినోద మరియు క్రీడా కార్యకలాపాలను కొనసాగించుకోవాలి. పిల్లల వినోదం/క్రీడల కోసం ఉపయోగించు ప్రదేశాలను చదును చేసి వాటిలో ఏవిధమైన రాళ్ళు, పిచ్చి మొక్కలు లేకుండా గ్రామపంచాయతీ చర్యలు తీసుకోవాలి.

**పిల్లల భాగస్వామ్యం పెంచడంలో గ్రామపంచాయతీ పాత్ర:**

1. పైన సూచించిన వివిధ రకాల కార్యక్రమాలలో పిల్లలు పాల్గొనేలా చేయడం.
2. గ్రామంలో ఎన్నికకాబడిన ప్రతినిధులు బాలసభ, గ్రామసభలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపి ఈ సమావేశాలలో పిల్లలు లేవనెత్తిన అంశాలపై వారితో చర్చించి వాటి పరిష్కారానికి అందరికి ఆమోదయోగ్యమైన నిర్ణయాలను తీసుకోవాలి.
3. గ్రామపరిధిలోని పాఠశాలలో ముఖ్య జాతీయ పండుగలైన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, బాలల దినోత్సవం లాంటి సంబరాలను ఆయా పాఠశాలలో జరుపుకునే అవకాశం కల్పించి, ఈ సందర్భంగా వారికి వివిధ రకాలైన ఆటల పోటీలను, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.
4. అన్ని ప్రభుత్వ/సామాజిక ప్రదేశాలలో ఎలాంటి వివక్షతలకు తావు లేకుండా అన్ని సామాజిక వర్గాల వారి పిల్లలు, బాల బాలికలు, అంగవైకల్యం కలిగిన పిల్లలందరు ఈ స్థలమును వినియోగించుకునేలా గ్రామపంచాయతీలు చర్యలు తీసుకోవాలి.
5. క్రమం తప్పక పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి, పాఠశాలలోని పిల్లలందరకి ఒకస్నేహ పూర్వక వాతావరణం కల్పించేలా సర్పంచ్ గారు చర్యలు తీసుకోవాలి.
6. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరియు ఎ.ఎన్.యం, ఆశా వర్కర్ల యొక్క పనితీరును సర్పంచ్ / గ్రామ పంచాయతీలు స్వయంగా పర్యవేక్షించాలి.
7. గ్రామంలో మహిళా శిశు సంక్షేమము మరియు ఆరోగ్యము కొరకు అమలు అవుతున్న పథకాలను, కార్యక్రమాలను గ్రామ సర్పంచులు / గ్రామ పంచాయతీలు స్వయంగా పర్యవేక్షించాలి.

## 21.6 మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయితీలు

లింగ అసమానతలు అనేవి అనేక విధాలుగా మనకు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు అవకాశాల కల్పనలోను అసమానతలు, ఆరోగ్య సేవలు కల్పించడంలోను, వృత్తి పరమైన అసమానతలు, గృహాలలో అసమానతలు, పౌష్టికాహార కల్పనలోను అసమానతలు మనం గమనిస్తున్నాం.

గ్రామీణ ప్రాంతాలలో 10 మంది మహిళలలో ఒకరు మాత్రమే పాఠశాల విద్యను పూర్తి చేస్తున్నారు, ప్రతి ముగ్గురు మహిళలలో ఇద్దరు మహిళలు నీటి సదుపాయం/మరుగుదొడ్డి సౌకర్యం లేని గృహాలలో నివసిస్తున్నారు. 65% మంది మహిళలు వంటచెరుకు కోసం కలప మరియు పశువుల పేడ ఉపయోగిస్తున్నారు. 58% మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. 9%

మహిళలకు మాత్రమే సొంత ఆస్తులున్నాయి. 66% మంది గ్రామీణ మహిళలను సొంతంగా ప్రయాణించడానికి వారి కుటుంబ సభ్యులు అంగీకరించరు. NSSO అంచనాల ప్రకారం 1993-94 మరియు 2009-2010 మధ్య కాలంలో కార్మిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం 36.8% నుండి 27% కు తగ్గిపోయింది. జాతీయ నేర రికార్డుల ఆధారంగా చూస్తే మహిళలపై జరిగే నేరాలు 29.6% అధికం అయినట్లుగా తెలుస్తుంది. జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే - III ప్రకారం 39% మంది గ్రామీణ మహిళలు వారి 15-49 సం॥ మధ్య వయస్సులో ఎన్నో రకాలైన శారీరక, మానసిక హింసలకు గురవుతున్నారు.

2011 జనాభా సమాచారం ప్రకారం 121.00 కోట్ల మహిళ జనాభా మన దేశంలో నివసిస్తున్నారు. ఇది దేశ జనాభాలో 48.5% ఉంది. క్రింది పట్టిక మన దేశ మహిళల యొక్క స్థాయిని సూచిస్తుంది.

| క.సంఖ్య | వివరాలు | స్త్రీలు | పురుషులు |
|---|---|---|---|
| 1. | లింగ నిష్పత్తి | 943 | 1000 |
| 2. | ఆయుర్ధాయం | 69.6% | 66.4% |
| 3. | అక్షరాస్యత | 59.3% | 78.8% |
| 4. | ఆర్థిక భాగస్వామ్యం (శ్రామిక వ్యవస్థ) | 25.51% | 78.8% |
| 5. | మహిళలపై హింస (NCRD-2022 రికార్డులు) | 4,45,256 కేసులు రిజిష్టరు చేయబడ్డాయి | |

భారత ప్రభుత్వం మహిళలకు స్థానిక ప్రభుత్వంలో 33 1/3% రిజర్వేషన్ కల్పించింది. మన తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలో మహిళలకు 50% రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. తెలంగాణ రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు కలవు. ఇందులో 50% మహిళా సర్పంచులుగా ఎన్నిక కాబడుతారు. అలాగే **1,13,556 వార్డులకు గాను 50%** మహిళలు వార్డు సభ్యులుగా ఎన్నిక కాబడుతారు. కాని ఎన్నికైన మహిళా ప్రతినిధుల ప్రమేయం / భాగస్వామ్యం పాలనలో మెరుగుపడాల్సిన అవసరం ఇంకా ఉంది. అంతేకాకుండా వారి కుటుంబ సభ్యుల జోక్యం తగ్గి, స్థానిక పరిపాలనలో మహిళల భాగస్వామ్యం 100 శాతానికి చేరుకోవడంపై దృష్టి సారించాలి.

అందుకే లింగ సమానత్వం, మహిళల పురోగతి (అభివృద్ధి) చెంది, మహిళల సాధికారతను సులభతరం చేయాలంటే గ్రామపంచాయతీలు సుస్థిర ప్రాతిపదికన కొన్ని ప్రోత్సహకాలు తీసుకొని మహిళా అనుకూల గ్రామపంచాయతీలను నెలకొల్పాలి.

### 21.7 మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయితీ ఎలా ఉండాలి ?

1. లింగ సమానత్వం, చట్టబద్ధత, దాని విలువలు మొదలైన వాటిపై అవగాహన ప్రతి కుటుంబములోని వారికి తెలిసిఉండాలి. ఇందుకుగాను గ్రామపంచాయతీ మానవ సంపూర్ణ అభివృద్ధి అంటే ఏమిటి, కుటుంబము, సమాజములో ఉన్న వివక్షతల ప్రభావం వ్యక్తి అభివృద్ధిపై ఏ విధంగా ప్రభావితం చేస్తుంది అనే అంశాలపై గ్రామ ప్రజలలో అవగాహన కల్పించాలి.

2. ఎన్నిక కాబడిన పంచాయతీరాజ్ సంస్థల సభ్యులు మరియు స్వయం సహాయక సంఘ సభ్యులు కలిసికట్టుగా గ్రామంలోని పిల్లలందరు పాఠశాలకు వెళ్ళే దిశగా చర్యలు చేపట్టాలి.

3. బాల్యవివాహాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

4 గ్రామంలోని వనరులు మరియు సేవలను అందిపుచ్చుకోవడంలో స్త్రీ, పురుషులిద్దరికి సమాన అవకాశాలను కల్పించాలి. ఉదా: గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించడము వలన, పంచాయతీ కార్యకలాపాలలో ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొనే అవకాశం ఉంది.

5 ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకోవడం కోసం అడ్డంకులుగా ఉన్న కొన్ని సాంప్రదాయక, పితృస్వామిక భావాలను తొలగించడానికి సున్నితమైన ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి.

## 21.8 మహిళా స్నేహపూర్వక పంచాయితీలను ఏర్పాటు చేయడంలో గ్రామ పంచాయితీల పాత్ర:-

సర్పంచుగారు ఇతర సభ్యుల సహకారంతో చురుకుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి దాని పురోగతిని పర్యవేక్షించాలి.

1 పాఠశాలలో బాలికలందరిని నమోదు చేయాలి.

2 ఋతుస్రావ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలి.

3 ఏ విధమైన వివక్షతలు లేకుండా పాఠశాలలోని బాలబాలికలందరికి ఆరోగ్య సేవలను అందించాలి.

4 గ్రామంలోని అందరికి త్రాగునీటి సౌకర్యం కల్పించాలి.

5 ప్రతి గృహంలోను మరుగుదొడ్డి సౌకర్యం కలిగి ఉండి, వాటిని ఉపయోగించుకొనేలా చేయాలి.

6 ప్రతి పాఠశాల మరియు ప్రభుత్వ కార్యాలయాలలో స్త్రీలు/బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలి.

7 మహిళలు / బాలికలపై ఎవరు/ఎలాంటి లైంగిక వేదింపులకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలి.

8 మానవ అక్రమ రవాణాలాంటి నేరాలను ముందుగానే గుర్తించి సంబంధిత నేర నిరోధక సంస్థల సహకారంతో వాటిని అరికట్టాలి.

9 100% ప్రసవాలు ఆసుపత్రిలలోనే జరిగేలా చూడడము - సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోను మరియు గ్రామంలోని ఎ.ఎన్.యం, ఆశా వర్కర్ మరియు అంగన్‌వాడి వర్కర్‌ల యొక్క పనితీరును సర్పంచ్‌గారు తరచుగా పర్యవేక్షిస్తూ, గ్రామంలోని మహిళలందరు వారి కోసం ఉన్న సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకునేలా చేయాలి.

## 21.9 మరారికులం (దక్షిణం) గ్రామ పంచాయితీ విజయగాథ

కేరళ రాష్ట్రంలోని అలప్పుజా జిల్లాలో మరారికులం అనే గ్రామము (దక్షిణం) పశ్చిమ తీరాన ఉంది. 15600 కుటుంబాలతో ఈ గ్రామ పంచాయితీ మహిళాస్నేహపూర్వక పంచాయితీగా ఖ్యాతికెక్కి ఎన్నో అవార్డులను గెల్చుకొంది. ఈ పంచాయితీ స్నేహపూర్వక గ్రామ పంచాయితీగా గుర్తింపు పొందటానికి చేపట్టిన కొన్ని ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

- పంచాయితీలో 50 శాతానికి మించి స్త్రీలు గ్రామపంచాయతి ప్రతి నిదులుగా ఎన్నికైనారు.

- మానస, బాలకైరాలి అనే పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంచడానికి ముఖ్యంగా వెనుకబడిన బలహీనవర్గాల బాలికలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులను పంచాయితీ నిర్వహిస్తోంది, ఈ కార్యక్రమములు మంచి ఫలితాలు వస్తున్నాయి.
- పోకిరీల దుశ్చర్యలు నిలువరించేందుకు పాఠశాలల్లోని బాలికలకు టేక్వండో ఇతర లాంటి ఆత్మ రక్షణా పద్ధతులపైన శిక్షణ కార్యక్రమాలను గ్రామ పంచాయతీలు నిర్వహిస్తున్నాయి.
- ఇక బాలుర విషయానికి వస్తే మద్యపానం, డ్రగ్స్, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లకు, దురలవాట్లకు బానిసలు కాకుండా కౌన్సెలింగ్ తరగతులు పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.
- మరారికులం గ్రామ పంచాయితీ జెండర్ బడ్జెటింగును నిర్వహిస్తోంది మంజూరైన ప్రాజెక్టులలో 60 శాతానికి పైగా మహిళా సంక్షేమానికి దానికి సంబంధించినవి.
- BRICS ప్రతినిధులు ఈ గ్రామ పంచాయితీని సందర్శించి ఇక్కడ అమలైన స్త్రీ స్నేహపూర్వక చర్యలను కొనియాడారు.

కనుక గ్రామ పంచాయితీలు స్థానిక ప్రభుత్వ వ్యవస్థలో వాటి కున్న ప్రత్యేక స్థానం దృష్ట్యా అవి ప్రజలకు దగ్గరగా ఉండటం వలన శిశు మరియు మహిళా స్నేహ పూర్వక గ్రామ పంచాయితీలుగా తీర్చిదిద్ది సుస్థిరమైన ప్రగతిని అందించటంలో తమ వంతు కృషి చేయాలి.

### 21.10 వయోవృద్ధుల (సీనియర్ సిటిజన్) స్నేహపూర్వక గ్రామ పంచాయితీలు

ప్రజల సగటు ఆయుర్ధాము పెరగటము వలన దేశంలో వయోవృద్ధుల సంఖ్య కూడా  పెరిగింది (60 సం॥ పై బడిన వారు) 2011 జనాభా గణాంకాల ప్రకారము రాష్ట్ర జనాభాలో దాదాపు 9.29 శాతము (32.69 లక్షల) వయోవృద్ధులు నివసిస్తున్నారు. మానవ అభివృద్ధిలో వయోవృద్ధుల సంక్షేమము కూడ ఒక ముఖ్యమైన అంశము.  మన రాజ్యాంగములోని 41వ అధికరణలో కూడ దీనిని నిర్దేశించింది.  వృద్ధాప్య సంరక్షణతో పాటుగా ఒంటరితనము, సామాజిక భద్రత కూడ వయోవృద్ధులకు ప్రధాన ఆందోళనలు. వృద్ధులు వారి యొక్క  ప్రతి అవసరం గురించి వారికి రక్షణ మరియు కావలసిన మద్ధతును అందించేందుకు ప్రభుత్వం వివిధ రకాలైన  కార్యక్రమాలను ప్రవేశపెట్టింది.

1. చేయూత
2. వయోవృద్ధుల సమగ్ర సేవా కార్యక్రమాలు
3. రాష్ట్రీయ వయోశ్రీ యోజన

**1. చేయూత పథకం:**

తెలంగాణా ప్రభుత్వము పేదరికంలో ఉన్న వృద్ధుల కోసం చేయూత పెన్షన్లు అనే సాంఘిక భద్రతా పథకాన్ని అమలు పరుస్తుంది.  ఈ పథకం క్రింద అర్హులైన వారికి నెలకు రూ.2016/- పెన్షను లభిస్తుంది.

ఈ పథకం అమలులో పంచాయితీ కార్యదర్శి కీలక పాత్ర వహిస్తారు.  ఈ పెన్షన్ కోసము అందిన దరఖాస్తులు స్వీకరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను నిర్ణయిస్తారు.  అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటిని పరిశీలించిన పిదప అర్హులైన దరఖాస్తు దారులకు జిల్లా కలెక్టరు గారు పింఛను మంజూరు చేస్తారు.

**2. వయోవృద్ధుల సమగ్ర సేవా కార్యక్రమాలు:**

ఈ పథకాన్ని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ మరియు ఎంపవర్‌మెంట్, న్యూఢిల్లీ వారు ప్రవేశపెట్టారు. నిరుపేదలైన వయోవృద్ధుల కోసం వృద్ధాశ్రమాలను నెలకొల్పడానికి పంచాయతీరాజ్ సంస్థలు మరియు ప్రభుత్వేతర సంస్థలు నిధుల కొరకు ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పించాలి.

గ్రాంట్లు క్రింది విధంగా ఇవ్వటం జరుగుతుంది.

- వృద్ధాశ్రమాలు – సంవత్సరానికి రూ.21.60 లక్షల వరకు (25 మంది వృద్ధుల కోసం)
- స్త్రీల కొరకు వృద్ధాశ్రమాలు – సంవత్సరానికి రూ.35.00 లక్షల వరకు (50 మంది కోసం)
- వృద్ధుల కోసం ఫిజియోథెరపి క్లినిక్కులు – సంవత్సరానికి రూ.6.48 లక్షల వరకు
- వృద్ధుల కోసం మొబైల్ క్లినిక్కులు – సంవత్సరానికి రూ.11.20 లక్షల వరకు
- అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధితో బాధపడుతున్న వృద్ధుల కోసం నిరంతర సేవా సదనాలు – సంవత్సరానికి రూ.24 లక్షల వరకు (20 మంది వృద్ధుల కోసం)

ఎన్.జి.ఓలు / పంచాయతీరాజ్ సంస్థలు ఒకవేళ దరఖాస్తు సమర్పించినట్లయితే ప్రతి 5 సంవత్సరముల కొకసారి ఆవర్తన లేని గ్రాంట్లు (నాన్ రికరింగ్) దరఖాస్తుల పరిశీలన పిదప మంజూరు చేసే అవకాశం ఉంది.

**3. రాష్ట్రీయ వయోశ్రీ యోజన :**

1, ఏప్రిల్, 2017 ఈ వయోశ్రీ యోజన పథకము దేశంలోని 325 జిల్లాల్లో ప్రారంభించారు. తెలంగాణలోని హైద్రాబాద్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ కార్యక్రమము అమలుపరుస్తున్నారు. ఈ పథకము ద్వారా అర్హులైన వృద్ధులందరికి ఊతకర్రలు, ట్రైపాడ్లు, క్వాడ్ పాడ్స్, మోచేతి క్రచ్‌లు, వీల్ ఛైర్స్, వినికిడి సాధనాలు, కళ్ళద్దాలు మొదలయినవి ఉచితంగా ఇస్తారు. సాంఘీక సంక్షేమ శాఖ వెబ్‌సైట్ నుండి వివరాలను సేకరించి గ్రామపంచాయతీలు కూడా ఈ పథకం ద్వారా నిధులను పొందవచ్చు.

నిస్సాహాయక స్థితిలో ఉన్న వారి పిల్లలు, మహిళలు, వృద్ధుల యొక్క సంక్షేమము లేకుండా మానవ జాతి సంపూర్ణంగా అభివృద్ధి జరుగదు. అందుకనే ఆయా గ్రామపంచాయతీలు ఈ వర్గాల ప్రజలపై చొరవ తీసుకొని వారి కోసం లభ్యమయ్యే అన్ని సేవలను పర్యవేక్షించడంతో పాటుగా అందుబాటులో ఉన్న అన్ని ఆరోగ్య సేవలు, సదుపాయాలు మొదలగు వాటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

## 21.11 ముగింపు

పిల్లలు మరియు మహిళల స్నేహ పూర్వక పంచాయితీలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలోని పిల్లలకు రక్షణ కల్పించి, మహిళలను సంఘటితం చేయడము ద్వారా మహిళలు, పిల్లల, వృద్ధుల సంక్షేమము మరియు వారి సంపూర్ణ అభివృద్ధికి గ్రామ పంచాయితీలు పూర్తి భరోసాను కల్పించగలుగుతాయి.







# ఇందిరా మహిళా శక్తి మిషన్- 2025

## మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి

ఇందిరా మహిళా శక్తి

మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి

# ఇందిరా మహిళా శక్తి మిషన్- 2025

తెలంగాణ ప్రభుత్వము


పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ
Mission for Elimination of Poverty in Municipal Areas (MEPMA)
Department of Municipal Administration & Urban Development, Govt of Telangana
పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా


L POVERTY (SERP
ABAD
LADDU
k Loan / CIF

# ఇందిరా మహిళా శక్తి

**జీవితాన గెలుపుందని నమ్మకాన్ని పెంచుదాం!**
**స్వర్గమనేది ఎక్కడున్న నేల పైకి దించుదాం!**
**ఆత్మ బలం కూడగట్టి ఆకశాన్ని వంచుదాం!**
**స్వర్గమనేది ఎక్కడున్న నేల పైకి దించుదాం!**
**ఆశయాల నీరు పోసి ఆశలన్ని పెంచుదాం!**
**స్వర్గమనేది ఎక్కడున్న నేల పైకి దించుదాం!**

## స్వర్గమనేది ఎక్కడున్న నేల పైకి దించుదాం!

స్వయం సహాయక సంఘాల మహిళలు తమ సమావేశాలను ఈ శక్తివంతమైన ప్రార్థన గీతంతో ప్రారంభిస్తారు, దీనిలో వారు సామాజిక-ఆర్థిక సాధికారతను సాధించడానికి అన్ని అడ్డంకులను ఛేదించడానికి మరియు బద్దలు కొట్టడానికి సంకల్పిస్తారు. గౌరవ ముఖ్యమంత్రి గారు తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రార్థనను నిజం చేయడానికి 12 మార్చి 2024న ప్రతిష్టాత్మకమైన "ఇందిరా మహిళా శక్తి" కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళల శ్రేయస్సు శిఖరాలను చేరుకునేలా మరియు కోటీశ్వరులుగా మారేలా చేయాలని ఆయన సంకల్పించారు.

ఆయన మాటలకు కట్టుబడి, గత సంవత్సరం గణనీయమైన పురోగతితో సాధారణమైన ఆ యొక్క ప్రార్థన నిజమవుతోంది. ఒక గొప్ప నిర్ణయంతో, గౌరవ ముఖ్యమంత్రి గారు అన్ని ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్‌లను ఇకపై శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలే కుట్టాలని ఆదేశించారు. దాదాపు 30,000 మంది స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ లు (దర్జీలు) ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులకు 35 లక్షల యూనిఫామ్‌లను కుట్టి, రికార్డు స్థాయిలో పాఠశాలలు పునప్రారంభించే రోజు నాటికి వాటిని ప్రభుత్వ పాఠశాలలకు అందజేసి రూ.30 కోట్ల అదనపు ఆదాయం సంపాదించారు. దీంతో ఆగకుండా, స్వయం సహాయక సంఘాల మహిళలను 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలుగా నియమించి, వారు రూ.634 కోట్ల విలువైన పనులు చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారు.

ఈ సంవత్సరం స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు అనుసంధానంలో రూ.20,000 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే, **SERP**, **MEPMA** మరియు స్త్రీనిధి బ్యాంక్ ఈ పిలుపునకు స్పందించి, ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా ఒక నెల సమయం ఉండగానే ఇప్పటికే రూ.21,623 కోట్లు సాధించాయి. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి గారి దార్శనికతకు ధన్యవాదాలు తెలుపుతూ, సాధారణ నేపథ్యం నుండి వచ్చిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఇప్పుడు సోలార్ పవర్ ప్లాంట్లు, **TGSRTC** బస్సులు, పెట్రోల్ బంక్‌లు మొదలైన వాటిని ఏర్పాటు చేసి గర్వించదగిన యజమానులుగా ఎదుగుతున్నారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే మరియు ఇలాంటి సాధికారిక కార్యక్రమాలు మరెన్నో భవిష్యత్తులో రాబోతున్నాయి.

ఇందిరా మహిళా శక్తి పథకం కింద తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను మరియు వారి కుటుంబ సభ్యులను రూ.2 లక్షల రుణ బీమా మరియు రూ.10 లక్షల ప్రమాద మరణ బీమాతో రక్షించడం ద్వారా ఊహించని పరిణామాల నుండి కాపాడింది. దీనికి గాను పేద స్వయం సహాయక సంఘాల మహిళలను ఆదుకోవడం కొరకు ఇప్పటికే అనేక వేల స్వయం సహాయక సంఘాలకు రూ.78 కోట్లు మంజూరు చేయబడ్డాయి.

మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి 2024 పాలసీ ద్వారా చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకునే వేదికను సిద్ధం చేసినప్పటికీ, దాని ద్వారా లబ్ధి పొందే వారిని మరింత లోతుగా, విస్తృతంగా ఎదిగించుట ఎంతైనా అత్యవసరం.

అందుకే, ఇందిరా మహిళా శక్తి 2025 అనేది మునుపటి విధానానికి కొనసాగింపుగా మరియు గ్రామీణ, పట్టణ, యువతులను మరియు వృద్ధులను సాధికారత అనే ఒకే గొడుగు క్రిందకు తీసుకురావాలనే లక్ష్యంతో కొనసాగుతుంది.

# ఇందిరా మహిళా శక్తి మిషన్ - 2025

### *అందుకున్న విజయాలను అందరికి పంచుదాం !*
### *స్వర్గమనేది ఎక్కడున్నా నేల పైకి దించుదాం !*

ప్రార్థన గీతంలో సమాజంలోని అన్ని వర్గాలతో విజయాన్ని పంచుకోవాలనే స్పష్టమైన సందేశం కూడా ఉంది. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల ఉప-నియమాలలో (Bye laws) 18 నుండి 60 సంవత్సరాల వయస్సు గలవారు మాత్రమే సంఘాలలో చేరడానికి వయోపరిమితి ఉంది, ఇది యుక్తవయసు వారిని మరియు వృద్ధులను ఈ విధంగా లబ్ధి పొందడం నుండి మినహాయిస్తుంది. ఒక చారిత్రాత్మక చర్యలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం కౌమారదశలోని (15 - 18 సంవత్సరాల) బాలికలను మరియు వృద్ధ మహిళలను స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది.

## 1. యువతను అభివృద్ధిలోకి తేవడం మరియు వారిని స్వయం సహాయక సంఘం కుటుంబంలో భాగం చేయడం:

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక కౌమార జనాభాను కలిగి ఉంది. తెలంగాణలో 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల లక్షలాది మంది కిశోర బాలికలు ఉన్నారు. ఈ దశ బాల్యం మరియు యుక్తవయస్సు మధ్య మధ్యవర్తిత్వం వహిస్తుంది మరియు మానసిక, భావోద్వేగ మరియు మానసిక శ్రేయస్సు కోసం ఇది అత్యంత ముఖ్యమైన దశ. కిశోర దశలోని వారు వృద్ధి చెందడానికి, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి మరియు సమాజానికి సహకరించడానికి ఒక వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం. అభివృద్ధి ప్రక్రియలో కిశోరదశలోని వారిని క్రియాశీల భాగస్వాములుగా చేయడం అవసరం. ఆరోగ్యం, పోషకాహారం, విద్య మరియు ఉపాధి అభివృద్ధి కోసం కొత్త మరియు వినూత్న కార్యక్రమాలను రూపొందించడం మరియు అమలు చేయడం అవసరం. ఈ కిశోరదశలోని వారిని సమగ్రంగా, సమన్వయ పద్ధతిలో చేరుకోవడం వల్ల వారు సాధికారత సాధిస్తారు మరియు వారి జీవితాలను స్వయం సమృద్ధిగా మరియు సాధికారికంగా గడపడానికి వీలు కల్పిస్తుంది. ఈ కిశోరదశలోని వారిలో చాలామంది మహిళా స్వయం సహాయక సంఘాల కుటుంబాలకు చెందినవారు ఉంటారు. ఈ బాలికలలో చాలామంది యుక్తవయస్సు వచ్చిన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాలలో చేరుతారు. UNICEF (United Nations International Children's Emergency Fund) భాగస్వామ్యంతో, తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాల్లో 15-18 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేస్తుంది. ఇది మంచి ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక పరిజ్ఞానం, నాణ్యమైన విద్య మొదలైన వాటికి ప్రాధాన్యతతో లక్షలాది మంది బాలికలకు సాధికారత కల్పిస్తుంది మరియు వారు యుక్తవయస్సులోకి అడుగు పెట్టేటప్పుడు సాధికారిక యువతులుగా వికసించడానికి సహాయపడుతుంది.

## 2. వృద్ధులను సంరక్షించడం మరియు వారి అనుభవం నుండి లాభం పొందడం:

పెరిగిన ఆయుర్దాయం మరియు మారుతున్న కుటుంబ పరిస్థితుల దృష్ట్యా , చాలా మంది వృద్ధులు ఆర్థిక అభద్రత, సామాజిక ఒంటరితనం మరియు పరిమిత ఆరోగ్య సంరక్షణ సమస్యను ఎదుర్కొంటున్నారు. వృద్ధుల స్వయం సహాయక సంఘాలు (SHGs) ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక మద్దతు మరియు క్రియాశీల సంఘ భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా ఈ సవాళ్లను పరిష్కరిస్తాయి. వృద్ధుల స్వయం సహాయక సంఘాలు పొదుపు చేయడానికి, రుణాలను పొందడానికి, నైపుణ్యాలను పంచుకోవడానికి మరియు పరస్పర మద్దతును అందించడానికి సీనియర్లను ఒకచోట చేర్చుతాయి, వారి గౌరవాన్ని, స్వావలంబనను మరియు సంఘ అభివృద్ధిని మెరుగుపరుస్తాయి.

ఈ సంఘాలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తాయి, సామాజిక నిబద్ధతను ప్రోత్సహిస్తాయి మరియు సభ్యులు సంతృప్తికరమైన జీవితాలను గడపడానికి అధికారం ఇస్తాయి. తెలంగాణలో, 15 లక్షల మంది వృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు, 7-8 లక్షల మంది సీనియర్ మహిళలు వృద్ధుల స్వయం సహాయక సంఘాలలో చేరడానికి అవకాశం ఉంది. వృద్ధుల స్వయం సహాయక సంఘాలు సహవాసం అందించడంలో, ఒంటరితనాన్ని తగ్గించడంలో మరియు సంఘంలో చెందిన భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడానికి, క్రమం తప్పకుండా శారీరక శ్రమను ప్రోత్సహించడానికి మరియు భీమా మరియు చట్టపరమైన హక్కులకు పొందుటను సులభతరం చేయడానికి కూడా ఉపయోగపడుతుంది.

వృద్ధుల మహిళా సంఘాలు వారి యొక్క ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచడానికి హస్తకళలు, వ్యవసాయం మరియు చిన్న వ్యాపారాలు వంటి ఆదాయాన్ని ఆర్జించే కార్యకలాపాలలో నిమగ్నమవ్వడం కొనసాగించవచ్చు.

## 3. ఐకమత్యమే మహా బలం !

ఇందిరా మహిళా శక్తి విధానం 2024 అర్హులైన మహిళలందరినీ స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోంది. ఒక కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకువచ్చే కల, పట్టణ స్వయం సహాయక సంఘాలను మరియు గ్రామీణ స్వయం సహాయక సంఘాలలో విలీనం చేస్తేనే సాకారమవుతుంది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మహిళలను ఒకచోట చేర్చి, వారి బలాలను ఏకీకృత లక్ష్యంతో కలిపి, శ్రేయస్సును సృష్టించడం నిజంగా సాధికారిక చారిత్రాత్మక చర్య.

తెలంగాణ రాష్ట్రం దేశంలో వేగంగా పట్టణీకరణ చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి. తెలంగాణలో పట్టణ జనాభా శాతం 2016-17లో 42% ఉండగా, 2025-26 నాటికి 50%కి చేరుకుంటుందని అంచనా. వేగవంతమైన పట్టణీకరణ కారణంగా అనేక గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీలుగా మారాయి. ఇప్పటివరకు, 33,914 స్వయం సహాయక సంఘాలు మరియు 1,303 గ్రామ సంఘాలు, పట్టణ స్వయం సహాయక సంఘాలలో విలీనమయ్యాయి. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలు ఒకే గొడుగు సంస్థ క్రింద ఉంటే విలీనాలు సజావుగా చేయవచ్చు.

మారిన జీవన పరిస్థితులలో, పట్టణాలు మరియు మెట్రో ప్రాంతాలలో, నిరుపేద/పేద కుటుంబాల ఉనికి మురికివాడలకు మించి విస్తృతంగా ఉంది. వారు సంపన్న కాలనీలలో కూడా గణనీయమైన ఉనికిని కలిగి ఉన్నారు, డ్రైవర్లు, తోటమాలి, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులు, వంటవారు, గృహ సహాయకులు మొదలైన రూపాల్లో సంపన్నుల గృహాలకు సేవలను అందిస్తున్నారు. వీరంతా ఒకే ప్రాంతం/కాంప్లెక్స్‌లో నివసిస్తున్నారు. ఈ కుటుంబాలు ఎక్కువగా స్వయం సహాయక సంఘాల పరిధికి వెలుపల ఉంటాయి మరియు వారి నివాసం మురికివాడ ప్రాంతంలో లేనందున వ్యవస్థీకృతం కావు. వారిలో కొందరు వారి స్వంత స్వస్థల గ్రామాలలో స్వయం సహాయక సంఘాలలో సభ్యులు కావచ్చు, కానీ సాధారణంగా గ్రామంలో లేనందున అనేక కార్యకలాపాలను కోల్పోతారు. పొదుపు, రుణాలు పొందడం, సమూహ సమైక్యత, ప్రభుత్వం మరియు ఇతర రంగాల నుండి పెద్ద సంఖ్యలో సేవల గురించి మెరుగైన జ్ఞానం స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ కుటుంబాలు పొందలేకపోతున్నాయి.

స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం మరియు జీవనోపాధిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (**SERP**) తన రెండు దశాబ్దాల అనుభవం పట్టణ స్వయం సహాయక సంఘాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. పట్టణ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి **SERP** యొక్క జాతీయ వనరుల సంస్థ (**NRO**) స్థితిని ఉపయోగించవచ్చు. **SERP** వద్ద పెద్ద సంఖ్యలో ఉన్న కమ్యూనిటీ కేడర్‌లను పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తారు. ఈ విలీనం క్రాస్-లెర్నింగ్ అవకాశాలను కూడా అందిస్తుంది మరియు పట్టణ మరియు గ్రామీణ స్వయం సహాయక సంఘాల మధ్య జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడానికి సహాయపడుతుంది.

పట్టణ స్వయం సహాయక సంఘాలు గ్రామీణ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ వనరుగా ఉపయోగపడతాయి. పట్టణ ప్రాంతాలలో భారీ మార్కెటింగ్ సామర్థ్యం ఉంది, అయితే గ్రామీణ ప్రాంతాలు ముడి పదార్థాల సరఫరాదారులుగా మరియు ప్రాసెసింగ్ కేంద్రాలుగా పనిచేస్తాయి. ఈ మిశ్రమ బలాన్ని ఈ అనుసంధానం ద్వారా ఉపయోగించుకోవచ్చు.

## 4. ముగింపు :

ఇందిరా మహిళా శక్తి విధానం ఆర్థిక స్వాతంత్ర్యం, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మద్దతు ద్వారా మహిళలను శక్తివంతం చేయడానికి ఒక సమగ్ర విధానం. ఐకమత్యమే మహా బలం. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మహిళలను ఒకచోట చేర్చి, వారి బలాలను ఏకీకృత లక్ష్యంతో కలిపి, శ్రేయస్సును సృష్టించడం నిజంగా సాధికారిక చారిత్రాత్మక చర్య. **SERP** మరియు **MEPMA** ల అనుసంధానం ద్వారా **SHG** మహిళలకు అందించే ఒకేవిధానమైన సేవల వలన తెలంగాణ అంతటా మహిళల సాధికారత కోసం ఒక నిర్మాణాత్మక మరియు స్థిరమైన నమూనాను అందిస్తుంది. ఆర్థిక సహకారం పొందడం, శిక్షణ మరియు సంస్థాగత మద్దతును సమలేఖనం చేయడం మహిళా పారిశ్రామికవేత్తల నేతృత్వంలో సమ్మిళిత ఆర్థిక వృద్ధిని నడిపిస్తుంది.

కౌమారదశలోని బాలికలను ఈ ఏకీకృత మిషన్ పరిధిలోకి తీసుకురావడం మరొక చారిత్రాత్మక చర్య, ఇది ఈ బాలికలను ఆత్మవిశ్వాసంతో కూడిన మరియు సాధికారిక యువతులుగా వికసింపజేస్తుంది. వృద్ధ మహిళలకు గొప్ప అనుభవం ఉంది మరియు వారి జ్ఞానము, శ్రేయస్సు మరియు సాధికారతకు మిషన్‌ను మరింత సుసంపన్నం చేస్తుంది. ఇంకా, ఏకీకృత మిషన్ వృద్ధ మహిళల అవసరాలు తీర్చబడతాయని, వారి స్వరాలు వినబడతాయని మరియు సామాజిక సమానత్వం మరియు ఆర్థిక శ్రేయస్సుకు సహకరించడానికి వారికి కూడా సమాన అవకాశం ఇవ్వబడుతుందని నిర్ధారిస్తుంది.

ఒక కోటి మంది మహిళలు రూ. 1 లక్ష కోట్ల రుణాన్ని పొందినప్పుడు, తెలంగాణ నిజంగా మహిళా సాధికారత మరియు నాయకత్వపు కొత్త శకాన్ని నడిపిస్తూ ఆర్థిక శక్తి కేంద్రంగా మారుతుంది.

*స్వర్గమనేది ఎక్కడున్న నేల పైకి దించుదాం !*

# అనుబంధం

| | |
|---|---|
| 1. | బ్యాంకు లింకేజ్ |
| 2. | ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం |
| 3. | ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు |
| 4. | ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభించడం |
| 5. | ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి, విద్యార్థినిలకు యూనిఫాం కుట్టడం |
| 6. | అమ్మ ఆదర్శ పాఠశాల |
| 7. | ప్రమాద భీమా మరియు రుణ భీమా కల్పించడం |
| 8. | మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయడం |
| 9 | సోలార్ పవర్ ప్లాంట్లు |
| 10. | RTC బస్సులు SHG మహిళల కోసం |
| 11. | ZMS ద్వారా నిర్వహించబడే పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడం |

## ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 2024-25 లో సాధించిన కీలక విజయాలు:

### 1. బ్యాంక్ లింకేజ్ & స్త్రీ నిధి ద్వారా క్రెడిట్ మద్దతు:




వచ్చే ఐదు సంవత్సరాలలో బ్యాంకు బ్యాంక్ లింకేజ్ మరియు స్త్రీ నిధి ద్వారా స్వయం సహాయక సంఘాలు రూ. 1 లక్ష కోట్లకు ఋణం పొందుతాయి. రూ. 20,000 కోట్ల లక్ష్యానికి గాను, ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలు మొత్తం రూ. 21,632 కోట్ల బ్యాంకు లింకేజ్ లక్ష్యాన్ని సాధించాయి. మరియు, సూక్ష్మ సంస్థల ఆర్థిక సహాయంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2,25,110 సంస్థలు మొత్తం రూ.4825.54 కోట్ల విలువతో ఏర్పాటు చేయబడ్డాయి.

### 2. ఇందిరా మహిళా శక్తి భవనాలు :




మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ ప్రభుత్వం 22 జిల్లా సమాఖ్యల కోసం రూ. 110 కోట్ల వ్యయంతో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేసి శంకుస్థాపన చేసింది. 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం 2 అంతస్తులను కలిగి ఉంటుంది. ఈ భవనాన్ని జిల్లా సమాఖ్య సమావేశాలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, శిక్షణా కేంద్రంగా, ఉమ్మడి పని ప్రదేశంగా, ప్రదర్శనల నిర్వహణ, సరస్ మేళాలు మరియు ఇతర జీవనోపాధి/ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగిస్తారు.

## 3. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు :




గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలను శక్తివంతం చేయడానికి కమ్యూనిటీ ఆధారిత క్యాంటీన్లను ఏర్పాటు చేయడం తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించింది. ఈ క్యాంటీన్లు పూర్తిగా మహిళల యాజమాన్యంలో మరియు నిర్వహణలో ఉంటాయి, ఇవి సచివాలయం, కలెక్టరేట్లు (IDOC), రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలు, కోర్టులు, కళాశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలు & పర్యాటక ప్రదేశాలు, పారిశ్రామిక పార్కులు మొదలైన వివిధ సంస్థలను సందర్శించే పౌరులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మరియు రుచికరమైన ఇంటి శైలి భోజనం అందించబడుతుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు సాధారణంగా వారు సేవ చేసే సంఘం నుండి వస్తారు, ఇది వారికి స్థానిక అభిరుచులు, ఆహార అవసరాలు మరియు ప్రాధాన్యతలపై లోతైన అవగాహనను అందిస్తుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల ద్వారా 214 క్యాంటీన్లు ఏర్పాటు చేయబడ్డాయి.

## 4. ఇందిరా మహిళా శక్తి బజార్ :




గ్రామీణ కళాకారులను పట్టణ మరియు ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించడం ద్వారా స్వయం సహాయక సంఘాల వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం మాదాపూర్ ఐటీ హబ్ అయిన శిల్పారామంలోని 106 దుకాణాల సముదాయాన్ని కేటాయించింది. దుకాణ కేటాయింపు వ్యవస్థ న్యాయమైన అవకాశాలను నిర్ధారిస్తుంది. ఈ సముదాయంలో ఫుడ్ కోర్ట్, ప్రభుత్వం స్పాన్సర్ చేసిన స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఒక వేదిక, ఒక యాంఫిథియేటర్ మరియు సాధారణ ఉత్సవాలు మరియు ఆహార ఉత్సవాలు ఉంటాయి, ఇది వారసత్వాన్ని పరిరక్షించే, జీవనోపాధిని పెంచే మరియు గ్రామీణ-పట్టణ ఆర్థిక సంబంధాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన కేంద్రంగా మారుతుంది.

## 5. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టడం:




పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో పాఠశాల యూనిఫాం కుట్టడం ప్రత్యేకంగా వారికి కేటాయించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 12 మార్చి 2024న **GO MS** నం.14 జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో **SERP** ఏర్పాట్లకు నాయకత్వం వహించింది, అయితే ప్రభుత్వం కుట్టు ఛార్జీలను 50 నుండి 75కి పెంచింది, ఇది మహిళా దర్జీల ఆదాయాన్ని పెంచింది. 2024-25 విద్యా సంవత్సరంలో, 2,259 మహిళా శక్తి కుట్టు కేంద్రాలు 29,680 స్వయం సహాయక సంఘాల మహిళా దర్జీలను నియమించాయి, 37,58,988 యూనిఫాంలను కుట్టి పంపిణీ చేశాయి, మొత్తం రూ. 28.09 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి, ఇది వారి ఆర్థిక స్వాతంత్ర్యం మరియు నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

## 6. అమ్మ ఆదర్శ పాఠశాల:



తెలంగాణలోని అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ మరియు నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలు (**SHGs**) కీలక పాత్ర పోషించేలా చేస్తుంది. ప్రతి పాఠశాలలో ఏర్పడిన 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల' (**AAPC**లు) ద్వారా, స్థానిక **SHG** సభ్యులు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం మరియు మెరుగైన అభ్యాస వాతావరణాలను నిర్ధారించడం వంటి బాధ్యతలు తీసుకుంటారు. ఈ కార్యక్రమం కింద, రూ634 కోట్ల విలువైన 23,701 పనులు అమలు చేయబడ్డాయి, ఈ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలు మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు మరియు తరగతి గదులను పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది, విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన మరియు మరింత శక్తివంతమైన స్థలాన్ని పెంపొందిస్తుంది.

## 7. ప్రమాద బీమా మరియు రుణ బీమా :



**మహిళా సంఘాల సభ్యులకు**
**ప్రమాద బీమా & రుణ బీమా**

ఆదేశిక సూత్రాలు ఒక నిర్దిష్ట లక్ష్యం దిశగా సాగే ప్రగతిశీలకమైన చర్యలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. వీటి ఉల్లంఘన జరిగినప్పుడు మనం కోర్టులను ఆశ్రయించలేము. ఇవి ప్రభుత్వానికి మార్గదర్శకాలుగా మాత్రమే ఉంటాయి. ప్రజలపట్ల తమ కర్తవ్యాన్ని నిర్వర్తించమని ప్రభుత్వాలను డిమాండ్ చేయడానికి ఇవి ఉపయోగపడతాయి.

ఆదేశిక సూత్రాలు మన రాజ్యాంగానికి "అంతరాత్మ (*conscience*) లాంటివి. పౌరులు వీటిని అమలుపరచమని అడగవచ్చు. ఇవి రాజ్యాంగంలోని *IV*వ భాగంలో ఉంటాయి. రాజ్య విధులను చెబుతాయి.

## ఆదేశిక సూత్రాలలో స్త్రీలకు సంబంధించిన అధికరణాలు

| | | | |
|---|---|---|---|
| అధికరణం | 39 (ఎ) | : | దేశపౌరులైన స్త్రీ పురుషులందరికీ తగిన జీవనోపాధి పొందడానికి సమానహక్కులు ఉంటాయి. వీటిని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. |
| అధికరణం | 39 (డి) | : | స్త్రీ పురుషులిద్దరికీ ఉద్యోగాలలో సమాన పనికి సమాన వేతనం ఉండాలి. |
| అధికరణం | 39 (ఇ) | : | స్త్రీ, పురుషులు, బాల కార్మికుల ఆరోగ్యం, శక్తి దుర్వినియోగం కాకూడదు. వారు ఆర్థిక అవసరాల కారణంగా గత్యంతరం లేని పరిస్థితులలో వయస్సు లేదా, శక్తికి మించిన పనులు చేయవలసిన పరిస్థితిని నివారించడానికి ప్రభుత్వం తగిన విధానాలను చేపట్టాలి. |
| అధికరణం | 39 (ఎఫ్) | : | స్వేచ్ఛ, గౌరవప్రదమైన పరిస్థితులలో ఆరోగ్యకరమైన పద్ధతిలో పిల్లల అభివృద్ధికి తోడ్పడే అవకాశాలను, సౌకర్యాలను కల్పించాలి. బాల్యం, యవ్వనం దోపిడీకి గురికాకుండా చూడాలి. |
| అధికరణం | 42 | : | పనిచేయడానికి న్యాయమైన, మానవీయమైన పరిస్థితులను, ప్రసూతి సౌకర్యాలను కల్పించాలి. |
| అధికరణం | 44 | : | భారతదేశమంతటికి ఒకేవిధమైన ఉమ్మడి పౌరస్మృతి రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేసి భద్రత కల్పించాలి. |

# II. వివాహం – చట్టాలు

## 1. వివాహాల తప్పనిసరి నమోదు చట్టం – 2002 (రాష్ట్ర చట్టం)

రాష్ట్రంలో జరిగే అన్ని పెళ్ళిళ్ళు ఏ కులానికి, మతానికి చెందినవైనప్పటికీ, వారి వివాహ కట్టుబాటు, ఆచార వ్యవహారాలు ఏ విధంగా ఉన్నప్పటికీ, ప్రతీ వివాహం తప్పనిసరిగా నమోదు చేయించుకొనడానికి ఈ చట్టం రూపొందించబడింది. ప్రభుత్వంచే నిర్దేశించబడి, నియమించబడిన వివాహ నమోదు అధికారులు గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలో మరియు జిల్లాస్థాయిలో ఉంటారు.

వివాహం జరిగిన రోజు నుంచి 30రోజుల్లోపు వధువు, వరుడు, తల్లిదండ్రులు కానీ, వారి సంరక్షకులుగానీ వివాహ నమోదు కోసం ఇచ్చే దరఖాస్తుతో, వధూవరుల వయస్సు తెలుపుతూ, వారిద్దరి సంతకాలతో, ఇద్దరి తరపున ఇద్దరిద్దరు సాక్షులు అధికారి ఎదురుగా సంతకాలు చేసి, సంబంధిత అధికారికి ఇవ్వాలి. అధికారి ఈ సమాచారాన్ని రిజిస్టరులో నమోదు చేసి అందరి సంతకాలు తీసుకొని వివాహ నమోదు పత్రం పై సంబంధిత అధికారి సంతకం, సీలు వేసి దంపతులకు ఆ సర్టిఫికెట్‌ను ఇవ్వాల్సి వుంటుంది.

<u>ఈ చట్టం ద్వారా కలిగే ముఖ్య ప్రయోజనాలు:</u> నేటి సమాజంలో వివాహిత మహిళలపై జరుగుతున్నటువంటి హింసా దౌర్జన్యాలు, భార్యలను విడిచిపెట్టేస్తున్న భర్తలు, వరకట్న వేధింపులు, విదేశాల సంబంధ వివాహాలు మొదలైన కష్టాలను ఎదిరించి మహిళ తన న్యాయమైన హక్కులను సాధించుకోవడానికి ముఖ్యమైన సాక్ష్యంగా వివాహ నమోదు సర్టిఫికేట్ ఉపయోగపడుతుంది. బాల్య వివాహాలను అరికట్టి, చిన్న వయస్సులోనే అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేయకుండా వారికి చదువు చెప్పించి మంచి భవిష్యత్తుకి బాటలు వేయటానికి కూడా ఉపయోగపడుతుంది.

**పెళ్ళిళ్ళ అధికారులు** – గ్రామం – గ్రామకార్యదర్శి / ఎక్జిక్యూటివ్ ఆఫీసర్
మున్సిపాలిటీ – మున్సిపల్ కమిషనర్
కార్పొరేషన్ – మున్సిపల్ కమీషనర్
జిల్లా – కలెక్టర్
రాష్ట్రం – డైరెక్టర్ జనరల్ ఆఫ్ స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్

## 2. బాల్య వివాహాల నిరోధక చట్టం – 2006

బాల్యవివాహాలను నిరోధించే ఉద్దేశ్యంతో "బాల్య వివాహాల నిరోధక చట్టం – 1929" రూపుదిద్దుకొంది. ఇది తరువాత సవరణలు పొంది బాల్య వివాహాల నిరోధక (సవరణ) చట్టం – 1949గా మారింది. స్వాతంత్ర్యానంతరం రూపొందించిన ప్రత్యేక వివాహచట్టం (1954) ప్రకారం కూడా బాల్య వివాహాన్ని నేరంగా పేర్కొన్నారు.

ప్రస్తుతం బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 అమలులో ఉంది. ఈ చట్ట నిబంధనల ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు యుక్త వయస్సుగా నిర్దేశితమైంది. ఈ నిర్దేశించిన వయసుకంటే ముందుగా జరిపే వివాహాలన్నీ ఈ చట్టం ప్రకారం బాల్య వివాహాలే. వధువరూల్లో ఏ ఒక్కరికి ఈ వయస్సు కన్నా తక్కువ ఉంటే అది బాల్య వివాహంగానే పరిగణించబడుతుంది.

### ఎవరు ఫిర్యాదు చేయవచ్చు ?

- ఇరుగుపొరుగువారు, బంధువులు, స్నేహితులు, ఎన్.జి.వోలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎవరైనా ఖచ్చితమైన సమాచారంతో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లేదా ఫస్ట్‌క్లాస్ జుడిష్యల్ మేజిస్ట్రేట్‌కు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.
- 108, 1098 లకు సమాచారాన్ని అందించవచ్చు.

### ఫిర్యాదు ఎవరికి చేయాలి?

★ కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984 కింద ఏర్పాటైన కోర్టులకు లేదా సివిల్‌కోర్టులకు

★ ఎం.ఆర్.ఓ.లు, సి.డి.పి.ఓ.లు బాల్య వివాహాలు నిరోధించే అధికారులు

### నిలుపుదల ఉత్తర్వులు

★ బాల్య వివాహం జరగబోతోందని కానీ, జరుగుతోందని కానీ సరైన సమాచారం అందితే దానిని కోర్టు ఉత్తర్వుల ద్వారా నిలుపుదల చేయవచ్చు. దీనినే ఇంజక్షన్ ఆర్డర్ అంటారు.

★ నిలుపుదల ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘిస్తే రెండేళ్ళ జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా లేదా రెండూ విధించవచ్చు. మహిళలను జైలుశిక్ష నుంచి మినహాయించారు కానీ జరిమానా విధించవచ్చు.

★ పెద్ద ఎత్తున సామూహిక బాల్య వివాహాలు జరిగే సందర్భంలో జిల్లా న్యాయమూర్తి స్వయంగా ఈ వివాహాలను ఆపేసే అధికారిగా ఉండవచ్చు. అందుకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకునే అధికారం ఉంటుంది.

### పెళ్లి రద్దు చేయాలంటే

తన పెళ్ళిని రద్దు చేయవలసిందిగా బాల్య వివాహానికి గురైన అబ్బాయి కాని అమ్మాయి కాని న్యాయస్థానానికి పిటీషన్ పెట్టుకోవచ్చు. ఈ చట్టం రావడానికి పూర్వం లేదా వచ్చిన తరువాత జరిగిన బాల్య వివాహాల్లోని వధూవరులు ఎవరైనా ఈ పిటీషన్ వేసుకోవచ్చు.

### బాల్య వివాహాల్లో పుట్టిన బిడ్డల సంరక్షణ



బాల్య వివాహాల్లో పుట్టిన పిల్లలు ఎవరి ఆధీనంలో ఉండాలనేది జిల్లా కోర్టు నిర్ణయించవచ్చు. బిడ్డ సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం చేయాలి. వివాహంలోని ఒక పక్షానికి సంబంధించిన వారికి లేదా వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు ఇలా పుట్టిన బిడ్డ సంరక్షణ బాధ్యతను భరణం ఇచ్చే విధంగా కోర్టు ఉత్తర్వులు ఇవ్వవచ్చు.

### బాల్య వివాహం చేసుకున్న వారికి శిక్ష

18 సంవత్సరాల వయస్సు కన్నా ఎక్కువ వయస్సు ఉన్న పురుషుడు ఎవరైనా బాల్యవివాహం చేసుకుంటే శిక్షార్హుడే. రెండేళ్ళ కఠినకారాగారశిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండింటిని శిక్షగా విధించవచ్చు.

### బాల్య వివాహం చేసిన వారికి శిక్ష

బాల్య వివాహాన్ని జరిపేవారు, నిర్వహించేవారు, అనుమతించేవారు, ప్రోత్సహించేవారు, నిరోధించనివారు అందరూ శిక్షార్హులే. ఈ నిబంధన ప్రకారం వీరికందరికీ రెండేళ్ళ కారాగార శిక్ష, లక్షరూపాయల వరకు జరిమాన విధించవచ్చు. ఈ శిక్ష నుంచి తప్పించుకోవాలంటే వారు చేసిన వివాహం బాల్య వివాహం కాదని రుజువు చేసుకోవాలి.

### బాల్య వివాహం ప్రోత్సహించిన వారికి శిక్ష

- ✶ బాల్యా వివాహం జరిగిన సందర్భంలో ఆ బాలిక లేదా బాలుడి అదుపు కలిగిన తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లేదా ఆ హోదాలో ఉన్న ఏ ఇతర వ్యక్తియైనా, చట్టబద్ధంగాగాని, చట్టవిరుద్ధంగాగాని మరే విధంగానైనా తన అధీనంలో ఉన్న పిల్లలకు, ఏ సంస్థకు సంబంధించిన వ్యక్తియైనా, బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన వ్యక్తులకు సంబంధించిన వ్యక్తియైనా, ఏ రకంగా బాల్య వివాహాన్ని చేయడానికి పూనుకున్నా; జరుగుతున్న బాల్య వివాహాన్ని నిర్లక్ష్యంతో ఆపకుండా ఉన్నా; అలాంటి పెళ్ళిలో ఏ హోదాలో పాల్గొన్నా, కేవలం పెళ్ళికి హాజరైనా వీరందరూ రెండేళ్ళ కఠిన కారాగార శిక్ష లేదా లక్షరూపాయల వరకు జరిమానా లేదా రెండింటిని శిక్షగా పొందవచ్చు.
- ✶ వీరిలో తల్లిదండ్రులు, పిల్లల సంరక్షకులు, కుటుంబ పెద్దలు, బంధువులు, మిత్రులు, పురోహితులు, పెళ్ళి పేరుతో మోసం చేసి చిన్నపిల్లలను పెళ్ళిళ్ళు చేసుకుని తీసుకుని పోయేవారు ఎవరైనా ఉండవచ్చు. స్త్రీలకు మాత్రం కారాగారశిక్ష నుంచి మినహాయింపు ఉంది. జరిమానా నుంచి మినహాయింపు లేదు.

### పెళ్ళికి చెల్లుబాటు

- ❖ బాలికను తన చట్టబద్ధమైన సంరక్షకుని నుంచి తీసేసుకునే ఉద్దేశంతో, మోసంతో బలవంతంగా ఒక ప్రదేశం నుంచి బాలికను తప్పించాలనే ప్రయత్నం చేసినప్పుడు, పెళ్ళికోసం బాలికను అమ్మివేసినపుడు, పెళ్ళికోసం బాలికను అమ్మేసిన తర్వాత జరిగిన పెళ్ళిలోను, బాలికను పెళ్ళికోసం అమ్మేసిన తర్వాత ఇతర ప్రాంతాలకు వ్యభిచారం నిమిత్తం తరలించినప్పుడు ఈ పెళ్ళి చెల్లదు.
- ❖ బాల్య వివాహంలో బాధితులైన వధూవరులు వెంటనే తమకి పెళ్ళి వద్దని తెలియజేస్తే ఆ పెళ్ళి చెల్లుబాటు కాదు. వధువు తనకి మైనారిటీ తీరిన వెంటనే మేజర్ అయిన తర్వాత రెండేళ్ళలోపు ఎప్పుడైనా కోర్టు ద్వారా ఈ పెళ్ళి చెల్లదనే పత్రం తీసుకోవచ్చు.

ఆడ పిల్లలకు తొందరగా పెళ్ళిళ్ళు చేసేస్తే వారిని అత్యాచారాల నుంచి లేదా లైంగిక వేధింపుల నుంచి రక్షించవచ్చని అనుకొంటారు. వాస్తవానికి బాల్యవివాహం చేయడమంటేనే లైంగికవేధిపులకు, అత్యాచారానికి లైసెన్సు ఇచ్చినట్లు అవుతోంది. వీటికి తోడు గృహహింస, చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం వల్ల విపరీతమైన అనారోగ్యం, గర్భంలోని శిశువు, గర్భం

దాల్చిన తల్లీ ఇద్దరూ మరణించే ప్రమాదం ఉంది. చట్టప్రకారం 15 ఏళ్ళలోపు భార్యతోనైనా సంపర్కం అత్యాచారం గానే పరిగణింపబడుతుంది.

తొందరగా పెళ్ళి చేస్తే వరకట్నం తక్కువగా ఉంటుంది, పెళ్ళి ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయనేది మరో వాదన. ఇలా అని చిన్నతనంలోనే పెళ్ళి చేయడం వల్ల పిల్ల సంసారానికి విముఖంగా ఉండటం వల్ల, పదే పదే పెళ్ళి పంచాయితీల్లోకి వెళ్ళడం గమనిస్తున్నాం. ఇలా పెళ్ళిపైన పంచాయితీలు నిర్వహించేందుకు బోలెడంత ఖర్చులు పెడుతున్నారు. భార్య భర్తల మధ్య అసమానత కారణంగా పురుషుడు తన ఈడు అయిన స్త్రీతో సంబంధం పెట్టుకోవడం, రెండో పెళ్ళి చేసుకోవడం జరుగుతోంది. ఇందువల్ల పురుషుడు చట్టం ముందు మరింత నేరస్తుడవుతున్నాడు. చాలా సందర్భాల్లో పురుషులు, స్త్రీలను వదలి వెళ్ళిపోతున్నారు.

## 3. వివాహంకు సంబంధించిన వివిధ మోసపూరిత నేరాలు

### మోసపు పెళ్ళి – ఐ.పి.సి. సెక్షన్ 493

చట్టబద్ధంగా పెళ్ళిచేసుకొన్నానని నమ్మించి ఏ స్త్రీతోనైనా సహజీవనం సాగించినా, లైంగిక సంబంధం పెట్టుకొన్నా అది మోసం చేయడమే అవుతుంది. ఇటువంటి మోసపూరిత వ్యవహారాలకు పాల్పడిన వారికి భారత శిక్షాస్మృతిలో 493 నిబంధన ప్రకారం పదేళ్ళ జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు.

ఈ కేసులో ముద్దాయిని పోలీసు ఆఫీసరు వారెంటు లేకుండా అరెస్టు చేయకూడదు. ఇందులో ముద్దాయి జామీను పొందడం కోర్టు వారి ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. ఈ కేసులో ఫిర్యాది, ముద్దాయిలు రాజీ పడడానికి వీలులేదు. కేసును సెషన్సు కోర్టు విచారించాలి.

**ముద్దాయికి శిక్ష పడాలంటే రుజువు చేయవలసి అంశాలు :**

★ ముద్దాయి ఫిర్యాదు చేసిన స్త్రీతో సంభోగం చేశాడు.
★ అతను ఆమెను శాసన సమ్మతంగా వివాహమాడలేదు.
★ తనకు శాసనం ప్రకారమే వివాహం అయ్యిందని ఆమె నమ్మి అతనితో సంభోగానికి అంగీకరించింది.
★ ఆమెకు అలాంటి నమ్మకాన్ని ముద్దాయి మోసపూరితంగా కల్పించాడు.

### రెండోపెళ్ళి – ఐ.పి.సి. సెక్షన్ 494

భార్యాభర్తల్లో ఎవరైనా కోర్టు అనుమతితో విడాకులు తీసుకోకుండా మొదటి వ్యక్తి బతికి ఉండగానే రెండవ వివాహం చేసుకొన్నట్లయితే ఆ వివాహం చెల్లుబాటు కాదు. ఇలాంటి కేసులో రెండవ వివాహానికి పాల్పడిన భార్యకు లేదా భర్తకు 494 నిబంధన మేరకు ఏడేళ్ళ జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

**మినహాయింపు:** కోర్టు మొదటి పెళ్ళి చెల్లనిదని తీర్పు చెబితే తన భర్త లేక భార్య బతికి ఉండగా మరో పెళ్ళి చేసుకోడానికి వారికి ఒక అవకాశం ఉంది. దంపతులు వరుసగా ఏడు సంవత్సరాలు ఒక దగ్గర లేకపోతే, బతికి ఉన్నట్లుగా ఒకరి గురించి మరొకరికి తెలియకపోతే రెండో పెళ్ళి చేసుకుంటే నేరం కాదు. మన రాష్ట్రంలో వారెంటు లేకుండా అరెస్టు చేయవచ్చు. జామీను కూడా హక్కుగా పొందలేరు. విచారించే కోర్టు అనుమతితో, ప్రతివాది సమ్మతితో రాజీపడవచ్చు. ఈ కేసును సెషన్సు కోర్టు విచారించాలి. మన రాష్ట్రంలో మాత్రం మెజిస్ట్రేట్ విచారించవచ్చు. సాధారణంగా మొదటి భార్య లేదా మొదటి భర్త ఈ కేసులో ఫిర్యాదు దార్లుగా ఉంటారు.

**ముద్దాయికి శిక్ష పడాలంటే ఫిర్యాదిదారు రుజువు చేయాల్సిన అంశాలు**

- ★ ముద్దాయికి అంతకు ముందే పెళ్ళి అయింది.
- ★ ఆ పెళ్ళి చట్ట ప్రకారం చెల్లేది.
- ★ మొదట ఎవరినైతే పెళ్ళాడారో ఆ వ్యక్తి ఇంకా బతికి ఉండాలి.
- ★ ముద్దాయి మరోవ్యక్తిని పెళ్ళి చేసుకున్నాడు లేదా చేసుకుంది.
- ★ మొదటి భర్త లేక భార్య బతికి ఉండగా చేసుకున్నందువల్ల ఆ రెండవ పెళ్ళి చెల్లదు.

## మొదటి పెళ్ళి దాచి పెట్టి రెండవ పెళ్ళి చేసుకుంటే – ఐ.పి.సి. సెక్షన్ 495

సెక్షన్ 494లోని నేరాన్ని  చేసిన మనిషి మొదటి వివాహాన్ని తాను రెండవసారి పెండ్లి చేసుకున్న వ్యక్తికి తెలియకుండా దాచిపెడితే ఈ సెక్షన్ కింద నేరస్తులవుతారు. 10 సంవత్సరాలకు మించని కఠిన కారాగార శిక్ష జరిమానా కూడా వేయవచ్చు. కేసు కాగ్నిజిబుల్ కాదు, అంటే పోలీసు ఆఫీసరు ముద్దాయిని వారెంటు లేకుండా అరెస్టు చేయకూడదు. కానీ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అరెస్టు చేయవచ్చు. రాజీ పడడానికి అవకాశం లేని కేసు. ముద్దాయి హక్కుగా జామీను పొందడానికి వీలులేదు.

రెండవ వివాహం కింద కేసును నమోదు చేసినట్లయితే, ఆ వివాహం మత విధుల ప్రకారం జరిగినట్లు నిరూపించాలి. (ఉదా: సప్తపది, జీలకర్ర బెల్లం నెత్తిమీద పెట్టడం మొదలైనవి). ఈ కేసులో సాధారణంగా రెండవభార్య లేదా భర్త ఫిర్యాదుదారుగా ఉంటారు.

## చెల్లుబాటు కాని పెళ్ళి చేసుకుంటే – ఐ.పి.సి. సెక్షన్ 496

ఈ నిబంధన ప్రకారం వివాహం చేసుకొనేటపుడు మోసపూరిత ఉద్దేశంతో వివాహ విధుల్లో కొన్నింటిని వదిలేసి చట్టబద్ధంగా వివాహం చెల్లుబాటు గాని విధంగా పెళ్ళి చేసుకోవడం కూడా నేరమే. ఇటువంటి సందర్భాలలో నేరస్తులకు ఏడేళ్ళ జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. ఈ కేసులో ముద్దాయిని వారెంట్ లేకుండా అరెస్టు చేయకూడదు. ముద్దాయి జామీను హక్కుగా పొందడానికి అర్హుడు కాదు. ఈ కేసులో ఫిర్యాది, ముద్దాయి రాజీపడడానికి వీలులేదు.

**ముద్దాయికి శిక్షపడాలంటే**

- ★ ముద్దాయి వివాహతంతులో పాల్గొన్నాడు, అప్పుడు ఆ వివాహం చెల్లదని తెలుసు.
- ★ ముద్దాయి తనకు లాభం చేకూర్చుకోవడానికి, అవతల వ్యక్తికి నష్టం కలిగించాలని, అవతలి వ్యక్తిని మోసం చేయాలనే ఉద్దేశంతోనే వైవాహిక తంతులో పాల్గొన్నాడు.

## వివాహేతర సంబంధం పెట్టుకుంటే – ఐ.పి.సి. సెక్షన్ 497

ఈ నిబంధన ప్రకారం ఒక స్త్రీతో ఆమె భర్తకు తెలియకుండా పరాయి పురుషుడు లైంగిక సంబంధం పెట్టుకొన్నట్లయితే ఆ వ్యక్తి పైన ఆమె భర్త కేసు పెట్టవచ్చు. నిందితునికి అయిదేళ్ళ జైలు, జరిమానా విధించవచ్చు. ఈ కేసు మానభంగం కేసుగా పరిగణించరు. వివాహేతర సంబంధం కేసుగా పరిగణిస్తారు.

## భార్యను వేరే వ్యక్తి అపహరించుకొనిపోతే – ఐ.పి.సి. సెక్షన్ 498

ఈ నిబంధన ప్రకారం ఒక వివాహిత స్త్రీని ఎవరైనా సరే అక్రమ సంబంధం పెట్టుకొనే ఉద్దేశంతో ఆమె భర్త లేదా సంరక్షకుల నుంచి తీసుకొనిపోయినా, ఎవరికీ తెలియకుండా నిర్బంధించి ఉంచినా రెండేళ్ళ జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

# III. మహిళలపై హింస – చట్టాలు

## 1. గృహహింస నిరోధక చట్టం – 2005

కుటుంబాల్లో నాలుగు గోడల మధ్య మహిళలపై జరుగుతున్నటువంటి హింసను ఎదుర్కోడానికి వీలుగా గృహహింసను మహిళల మీద జరుగుతున్న నేరంగా గుర్తించి ప్రభుత్వం గృహహింస నిరోధక చట్టం – 2005ను తీసుకురావటం జరిగింది. గృహహింస నిరోధక చట్టం ఒక సివిల్ చట్టం. బాధిత మహిళలకు వివిధ దశల్లో సహాయం కల్పించే దిశగా ఈ చట్ట రూపకల్పన జరిగింది. మహిళకి సంబంధించిన కుటుంబంలోని మగవారు అనగా భర్త, మామ, తండ్రి, కొడుకు, అల్లుడు మొదలగువారు మహిళలపై జరిపే ఎటువంటి హింసనైనా గృహహింస క్రింద పరిగణిస్తారు.

**మహిళలపై హింస – రకాలు**

ఇందులో శారీరక హింస, లైంగికహింస, మానసికహింస, ఆర్థికహింస ముఖ్యమైనవి. కొట్టడం మరియు శరీరానికి హాని కలిగించే చర్యలన్నీ కూడా శారీరక హింస క్రిందకి వస్తాయి. కష్టం కలిగించే విధంగా చేసిన లైంగిక చర్యలన్నీ కూడా లైంగిక హింస అని చెప్పవచ్చును. పిల్లలు పుట్టలేదని నిందించడం, అడుగడుగునా హేళనచేసి, అవమానకరంగా మాట్లాడి చిన్నబుచ్చటం మానసికహింస క్రిందకే వస్తాయి. ఆర్థిక అవసరాలు తీర్చకుండా రోజువారీ ఖర్చులకు, కుటుంబ నిర్వహణకు, పిల్లల పెంపకానికి కూడా అవసరమైన డబ్బులు ఇవ్వకుండా వేధించడం లాంటివి ఆర్థికహింస క్రిందకి వస్తాయి.

**గృహహింస నుంచి రక్షణ DV సెల్**

ప్రతి జిల్లాలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి రక్షణాధికారిగా వ్యవహరిస్తారు. ప్రతి జిల్లాలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిని కార్యాలయంలోనే రక్షణాధికారి కార్యాలయం కూడా ఉంటుంది. ఈ కార్యాలయంలో ఒక న్యాయవాది మరియు కుటుంబ సలహా కౌన్సిలర్ ఉంటారు. అలాగే జిల్లాలో గల కొన్ని స్వచ్ఛంధ సంస్థలను బాధిత మహిళకు త్వరితగతిని సహాయం చేయడానికి సర్వీసు ప్రొవైడర్లుగా ఎంపికచేసి నియమిస్తారు. గృహహింస జరిగినట్లు ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా రక్షణాధికారి ఆ సంఘటనపై నివేదికను తయారుచేసి, అవసరమైన ఉత్తర్వులు పొందటానికి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు దాఖలు చేయాలి. బాధిత మహిళకు పిల్లలతో సహా ఆశ్రయం అవసరమైనప్పుడు ప్రభుత్వ గుర్తింపు పొందిన వసతి గృహములో చేర్పించటానికి జిల్లా రక్షణాధికారి బాధ్యత వహిస్తారు.

**మేజిస్ట్రేట్ జారీచేసే ఉత్తర్వులు**

విడిగా ఉండే నివాసహక్కు ఉత్తర్వులు, పిల్లల సంరక్షణ హక్కు, కలసి ఉన్న ఇంటిలో నివసించే హక్కు, రక్షణ ఉత్తర్వులు, నష్ట పరిహార ఉత్తర్వులు, ఆర్థిక ఉపశమన ఉత్తర్వులు మొదలైనవి. ఈ ఉత్తర్వులు అన్నింటినీ అమలు చేయడానికి రక్షణాధికారి అన్ని చర్యలు తీసుకోవాలి. మెజిస్ట్రేట్ ఉత్తర్వులు అమలులో అడ్డంకులు ఎదురైనప్పుడు పోలీసువారి ప్రమేయంతో ఆ ఉత్తర్వులును అమలుపరచి బాధిత మహిళకు బాసటగా నిలవాల్సిన బాధ్యత జిల్లా రక్షణాధికారిపై కలదు.

గృహహింసకి సంబంధించిన కేసులను 60 రోజులలో విచారించి మేజిస్ట్రేట్ తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. బాధితమహిళ పెట్టుకున్న కేసుపై వెలువడిన మెజిస్ట్రేట్ ఉత్తర్వులు అందిన 30రోజుల్లోగా గృహహింస చట్టంలోని సెక్షన్ – 29 ప్రకారం ప్రతివాది సెషన్స్ కోర్టులో అప్పీలు దాఖలు చేసుకొనవచ్చును.

**న్యాయసహాయం**

గృహహింస బాధితులు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా జిల్లా న్యాయ సేవా సంస్థల వద్ద నుంచి పొందవచ్చు.

## 2. వివాహిత మహిళలపై హింస - ఐ.పి.సి. సెక్షన్ 498 - ఎ

వివాహం జరిగిన మహిళ పట్ల ఆమె భర్తకాని, భర్త సమీప బంధువులు గాని ఆ మహిళకు శారీరక, మానసిక హింసలకు గురి చేసినపుడు, చట్ట విరుద్ధమైన కోరికలు కట్నంతో సహా చెల్లించమని ఒత్తిడి చేసినపుడు, వారి క్రూరమైన చర్యల ద్వారా బాధితమహిళ ఆత్మహత్య చేసుకొనే పరిస్థితులు కల్పించినపుడు సెక్షన్ 498 - ఎ క్రింద ఆ మహిళ లేక ఆమె రక్త సంబంధీకులు ఫిర్యాదును పోలీసులకు అందచేయవచ్చు. ఈ చట్టం ప్రకారం నేరానికి బెయిల్ ఇవ్వడమనేది మేజిస్ట్రేటు విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది.

## 3. వరకట్న మరణాలు - ఐ.పి.సి. సెక్షన్ 304 బి

వివాహమైన ఏడు సంవత్సరాలలోపల ఎవరైనా స్త్రీ కాలిన గాయాలతో మరణించినా లేదా శరీరంపై తీవ్రమైన గాయాలతో అనుమానస్పద స్థితిలో మరణించినా, మరణానికి ముందు కాలంలో భర్త, అతని రక్తసంబంధీకులు కట్నం గురించి ఆమెను క్రూరంగా హింసించినప్పుడు దాన్ని 304 బి సెక్షన్ కింద వరకట్న మరణంగా పరిగణిస్తారు.

తగిన సాక్ష్యాధారాలతో అంటే మరణం మహిళ పెళ్ళైన ఏడు సంవత్సరాల లోపలే జరిగిందని, మహిళ శరీరంపై గాయాలు, కాలిన గుర్తులు, ఆమెను డబ్బు తెమ్మని వేధించిన సందర్భాలకు సంబంధించి సాక్ష్యాలతో కేసును పోలీసు స్టేషనులో నమోదు చేసుకోవాలి. వరకట్న హత్యకు గురైందని భావించబడుతున్న స్త్రీ తన తల్లిదండ్రులకు, స్నేహితులకు, ఇతర బంధువులకు రాసిన ఉత్తరాలు, వారితో చెప్పుకున్న మాటలు సాక్ష్యాలుగా ఉపయోగిస్తాయి. వేధింపులకు తాళలేక భర్త, అత్తింటివారి కోరికలు తీర్చడానికి కొన్ని సందర్భాల్లో ఇతరుల నుంచి డబ్బు రూపేణ, ఇతరంగా తీసుకున్న సహాయాలు కూడా సాక్ష్యాలుగా పనికివస్తాయి.

ఫిర్యాదు అందినవెంటనే నిందితులను పోలీసులు వారెంటు లేకుండా అరెస్టు చేయవచ్చు. ఇది నాన్ బెయిలబుల్ నేరం. అంటే కోర్టు ద్వారానే నిందితులు బెయిల్ తీసుకోవలసి ఉంటుంది. ఈ కేసుల్లో భారత సాక్ష్యాధారాల చట్టంలో కొత్తగా ప్రవేశపెట్టిన 113 బి సెక్షన్ ప్రకారం ఫిర్యాదుదారుల భావనలనే కోర్టు నమ్ముతుంది. ప్రతివాది తాను నిర్దోషినని రుజువుచేసుకోవాలి. ఈ కేసులో నేరస్థులకు కనీస శిక్ష ఏడేళ్ళు. జీవితఖైదు కూడా విధించవచ్చు. స్త్రీని శారీరకంగానే కాక మానసికంగా కూడా హింసించి, ఆ స్త్రీ ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన సందర్భాలలో కూడా ఈ చట్టాన్ని ఉపయోగించవచ్చు.

## 4. మహిళలపై అత్యాచారాలు

మహిళకు ఇష్టం లేకుండా ఆమెపై బలాత్కారంగా లైంగిక కోర్కెను తీర్చుకోవడాన్ని, ఆమెకు మతి స్థిమితం లేనప్పుడు, ఆమె మత్తులో ఉన్నప్పుడు లేదా ఆమెకు మత్తుమందు ఇచ్చి ఆమెపై అత్యాచారం చేసినా సెక్షన్ 376 కింద ఆ పురుషుడిని అత్యాచారం చేసిన నేరస్తుడిగా పరిగణిస్తారు. ఈ నేరం చేసిన వ్యక్తికి పది సంవత్సరాల వరకూ ఖైదు, జరిమానా విధించవచ్చు. 15 సంవత్సరాలలోపు వయసు కల్గిన భార్యతో లైంగిక సంబంధం పెట్టుకున్న భర్త కూడా అత్యాచారం చేసిన నేరస్తుడిగానే ఉంటాడు. అతడికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

**ఐ.పి.సి. సెక్షన్ 376 ఎ :**

ఈ సెక్షన్ ప్రకారం భార్యభర్తలు కోర్టు ద్వారా పొందిన న్యాయపరమైన ఉత్తర్వుల మేరకు విడివిడిగా జీవిస్తున్న కాలంలో భర్త భార్యపై అత్యాచారం జరిపితే రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

**ఐ.పి.సి. సెక్షన్ 376 బి :**

ఈ సెక్షన్ ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన దగ్గర పనిచేస్తున్న స్త్రీల పై గానీ లేక అతని ఆధీనంలో ఉన్న స్త్రీల పై గానీ అత్యాచారం జరిపితే ఐదు సంవత్సరాల జైలు, జరిమానా విధించవచ్చు. ఉదాహరణకు పోలీసు స్టేషన్లలో తన కింద పని చేసే ఉద్యోగినులకు, తన వద్ద విచారణకు పిలిచిన మహిళలకు భద్రత కల్పించే బాధ్యత పై అధికారిది. అటువంటి సందర్భంలో ఆ అధికారి అందుకు భిన్నంగా వ్యవహరించి వారిపై అత్యాచారానికి పాల్పడినట్లయితే దానిని కస్టోడియెల్ రేప్ కింద పరిగణిస్తారు.

**ఐ.పి.సి. సెక్షన్ 376 సి :**

ఈ సెక్షన్ ప్రకారం జైలు సిబ్బంది జైల్లో ఉన్న మహిళా ఖైదీల పై లేదా తమ ఆధీనంలో పనిచేస్తున్న ఇతర మహిళలపై అత్యాచారం చేసినట్లయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. సెక్షన్ 376 డి ప్రకారం అసుపత్రుల్లో పనిచేసే సిబ్బంది ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం లేదా ఉద్యోగ నిమిత్తం ఉన్న మహిళలపై అత్యాచారం చేసినట్టయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. 16 సంవత్సరాల వయస్సులోపు బాలికతో లైంగిక సంబంధం ఏర్పరచుకుంటే అత్యాచారం కిందికే వస్తుంది. అత్యాచారానికి గురైన మైనర్ బాలికకు లక్ష రూపాయల వరకు ప్రభుత్వం నష్ట పరిహారంగా ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది.

**సామూహిక అత్యాచారం – ఐ.పి.సి. సెక్షన్ 376 డి :**

ఒకరు గాని లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒక గ్రూపుగా తయారయి, ఒక సమిష్టి ఉద్దేశ్యాన్ని ముందుకు తీసుకుపోవటానికి పనిచేస్తుంటే ఆ గ్రూపు గాని లేదా గ్రూపులో ఒకరు గాని మహిళపై అత్యాచారం చేస్తే వారిలో ప్రతి ఒక్కరూ అత్యాచార నేరం చేసినట్లుగా భావించ బడతాయి. 20 సం॥లకు తక్కువకాని, జీవితాంతము వరకు పొడిగించదగిన (అంటే ఆ వ్యక్తి సహజ జీవిత కాలము చివరి వరకూ) మరియు జరిమానాతో కూడిన కఠిన కారాగార శిక్షకు అర్హులవుతారు.



**ఐ.పి.సి. సెక్షన్ 376 ఇ :**

ఈ సెక్షన్ నేరాన్ని పునరావృత్తం చేసే నేరస్థులకు శిక్ష. ఎవరైనా (సెక్షన్లు 376, 376ఎ, సెక్షన్ 376డి) క్రింద శిక్షింపదగిన నేరము ఇంతకు ముందు చేసి ఉండి శిక్షింపబడితే, ఆ తర్వాత మరలా అదే నేరము క్రింద పైన చెప్పిన సెక్షన్లలో ఏదైనా గాని అరెస్టు కాబడితే అట్టి వ్యక్తి జీవిత ఖైదుకు (అంటే ఆ వ్యక్తి సహజ జీవితము పరిపూర్తి అయ్యేవరకూ) అర్హుడవుతాడు లేదా మరణశిక్షకు అర్హుడవుతాడు.

# IV. మహిళలపై లైంగిక వేధింపులు - చట్టాలు

## 1. నిర్భయ చట్టం - 2013

2012వ సం॥ డిశంబర్ నెలలో న్యూఢిల్లీలో నిర్భయ అనే అమ్మాయి మీద దారుణంగా జరిగిన సామూహిక అత్యాచారం, అనంతరం ఆమె మరణం దేశం యావత్తు మహిళల భద్రత మీద ప్రశ్నించే పరిస్థితి కల్పించింది. ఆ సంఘటన పర్యవసానంగా మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 2013వ సం॥లో నేర సంబంధ న్యాయ సవరణ చట్టం - 2013 రూపొందించడం జరిగింది. ఈ చట్టాన్నే అందరూ నిర్భయ చట్టంగా పరిగణిస్తున్నారు.

**ఐ.పి.సి. సెక్షన్ 354 - ఎ :**

ఒక వ్యక్తి ఈ క్రింది చర్యలలో ఏది చేసినా లైంగిక వేధింపుల నేరస్థునిగా శిక్షింపబడతాడు.

★ శారీరక సంబంధం కోసం ప్రత్యక్షంగా లేక పరోక్షంగా చేసే అసభ్యకరమైన లైంగిక చేష్టలతో చొరవచేసే ప్రయత్నం.

★ లైంగిక సంబంధాల కొరకు అభ్యర్థన, డిమాండ్.

★ ఒక మహిళ ఇష్టానికి వ్యతిరేకంగా అశ్లీల చిత్రాలు చూపించటం.

★ లైంగిక పరమైన అర్థాలు వచ్చేలా వ్యాఖ్యలు చేయటం.

**ఐ.పి.సి. సెక్షన్ 354 - బి :**

★ ఒక మహిళను వివస్త్రను చేసే ఉద్దేశ్యంతో దాడి లేదా నేరపూరిత దౌర్జన్యం చేయటం, ఏ మహిళనైనా వివస్త్రను చేసే ఉద్దేశ్యంతో నగ్నంగా ఉండమని ఒత్తిడి చేయటానికి, ఏ వ్యక్తైనా దాడి లేదా నేరపూరిత దౌర్జన్యానికి ఒడిగడితే లేదా అట్టి దానికి ప్రేరేపిస్తే ఆ నిందితునికి 3 సం॥లు తక్కువ కాకుండా శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

**ఐ.పి.సి. సెక్షన్ 354 - సి :**

★ రహస్యంగా ఇతరులని నగ్నంగా కానీ, వారి లైంగిక చర్యలను రహస్యంగా చూచి ఆనందించడం, ఒక మహిళను ఎవరైనా సాధారణంగా ఎవరూ తనను చూడటానికి ఇష్టపడని స్వవిషయంలో నిమగ్నమైనపుడు చూసినా లేదా ఫోటోలు తీసినా లేదా ఆ ఫోటోలు పంచిన ఆ వ్యక్తిగాని, ఆ వ్యక్తి ఆదేశంతో ఆపని చేసిన వేరొక వ్యక్తిగాని నేరస్తులుగా పరిగణింపబడి శిక్షార్హులు అవుతారు.

**ఐ.పి.సి. సెక్షన్ 354 - డి :**

★ ఏ వ్యక్తి అయినా ఒక మహిళను వెంబడించినప్పుడు మరియు ఒక మహిళ తన అయిష్టాన్ని స్పష్టంగా సూచించినా పదేపదే ఆమెతో పరస్పర సంబంధం పెంచుకోవటానికి సంప్రదించటం కానీ, సంప్రదించటానికి ప్రయత్నం కానీ చేసినా,

★ ఒక మహిళ యొక్క ఇంటర్నెట్, ఇ-మెయిల్ లేదా ఏ ఎలక్ట్రానిక్ సమాచార సాధనాన్నైనా అనుమతి లేకుండా పరిశీలిస్తే ఆ వ్యక్తి వెంటబడడం, వేధించటం అనే నేరాన్ని చేసినట్లు అవుతుంది.

## మహిళల అశ్లీల చిత్రీకరణ నిషేధ చట్టం

మహిళల అసభ్య చిత్రీకరణ నిషేధ చట్టము, 1986 ప్రకారం ప్రకటనలు, ప్రచురణలలో లిఖిత పూర్వకంగా గానీ, చిత్రీకరణ లేదా దృశ్యరూపంలో గానీ మహిళలను అసభ్యంగా ప్రదర్శించటం నిషేధించబడింది. స్త్రీల యొక్క

చిత్రాలలో గోప్య శరీర భాగాలనూ, ఆకృతిని ప్రదర్శించటం, తద్వారా మహిళల గౌరవానికి భంగం కలిగించటం మరియు పౌర నైతిక నియమాలను కలుషితం చేయటం, సామాజిక, నైతిక విలువలకు హాని కలిగించటం ఈ చట్టం ప్రకారం శిక్షించదగిన నేరాలు.

ఇలాంటి అసభ్య చిత్రాలను ప్రచురించి గానీ, ప్రచురించటానికి సమీకరించిన గానీ, తద్వారా వ్యాపార ప్రకటనలకు ప్రోత్సహించటం గానీ శిక్షించదగిన నేరాలు. ఏ వ్యక్తి అయినా ఇటువంటి నిషిద్ధ ప్రకటన సామాగ్రిని తయారు చేయటం, విక్రయించటం, అద్దెకు ఇవ్వటం లేదా తపాలా ఇతర సాధనాల ద్వారా, పుస్తక రూపంలో, కరపత్రాలు. స్లైడు ఫిల్మ్‌లు, రేఖా చిత్రాలు, వర్ణ చిత్రాలు, ఫోటోగ్రాఫ్‌లను పంపిణీ చేయటం తద్వారా స్త్రీల రూపాన్ని అసభ్యంగా ప్రదర్శిచటం, ప్రచారం కల్పించటం వంటి నేరాలకు రెండేళ్ళ వరకూ జైలు శిక్షతో పాటు 2 వేల రూపాయలు జరిమానా విధించవచ్చు. అదే నేరాన్ని రెండోమారు అదే నేరస్తుడు చేస్తే జైలు శిక్ష 5 ఏళ్ళ వరకు, 10 వేలు తక్కువ కాకుండా లక్ష రూ॥ల వరకు జరిమానా విధించబడుతుంది.

## మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన

బహిరంగ ప్రదేశంలో అసభ్యకరమైన పాటలు పాడటం, మరేదైనా అసభ్యకరమైన చర్యలు చేయటం సెక్షను 294 ప్రకారం నేరం. ఇందుకు 3 ఏళ్ళ జైలు శిక్ష, జరిమానా విధించబడతాయి. అసభ్యకరమైన సాహిత్యం వున్న పుస్తకాలు విక్రయానికి చూపిన యెడల రెండేళ్ళ జైలు శిక్షను, జరిమానాను విధించాలని, రెండోసారి లేదా ఇంకా ఎక్కువ సార్లు అదే నేరానికి పాల్పడితే 5 సం॥ల వరకు జైలుశిక్షను విధించే అవకాశం సెక్షను 292లో ఇవ్వబడింది. బాల, బాలికలకు అసభ్యకర సాహిత్యం, వస్తు సామాగ్రి వంటివి విక్రయించటం తీవ్ర నేరంగా సెక్షను 293 ప్రకటించింది. మొదటిసారి నేరం చేసిన వ్యక్తికి 3 ఏళ్ళవరకు జైలు, జరిమానా విధించే అవకాశం వుండగా రెండోసారి ఇంకా ఎక్కువసార్లు ఇదే నేరం చేస్తే జైలు శిక్ష ఏడేళ్ళ వరకు విధించాలని ఈ సెక్షను నిర్దేశించింది.

## 2. అక్రమ మానవ రవాణా నిరోధక చట్టం – 1986

అక్రమ మానవ రవాణా నిరోధక చట్టం 1986 ముఖ్య ఉద్దేశ్యం కేవలం వ్యభిచార వృత్తిని వ్యాపారంగా కొనసాగించే వారిని శిక్షించటమే కాకుండా మహిళలు, బాలికలను వ్యవస్థాగతమైన బతుకు తెరువు కోసం వ్యాపారంగా కొనసాగించే వ్యభిచార వృత్తి కోసం రవాణా జరపకుండా నిషేధించటం. ఈ చట్టం లక్ష్యం సమాజంలో చాలా కాలంగా పాతుకు పోయిన వ్యభిచార వృత్తి అనే రుగ్మతను రూపుమాపడం. అందువల్ల ఈ చట్టాన్ని ఒక సంక్షేమ చట్టంగా మనం గుర్తిస్తున్నాం. వ్యభిచార వృత్తిని నిరోధించటం, బాధిత మహిళకు పునరావాసం కలుగజేయటం అనే ప్రధాన లక్ష్యాలతో ఈ చట్టాన్ని భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

ఏ వ్యక్తి అయినా ఒక ప్రదేశాన్ని నిర్వహించటం లేదా ప్రదేశ నిర్వహణకు తోడ్పడటం ద్వారా ఒక వ్యక్తి మరొకవ్యక్తికి లేదా వ్యక్తుల లాభం కొరకు లైంగిక వ్యాపారాన్ని నిర్వహించటం నేరము. ఇందుకు ఒక ఏడాదికి తగ్గకుండా మూడేళ్ళ వరకు జైలు శిక్ష 2 వేల రూ॥లు జరిమానా ఈ చట్టంలో పేర్కొనబడింది. ఇటువంటి అనైతిక వ్యభిచార వ్యాపారం జరుపబడే ప్రదేశంలోని కిరాయి దారు, అద్దెదారు, ఆక్రమణ దారు మాత్రమే కాక ఆ ప్రదేశపు యాజమాని, పర్యవేక్షకుడు లేదా వారి ఏజెంటు వంటి వ్యక్తులు కూడాను వ్యభిచార గృహం నిర్వహించబడుతున్నదని తెలిసీ ఆ ప్రదేశంలో నిర్వహణలో సహకరించేవారందరునూ 2 సం॥ల వరకు జైలు శిక్ష, 2 వేల రూ॥ జరిమానాకు గురవుతారు. 18 సం॥లు నిండిన ఏ వ్యక్తి అయినా వ్యభిచారవృత్తిపై సంపాదనతో జీవనం సాగించటం గానీ లేదా వ్యభిచారిణితో అలవాటుగా కలిసి జీవిస్తున్నటు గానీ రుజువైతే ఆ వ్యక్తికి 2 ఏళ్ళ జైలు శిక్షతో పాటు 1000 రూ॥ జరిమానా కూడా

విధించవచ్చు. వ్యభిచార వృత్తికి దోహదం చేస్తూ అట్టి స్త్రీని, స్త్రీ యొక్క కదలికలను తన ఆధీనంలో వుంచుకొని విటులను తీసుకొచ్చే వ్యక్తికి కూడా ఇదే రకమైన శిక్ష విధించబడుతుంది. బాలికలు, మైనరు బాలికలను చేరదీసి వారిచే వ్యభిచార వ్యాపారాన్ని నిర్వహించడం ద్వారా సంపద కూడబెట్టిన వ్యక్తులకు 7 సం॥లకు తక్కువ కాని, 10 ఏళ్ళ వరకు పొడిగించగల జైలు శిక్ష విధించబడుతుంది.

మహిళను సేకరించటం, సమీకరించటం లేదా అందుకు ప్రయత్నించటం, వ్యభిచారం నిమిత్తమై మరొక ప్రదేశానికి తరలించటం లేదా తీసుకుపోవడం, ప్రదేశాల మధ్య తరలింపుతో వ్యభిచార వృత్తిని కొనసాగింప చేయటం లేదా మరొకవ్యక్తిచే వ్యభిచార వృత్తిని కొనసాగించేందుకు దోహదం చేయటం వంటి చర్యలన్నీ ఈ చట్టం క్రింద నేరాలుగా గుర్తించబడ్డాయి. ఇలాంటి నేరాలకు 7 ఏళ్ళ వరకు జైలు శిక్ష మరియు 2 వేల రూపాయల వరకు జరిమానా కూడా విధించవచ్చు.

ఏ వ్యక్తి అయినా మరొక వ్యక్తిని అతని అంగీకారంతో గానీ, అంగీకారం లేకుండా కానీ, వేశ్యాగృహంలో కానీ, ఇతర ప్రదేశంలో గానీ, మరొక స్త్రీతో లైంగిక కార్యకలాపాలు జరిపించే ఉద్దేశ్యంతో బంధించటం కూడా నేరమే. ఇందుకు 7 ఏళ్ళకు తక్కువ కాకుండా 10 ఏళ్ళ వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడతాయి.

బహిరంగ ప్రదేశాలలో లేదా పౌర నివాసాలకు సమీపంలో వ్యభిచారవృత్తి చేయటం నిషిద్ధం, శిక్షార్హం ప్రజలు ప్రార్థనలు చేసే మత సంబంధమైన సంస్థలు, ఆలయాలు, పాఠశాలలు, విద్యార్థి వసతి గృహాలు, వైద్యాలయాలు, ఆరోగ్యకేంద్రాలు వంటి సంస్థలకు 200 మీటర్ల లోపు ఇలాంటి నేరం చేసినవారికి 3 నెలల వరకు జైలు శిక్ష విధిస్తారు. బాలబాలికలు లేదా మైనారిటీ తీరని వ్యక్తులచే వ్యభిచారం చేయించిన నేరానికి 7 ఏళ్ళు తగ్గకుండా 10 ఏళ్ళ వరకు జైలు శిక్ష, కొన్ని ప్రత్యేక సందర్భాలలో జీవిత ఖైదు కూడా విధించవచ్చు.

ప్రభుత్వ అధికారి లేదా సంరక్షకుడు లేదా అధీకృత అధికారి సంరక్షణ నుండి లేదా స్వాధీనం నుండి ఏ వ్యక్తినైనా వ్యభిచారం కోసమై తీసుకువెళ్ళడం చట్టం ప్రకారం నేరం. ఇందుకు కనీసం 7 ఏళ్ళ నుండి 10 సం॥ల వరకు, మరికొన్ని ప్రత్యేక సందర్భాలలో జీవిత కాలం వరకు జైలు శిక్ష విధించవచ్చు.

### జాగ్రత్తలు

- పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ప్రేమ పేరిట వంచించే వారితో అప్రమత్తంగా ఉండాలి.
- పార్టీల్లో మహిళ ఒంటరిగా ఉన్నప్పుడు మత్తు ఇవ్వడం ద్వారా మోసం చేసే ప్రమాదముంది.
- సినిమాల్లో, టీవీల్లో నటించే అవకాశం కల్పిస్తామని, ఉద్యోగం ఇప్పిస్తామని ఒంటరిగా రమ్మనే వారితో జాగ్రత్తగా ఉంటాలి.
- ఒంటరిగా ప్రయాణించాల్సి వస్తే గమ్యం చేరే వరకు కుటుంబసభ్యులకు సమాచారం అందిస్తూ ఉండాలి.

# V. పనిచేసేచోట ఉద్యోగినులపై లైంగిక వేధింపుల నిరోధక, నిషేధ మరియు పరిష్కారచట్టం - 2013

పనిచేసేచోట మహిళలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ, నివారణ మరియు లైంగిక వేధింపులకి సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించటం గురించి ఈ చట్టాన్ని 2013లో తీసుకురావటం జరిగింది.

పనిచేసేచోట మహిళలపై లైంగిక వేధింపులనేవి రాజ్యాంగం లోని 14,15,21 అధికరణముల క్రింద కల్పించబడిన స్త్రీల ప్రాథమిక హక్కులైన సమానత్వపు హక్కు, జీవించేహక్కు, వ్యక్తిగత స్వేచ్ఛాహక్కు, భద్రతలతోపాటు లైంగిక వేధింపులకు తావులేని ఒక సురక్షిత వాతావరణం లో ఉద్యోగ, వృత్తి వ్యాపారాలును చేసుకొనే హక్కులను ఉల్లంఘించటమే అని చెప్తుంది.

ఈ చట్టం ప్రకారం పనిచేయు ప్రదేశంలో మహిళల పట్ల మగవారు అనుచితంగా, శారీరకంగా లోబరుచుకొనుటకు చేసే ప్రయత్నాలు, లైంగిక కోర్కెలను తీర్చమని ఒత్తిడి చేయటం, లైంగిక పరమైనటువంటి అర్థాలు వచ్చే విధంగా మాట్లాడటం, అశ్లీలమైన బొమ్మలను చూపించటంతో పాటు ఏ విధమైన అనుచిత, అవాంఛనీయ, అసాంఘిక ప్రవర్తన ద్వారా, చర్యల ద్వారా పనిచేసే ప్రదేశంలో మహిళలను పైన పేర్కొన్న అంశాలలో మగవారు ఏవిధంగా వేధించినా ఈచట్టం ద్వారా పై అధికారులకు మరియు పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చును.

ఈ చట్టం ప్రకారం మహిళలు పనిచేయు ప్రదేశంలో ఒక అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటిలో ఒక సీనియర్ మహిళా ఉద్యోగి అధ్యక్షురాలిగా ఇంకొక ముగ్గురు సభ్యులు, ఒక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి కలిపి నలుగురుతో అంతర్గత ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయబడుతుంది.

మహిళ ఇచ్చిన ఫిర్యాదులపై అంతర్గత ఫిర్యాదుల విభాగం, విచారణను 90 రోజులలోగా పూర్తి చేయాలి. విచారణ జరుగుతున్న సమయంలో ఫిర్యాదు చేసిన మహిళ కోరుకున్నట్లయితే ఆమెను వేరే ప్రదేశానికి బదిలీ చేయవచ్చు లేక 3 నెలలు సెలవును మంజూరు చేయవచ్చు. విచారణ నివేదిక సంబంధిత పై అధికారులకు అందిన తర్వాత నేరం చేసిన నిందితుడిపై 60 రోజులలోపల తగిన చర్య తీసుకోవాలి.

### సఖి కేంద్రాలు

"సఖి కేంద్రాలు" పలు రకాల హింసలకు గురైన మహిళలకు అవసరమైన వైద్యం, వసతి, కౌన్సిలింగ్, న్యాయసలహా/సహాయం వంటి అన్ని సేవలు ఒకే చోట అందించేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో "సఖి కేంద్రాల" ఏర్పాటు చేయబడినాయి. ఈ కేంద్రాలా మహిళలకు సత్వర పరిష్కారం, న్యాయం అందేలా చర్యలు తీసుకుంటాయి.

# VI. గర్భస్థ శిశువు ఆరోగ్యం గురించి చేసే పరీక్షల (నియంత్రణ, దుర్వినియోగ నివారణ) చట్టం - 2002

దీనినే పి.యన్.డి.టి. చట్టం అంటారు. గర్భంలో ఉన్న బిడ్డ ఆడ శిశువా? లేక మగ శిశువా? తెలుసుకోవడానికి తల్లి గర్భంలోని ఆమ్నియాటిక్ ద్రవాలను, రక్తాన్ని మొదలైన వాటిని పరీక్ష చేస్తారు. దీనినే అమ్నియో సెంటొసిస్ పరీక్షలు అంటారు. ఈ పరీక్షలు గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుకోవడానికి ఉపయోగిస్తారు. కాని సమాజంలో ఉన్న లింగ వివక్షత కారణంగా కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే చంపివేసేందుకై ఈ పరీక్షలను వాడుకోవడంతో మహిళా సంఘాల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దాంతో 1994లో పార్లమెంటు ఈ చట్టాన్ని తీసుకొని వచ్చింది.

**ఈ చట్టంలోని ముఖ్యాంశాలు**

1. ప్రభుత్వ గుర్తింపు పొందని సంస్థలుగాని, వ్యక్తులుగాని ఈ పరీక్షలు చేయడానికి వీలులేదు.
2. శిశువు ఆరోగ్యం దృష్ట్యా చట్టంలో పేర్కొన్న పరిస్థితులలోనే ఈ పరీక్షలు జరపాలి.
3. ఈ పరీక్షలు జరిపే ముందు ఆ పరీక్షలను జరపడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన వ్యక్తి :
   ఎ) పరీక్షలు జరిపించుకునే స్త్రీ వయస్సు 30 సంవత్సరాలు దాటిందా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి,
   బి) ఆ స్త్రీ కి అంతకుముందే రెండు లేక అంతకంటే ఎక్కువ సార్లు అబార్షన్ జరిగి ఉంటే ఈ పరీక్ష చేయవచ్చు.
4. గర్భవతి అయిన స్త్రీ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడం వల్ల కూడా వైద్యుల సలహా మేరకు ఈ పరీక్షలు అవసరమవుతాయి.
5. ఈ పరీక్షలు జరిపే ముందు స్త్రీ అంగీకారం రాతపూర్వకంగా ఉండాలి.
6. ఈ పరీక్షలు జరుపుతున్న వ్యక్తి ఆ స్త్రీకి కాని, ఆమె బంధువులకు గాని గర్భంలో ఉన్నది ఆడ శిశువా, మగశిశువా అనే విషయాన్ని సైగల ద్వారా గాని, మాటల ద్వారాగాని, రాతల ద్వారాగాని చెప్పకూడదు. అది శిక్షార్హం.
7. ఈ నేరం చేసిన వైద్యులకు, సిబ్బందికి 3 సంవత్సరాల వరకు జైలుశిక్ష, 10వేల రూపాయల జరిమానా విధిస్తారు. మళ్ళీ తిరిగి ఇదే నేరానికి పాల్పడితే 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, 50 వేల రూపాయల జరిమానా విధిస్తారు.
8. ఈ నేరం చేసిన వైద్యుల, లేదా సిబ్బంది గుర్తింపును రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ 2 సంవత్సరాల వరకు రద్దు చేస్తుంది. వీరు ఇదే విధంగా వ్యవహరించినట్లయితే వారి గుర్తింపు శాశ్వతంగా రద్దు చేస్తారు.

**మన రాష్ట్రంలో ప్రతి 1000 మంది 6 సం॥లలోపు మగపిల్లలకు 957 మంది ఆడపిల్లలు 2001లో ఉంటే, 2011 సంవత్సరానికి 932కు తగ్గిపోయారు. ఆడపిల్ల కడుపులో ఉన్నదని తెలిస్తే కొందరు భ్రూణహత్యకు పాల్పడుతున్నారు. అలా చేయొద్దు. అది నేరం.**

**ఆడపిల్లలను కాపాడండి - వారి రక్షణకై చేయిచేయి కలపండి**

## VII. ప్రసూతి సౌకర్య హక్కుల చట్టం – 1961

గర్భవతులైన, బాలింతలైన ఉద్యోగినులకు, శ్రామిక మహిళలకు ప్రసూతి సౌకర్యం హక్కుగా కల్పిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల బాధ్యతలను ఈ చట్టం నిర్దేశిస్తుంది. ఈ చట్టం ప్రకారం ప్రసూతి సౌకర్యాలను ఉపయోగించుకోవాలనుకునే మహిళ ప్రసవానికి ముందు ఈ సంస్థలో సంవత్సరంలో 160 దినాల పాటు పనిచేసి ఉండాలి. యాజమాన్యం తప్పనిసరిగా ఆరువారాల వేతనాన్ని ఆమెకు అందించాలి. ప్రసవంలో బిడ్డ మరణించినా, స్త్రీ మరణించినా ఇది వర్తిస్తుంది. స్త్రీ మరణించిన సందర్భంలో ఆమె వారసులకు అంద జేయాలి. ఒకవేళ ఆమె అక్కడ సెలవు పెట్టి మరొకచోట పనిచేస్తుంటే ఇది వర్తించదు.

ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు ఇద్దరుకంటే తక్కువ సంతానం ఉన్న వారికి, పూర్తి జీతభత్యాలనిస్తూ 180 రోజుల ప్రసూతి సెలవు ఇస్తారు. అలాగే శ్రామిక మహిళలకు, ప్రైవేటు రంగంలో పనిచేసే మహిళలకు కనీసం 12 వారాల సెలవును జీతంతో ఇవ్వాలి. అవివాహితులై ఉండి గర్భం దాల్చిన మహిళలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. మొత్తం సెలవు దినాల్ని ఒకేసారిగా కాన్పుకు ముందు, తరువాత కూడా వాడుకోవచ్చు.

ఎవరైనా గర్భిణీ స్త్రీలతో ప్రసవానికి ఆరు వారాల ముందు, సెలవు అడిగినా ఇవ్వకుండా పనిచేయించుకున్నట్టయితే శిక్షార్హమైన నేరంగా పరిగణింపబడుతుంది. అంతేకాదు వారికి ప్రసవానికి నెలరోజుల ముందు నుంచీ అధిక శ్రమతో కూడిన పనిని ఇవ్వకూడదు. పారిశ్రామిక సంస్థలో, పనిచేసే ప్రదేశాల్లో గర్భవతులకూ, బాలింతలకూ సరైన సౌకర్యాలు కల్పించాలి. అలా చేయనట్లయితే రోజుకి 250 రూపాయల చొప్పున వారికి పరిహారం చెల్లించాలి.

ఎవరైనా శ్రామిక మహిళ ఉద్యోగ నిర్వహణలో ఉన్నపుడు గర్భస్రావానికి గురైనట్లయితే ఆమె 45 రోజులపాటు జీతంతో కూడిన సెలవును తీసుకోవడానికి ఈచట్టం ద్వారా హక్కు కలిగి ఉంది. ప్రభుత్వ ఉద్యోగినులకు గర్భస్రావం జరిగినట్లయితే సర్వీసులో ఒక్కసారి మాత్రం ఇటువంటి జీతంతో కూడిన 45 రోజుల సెలవు ఇస్తారు. కాన్పు తరువాత ఉద్యోగంలో చేరినట్లయితే బిడ్డకు 15 మాసాల వయస్సు వచ్చే వరకూ రోజుకు రెండుసార్లు బిడ్డకు పాలు ఇవ్వడానికి వీలుగా విశ్రాంతి సమయాన్ని కల్పించాలి.

సమస్యల్లో ఉన్న స్త్రీల కోసం
**భూమిక హెల్ప్‌లైన్**
(కేవలం ఫోన్ ద్వారానే)
**సలహా, సమాచారం కోసం సంప్రదించండి**
(సమయం ఉ.8 గం॥ల నుంచి రా.11గం. వరకు)
టోల్ ఫ్రీ నెంబర్ **1800 425 2908**
మీ వివరాలను గోప్యంగా ఉంచడం మా బాధ్యత

# 1. బాలల హక్కులు

మన దేశంలో బాలలకు కూడా హక్కులు ఉన్నాయనే విషయం చాలా మందికి తెలియదు. బాలలంటే 18 సం॥లలోపు వారు. ఇది తెలియక బాలలు అనేక విధాలుగా తమ హక్కులను కోల్పోతున్నారు. పిల్లల హక్కులపై ఐక్యారాజ్యసమితి తీర్మానం చేసి బాలల హక్కులను ప్రతిపాదించింది. దాదాపు అన్ని ప్రపంచ దేశాలు ఈ ప్రతిపాదనను ఆమోదించాయి. ఈ హక్కుల ఒడంబడికను ఆ మోదించడానికి వెనక చాలా కృషి జరిగింది. ప్రభుత్వ సంస్థలు, మానవ హక్కుల నిపుణులు జరిపిన సుదీర్ఘ చర్చలు, వాదనలే కాక, ప్రభుత్వాలు కూడా ఈ ప్రయత్నంలో భాగం పంచుకున్నాయి.

ఈ ఒప్పందానికి ఆమోదం తెలపడంతో 18 సంవత్సరాలలోపు బాలల సంరక్షణ, పోషణ ప్రతి ఒక్కరికి ముఖ్యంగా ప్రభుత్వాలకు ప్రాధాన్యతాంశాలు అయ్యాయి. అందుకే బాలల హక్కులు ఏం ఉన్నాయో తెలుసుకుందాం.

## జీవించేహక్కు

- జీవనానికి, ఆహారానికి, బట్టలకు సంబంధించిన కనీస ప్రమాణాలపై హక్కు
- ఆరోగ్యం, పోషణ మరియు బ్రతకడానికి అవసరమైనవి అత్యధికంగా పొందగలిగే ప్రమాణాల పై హక్కు
- పేరు, జాతీయత మరియు గౌరవంగా మనుగడ సాగించే హక్కులు




## అభివృద్ధి చెందే హక్కు

- విద్య హక్కు
- బాల్యారంభ దశ సంరక్షణ పరియు అభివృద్ధికై సహకారం హక్కు
- సామాజిక భద్రత
- విరామం, విశ్రాంతి, ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు




## రక్షణ పొందే హక్కు

- అన్ని రకాల దోపిడి, దురుపయోగం / తిట్లు, అమానుషంగా చూడడం లేదా సరిగ్గా ఆదరించకపోవడం మరియు అశ్రద్ధ నుండి విముక్తి / రక్షణ హక్కు
- యుద్ధం, పోరాటం లాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యేక రక్షణ హక్కు




## పాల్గొనే హక్కు

- పిల్లల అభిప్రాయాలను గౌరవించడం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ
- సముచిత సమాచారం అందుకునే హక్కు
- ఆలోచన, అంతరాత్మ, మత స్వేచ్ఛ
- తనకు సంబంధించిన ప్రత్యక్ష లేదా పరోక్ష నిర్ణయాలు తీసుకునేపుడు పాల్గొనే హక్కు



## బాలల హక్కులను అర్థం చేసుకోవడం, పరిరక్షించడం

సమాజంలో కానీ, కుటుంబంలో కానీ, పాఠశాలలో / అంగన్‌వాడీ కేంద్రంలో కానీ బాలలకు తమ హక్కులను పూర్తిగా అందించవలసిన బాధ్యత ప్రభుత్వం, తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరిపైన ఉన్నది. అయినప్పటికీ బాలలు అనేక విధాలుగా తమ హక్కులను కోల్పోతున్నారు. ముఖ్యంగా

- భ్రూణ హత్యల వలన జీవిత హక్కు
- పుట్టిన బిడ్డ ఆడ పిల్ల అని తెలిసిన తర్వాత నిరాదరణ, వివక్ష, ప్రాణహాని
- చదువు కోవలసిన వయస్సులో పనులకు వెళ్ళడం
- వివిధ పనులు చేస్తూ ఆరోగ్యం, స్వేచ్ఛ, జీవించే హక్కు కోల్పోవడం
- వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించకపోవడం వలన ఆరోగ్యం కోల్పోవడం
- అధిక సంతానం వలన పూర్తి సంరక్షణ అందించకపోవడం
- వ్యవసాయానికి, ఇంటిపనులకు ఉపయోగించుకోవడం
- ఆడ పిల్లలకు చదువెందుకనుకోవడం
- బాలలపై వేధింపులు, హింస, దండనలు
- 6 సం॥ల లోపు పిల్లలు పోషకాహారలోపానికి గురి కావడం
- 6 సం॥ల లోపు పిల్లలకు పూర్తి సంరక్షణ అందకపోవడం
- బాలలు సంపూర్ణ, సమగ్ర అభివృద్ధి సాధించకపోవడం
- వైకల్యం ఉన్న వారికి ప్రత్యేక విద్య పొందలేకపోవడం
- బాల్యారంభదశలో పూర్తి స్థాయిలో విద్య అందకపోవడం
- పుట్టిన బిడ్డలను వదిలి వేయడం, తల్లిదండ్రులతో కలిసి జీవించలేకపోవడం
- అభివృద్ధికి ఆటంకం కలిగే వాతావరణంలో పెరగడం
- సంఘ వ్యతిరేక, నేర పూరిత కార్యకలపాల్లో బాలలను వినియోగించడం, మొదలైనవి.

## ఏ విధంగా రక్షించాలి

- బాలలందరికీ హక్కులున్నాయనే విషాయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలి.
- ఈ విషయాలను చాలా చిన్న చిన్న విషయాలుగా చాలా మంది పరిగణిస్తారు కాని, ఈ విషయాలు భావి జీవితాలను ప్రభావితం చేసే అంశాలు
- ఓపికగా అవగాహన కలిగించాలి.
- శిక్షణా కార్యక్రమాలలో ఈ అంశాలపై చర్చించాలి.
- పాఠశాలల్లో వీటిని ప్రస్తావించాలి.
- పిల్లల్లో చర్చలు నిర్వహించాలి.
- పిల్లల నుంచి పిల్లలకు చాలా సమర్థవంతంగా సమాచారం అందుతుంది.
- అంగన్‌వాడీ టీచర్ తల్లిదండ్రుల సమావేశాల్లో, ఇసిసిఇ డే నిర్వహించేపుడు పిల్లల సంరక్షణ, ఆహారం, అభివృద్ధి, వారికి సమకూర్చవలసిన సదుపాయాలు, వాతావరణం పై చర్చించాలి, అందించేందుకు సహకరించాలి.
- బాలకార్మికత, బాల్యవివాహాలు, పిల్లల అక్రమరవాణా పట్ల అప్రమత్తతో వ్యవహరించి జరగకుండా చూడాలి.
- ఆడపిల్లల చదువు, రక్షణల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

## 2. బాలల రక్షణ / సంరక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలు

బాలల హక్కులను పరిరక్షించడం కోసం అనేక చట్టాలు అమలు చేయడం జరుగుతున్నది. అందులో ముఖ్యమైనవి

| చట్టం | ఉద్దేశ్యం |
|---|---|
| 1. సంరక్షకుల మరియు దత్తుల చట్టం, 1890 | • ఒక బాలుడు లేదా బాలిక సంక్షేమానికి సంరక్షకులు అవసరమని కోర్టు భావిస్తే వారి కోసం లేదా ఆస్తి సంరక్షణ కోసం సంరక్షకులను కోర్టు నియమిస్తుంది.<br>• మతంతో నిమిత్తం లేకుండా భారతీయులందరికీ ఈ చట్టం వర్తిస్తుంది. |
| 2. బాల కార్మిక (నిషేధ, నియంత్రణ) చట్టం – 1986 | • 14 సంవత్సరాలలోపు బాల బాలికలతో పనిచేయించడం నేరం.<br>• పనిచేయించిన యజమానులకు జైలుశిక్ష మరియు జరిమానా విధించవచ్చు. |
| 3. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం, 2012 | • బాలలను లైంగిక దాడులు, వేధింపులు, అశ్లీలత, బూతు సాహిత్యం నుంచి రక్షించేందుకు ఈ చట్టం తీసుకు రావడం జరిగింది.<br>• 18 సం॥ల లోపు బాలికలు, బాలురపై లైంగిక నేరాలకు కఠిన శిక్షలు విధించే విధంగా చట్టం వీలు కల్పించింది. |
| 4. హిందూ దత్తత మరియు పోషణ చట్టం, 1956 | • పిల్లల (18 సం॥లు లోపు వారు) దత్తత మరియు పోషణ గురించి ఈ చట్టం నిర్వచిస్తుంది.<br>• ఈ చట్టం హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతస్తులకు వర్తిస్తుంది. |
| 5. బాల్య వివాహ నిషేధ చట్టం, 2006 | • 21 సం॥లు నిండని బాలురకు, 18 సం॥లు నిండని బాలికలకు జరిగే వివాహన్ని నిరోధించేందుకు ఈ చట్టం అమలులోకి వచ్చింది.<br>• అలా జరిగిన వివాహాలు చెల్లవు, రద్దవుతాయి.<br>• బాల్యవివాహం చేసుకున్న 18 సం॥లు దాటిన పురుషుడికి, వివాహం జరిపించిన వారికి జైలుశిక్ష, జరిమానాలు విధించవచ్చు.<br>• కలెక్టర్, ఆర్డీఓ, సిడిపిఓ, తహశీల్దార్, సూపర్‌వైజర్, పంచాయతి సెక్రటరీ, గ్రామపాలనాధికారులు "బాల్య వివాహ నిరోధ అధికారులు" గా వ్యవహరిస్తారు.<br>• గ్రామ స్థాయిలో అమలు చేయడానికి, పర్యవేక్షణకు ఒక కమిటీ ఉంటుంది. సర్పంచ్ అధ్యక్షులు, అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్, పంచాయితి సెక్రటరీ, గ్రామ పాలనాధికారి, స్థానిక పాఠశాల టీచర్, స్వయం సహాయక సంఘ సభ్యులు, మహిళా వార్డ్‌మెంబర్, ఎ.ఎన్.ఎం. స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆశా సభ్యులుగా ఉంటారు. |

| చట్టం | ఉద్దేశ్యం |
|---|---|
| **6.** బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం, **2009** | • **6** నుండి **14** సం॥ల వయస్సు బాలలందరికీ ఎటువంటి ఫీజులు లేకుండా **8**వ తరగతి వరకు ఉచితంగా విద్యను అందించాలి.<br>• విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి. |
| **7.** మహిళ, బాలల సంస్థల లైసెన్సింగ్ చట్టం, **1956** | • మహిళలు, బాలల సంస్థల లైసెన్స్ కోసం ఈ చట్టం ఏర్పడింది.<br>• రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచిన లైసెన్సింగ్ అధికారి అనుమతి లేకుండా ఏ సంస్థను ఏర్పాటు చేయరాదు. |
| **8.** జాతీయ ఆహార భద్రత చట్టం, **2013** | • ఆహారం మరియు పోషకాహార భద్రత కోసం ఉద్దేశించబడినది.<br>• ప్రజాపంపిణీ వ్యవస్థ, మద్యాహ్న భోజన పథకం, ఐసిడియస్ పథకంల ద్వారా అందచేసే ఆహార ధాన్యాలు లేదా భోజనం సరఫరా చేయకపోతే ఆహార భద్రత భత్యం లభిస్తుంది. |
| **9.** బాలల న్యాయం (బాలల రక్షణ, సంరక్షణ) చట్టం, **2015** | • నేరారోపణ ఎదుర్కొంటున్న, నేరం చేసినట్లు రుజువైన మరియు రక్షణ, పోషణ అవసరమున్న బాలలకు సరైన సంరక్షణ, ఆదరణ, అభివృద్ధి, రక్షణ, పునరేకీకరణలతో బాలల ప్రాథమిక అవసరాలను తీర్చడం కోసం మరియు వారికి సంబంధించిన చట్టాలను ఏకం చేస్తూ సవరించిన చట్టం. |
| **10.** ది ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఆక్ట్, **1958** | • నేరారోపణ ఉన్న **21** సం॥ల లోపు వ్యక్తిని కొంతకాలం సత్ప్రవర్తన కారణంగా విడుదల చేసేందుకు ఈ చట్టం ఉద్దేశించబడింది. |
| **11.** బాలల హక్కుల రక్షణ కమీషన్ల చట్టం, **2005** | • బాలల హక్కుల రక్షణ కోసం జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కమీషన్‌ల ఏర్పాటు, బాలల హక్కుల ఉల్లంఘన జరిగిన సందర్భంలో, బాలలపై నేరాలు జరిగిన సందర్భంలో తొందరగా కేసుల విచారణ జరిపేందుకు బాలల కోర్టుల ఏర్పాటు చేసేందుకు ఈ చట్టాన్ని రూపొందించినారు.<br>• ప్రతి జిల్లాలో "బాలల ప్రత్యేక కోర్టు" ఏర్పాటు చేయాలి. |
| **12.** అక్రమ మానవ రవాణా నిరోధక చట్టం, **1986** | • మహిళలు, బాలికలను అనైతికంగా రవాణా చేసి వారితో వ్యభిచారం చేయించడాన్ని నిరోధించేందుకు ఈ చట్టం ఏర్పడింది.<br>• వ్యభిచార వృత్తిని నిరోధించడం, బాధితులకు పునరావాసం కలుగ చేయడం కూడా ఇందులో ఉన్నది. |
| **13.** గర్భస్థ శిశువు ఆరోగ్యం గురించి చేసే పరీక్షల (నియంత్రణ, దుర్వినియోగ నివారణ) చట్టం, **2002** | • తల్లి గర్భంలో పిండం, శిశువుగా మారిన తర్వాత వైద్యపరీక్షలను చేసే విధానాలను నియంత్రించేందుకు, ముఖ్యంగా స్కానింగ్ ద్వారా పుట్టబోయేది ఆడపిల్ల అని తెలుసుకొని అబార్షన్ చేయించడాన్ని నిరోధించేందుకు ఈ చట్టం రూపొందింది. |

## 3. బాలల ఆరోగ్యం, పోషణ, అభివృద్ధి

బాలలు జీవించే హక్కు, పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ స్కూల్ విద్య పొందేహక్కు, అభివృద్ధి చెందేహక్కు, ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే హక్కును సమకూర్చడం కోసం అంగన్‌వాడీ కేంద్రం ద్వారా వివిధ సేవలు అందిచడం జరుగుతున్నది.

- బిడ్డ కడుపులో పడ్డప్పటి నుండే సరైన పోషణ, ఆరోగ్యం, అభివృద్ధి కోసం ఆరోగ్యలక్ష్మి - ఒక పూట సంపూర్ణ భోజనంను గర్భిణీ, బాలింతలకు సమకూర్చడం.
- 7వ నెల నుండి 6 సంవత్సరాల వరకు అనుబంధ పోషకాహారం అందించడం
- పుట్టగానే ముర్రుపాలు, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు, 7వ నెల నుండి అదనపు ఆహారం ప్రారంభించడం, 2 సం॥లు వచ్చేవరకు తల్లిపాలు పట్టడంలాంటి సరైన శిశు మరియు చిన్నపిల్లల పోషణా పద్ధతులు పాటింపజేయడం, కౌన్సిలింగ్ ఇవ్వడం.
- ప్రతి నెల/ప్రతి మూడు నెలల్లో పిల్లలు బరువు మరియు అభివృద్ధి మైలురాళ్ళ పర్యవేక్షణ మరియు పెంపుదలకై కృషిచేయడం.
- తల్లిదండ్రులకు ఇంటి వద్ద పిల్లల పెంపకం, ప్రేరణ, సంరక్షణ అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వడం.
- బిడ్డ ఆరోగ్యంగా, మంచి బరువుతో పుట్టడానికి ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం ద్వారా నిరంతర పర్యవేక్షణ.
- నవ జాత శిశు సంరక్షణకై ఇంటివద్ద కౌన్సిలింగ్ మరియు తల్లి పాలు పట్టే పద్ధతులపై సహకరించడం.
- ఆహారం, ఆరోగ్యం, శుభ్రత, ఎదుగుదలపై తల్లులకు/పిల్లల సంరక్షకుల మరియు కిశోరబాలికల నైపుణ్యాలను మెరుగుపరచడం.
- కృత్యాధారిత, ఆటపాటలతో కూడిన నాణ్యమైన ప్రీస్కూల్ విద్య 3 నుండి 6 సంవత్సరముల పిల్లలకు పాఠ్యప్రణాళిక ప్రకారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు అందించడం.
- ప్రతి నెల నిర్ధేశించిన రోజులలో పోషణ, ఆరోగ్యదినములు ఏర్పాటు చేయడం.
- వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్-ఏ ద్రావణం ఇప్పించడం
- గర్భిణీలకు IFA మాత్రలు, టి.టి.లు ఇప్పించడం ద్వారా పుట్టే బిడ్డ సంరక్షణ.
- తీవ్రలోపపోషణతో ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ మరియు సూపర్‌వైజ్‌డ్ ఫీడింగ్ అందించడం, చికిత్స చేయించడం, NRC కి రెఫర్ చేసి ఆరోగ్య, పోషణ స్థాయి మెరుగుపరచడం.



# 4. సమగ్ర బాలల పరిరక్షణ పథకం

## (INTEGRATED CHILD PROTECTION SCHEME - ICPS)

నేటి బాలలే రేపటి పౌరులు. వారిని రక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో బాలలు మన రాష్ట్ర జనాబాలో సుమారు 38% ఉన్నారు. వీరందరిని రక్షించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నది.

రక్షణ బాలల హక్కు. రక్షణ అంటే ప్రాణాలకు, అభివృద్ధికి మరియు వ్యక్తిగత హాని నుంచి బాలలను కాపాడటం మరియు ఎవరూ సామాజిక భద్రత వలయం నుండి బయటికి వెళ్ళిపోకుండా జాగ్రత్త పడటం, ఒకవేళ సంరక్షణ, రక్షణ, సహకారం అవసరం ఉన్న బాలలకు రక్షిత వాతావరణాన్ని కల్పించడం. ఇబ్బందులలో ఉన్న బాలలను రక్షించకపోవడం వలన వారి భౌతిక, మానసిక, సామాజికోద్వేగ అభివృద్ధికి సంబంధించిన తీవ్ర నష్టం సంభవిస్తుంది.

వీటిని దృష్టిలో పెట్టుకుని బాలల కోసం కేంద్రప్రభుత్వం, స్త్రీ శిశు సంక్షేమశాఖ మరియు ఇతర శాఖల క్రింద బాలల రక్షణకు కేటాయించిన పథకములన్నీ ఒకేచోట సంఘటితపరిచి "సమగ్ర బాలల పరిరక్షణ పథకం"గా రూపొందించినారు. ఈ పథకం 0-18 సంవత్సరాల బాలబాలికల రక్షణకు, పిల్లలకు హాని కలగకుండా మరియు వారి హక్కుల పురోగతికి తోడ్పడుతుంది.

### ప్రధాన లక్ష్యం

దోపిడి, అవమానాల నుంచి పిల్లలను విముక్తి చేయడం ద్వారా మాత్రమే కాకుండా, వారి సంక్షేమానికి ఆహారం, వసతి, ఆరోగ్యం, విద్య మరియు తగిన జీవనస్థాయిని కల్పించడం, తద్వారా బాలల సంక్షేమాన్ని సాధించడం.



### పథక ఉద్దేశ్యాలు



- బాలలకు సము చితంగా, న్యాయబద్ధంగా అందవలసిన సేవలను సుగమం చేయడం
- ప్రతి స్థాయిలోని వ్యక్తుల సామర్థ్యాలను మెరుగుపరచడం
- సేవలకు, పర్యవేక్షణకు, బాలల ట్రాకింగ్ సిస్టమ్‌కు సంబంధించిన సమాచార మరియు విజ్ఞాన మూలాలను తయారు చేయడం
- కుటుంబ మరియు కమ్యూనిటీ స్థాయిలో బాలల రక్షణ, పరిరక్షణను పటిష్టపరచడం మరియు వారిని చైతన్య పరుస్తూ బాలలపై జరిగే వేధింపులను అరికట్టడం.
- అన్ని స్థాయిలలో బాధ్యతలను, పరస్పర సమన్వయంతో అమలు జరిగేలా చూడడం.
- ప్రజలలో బాలల వాస్తవ స్థితి, హక్కులు, రక్షణ, అందుబాటులో ఉన్న సేవలు, పథకాలు, సంస్థలపై అవగాహన కలిగించడం.
- పరిశోధనలు మరియు డాక్యుమెంటేషన్ చేయడం.



### పథక పరిధిలో వచ్చే బాలలు




1. జె.జె. ఆక్ట్ లో నిర్వచించిన ప్రకారం రక్షణ మరియు సంరక్షణ అవసరమైనవారు
2. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించేవారు
3. ఏదైనా పరి స్థితులలో చట్టప్రకారం బాధితులైనవారు, సాక్షులుగా ఉన్నవారు.
4. ఎవరైనా ఇతర సమస్యలలో ఉన్న బాలలు

## సంస్థాగత ఏర్పాట్లు

| స్థాయి | వ్యవస్థ | విధులు |
|---|---|---|
| 1. రాష్ట్రస్థాయి | ఏ) రాష్ట్రబాలల పరిరక్షణ సొసైటీ (SCPS) | జిల్లాలలోని బాలల పరిరక్షణ యూనిట్‌లు, వాటి పనితీరు, స్థితిపై రాష్ట్రస్థాయి సమాచారాన్ని తాజాపరచడంతో పాటు, పథకం అమలును పర్యవేక్షిస్తుంటారు. డైరక్టర్, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డైరక్టర్ కార్యాలయం, హైద్రాబాద్‌లో పనిచేస్తుంది. |
| | బి) రాష్ట్ర ప్రత్యేక దత్తత ఏజెన్సీ (SARA) | రాష్ట్రంలోని బాలల దత్తత మరియు సంబంధిత అంశాలపై పనిచేయటానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏజెన్సీని ఏర్పాటుచేసింది. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి పెద్దగా వ్యవహరిస్తారు. 6 గురుతో ఒక కార్యనిర్వాహక వర్గం (గవర్నింగ్ బాడీ) ఏర్పాటు చేయబడినది. వీరంతా రాష్ట్రంలో దత్తత ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకారాన్ని అందిస్తారు. ఇది డైరక్టరేట్‌లో ఉన్నది. |
| 2. జిల్లాస్థాయి | ఏ) జిల్లా బాలల పరిరక్షణ సొసైటీ (DCPS) | ప్రతి జిల్లాలో ఇవి ఉన్నాయి. జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన జిల్లాలోని బాలల పరిరక్షణ అమలును పర్యవేక్షిస్తుంటాయి. |
| | బి) జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ (DCPU) | ప్రతి జిల్లాలో జిల్లా వెల్‌ఫేర్ ఆఫీసర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పని చేస్తున్నాయి. జిల్లాలోని బాలల పరిరక్షణను అమలు పరుస్తుంటారు. ప్రతి యూనిట్‌కి పరిరక్షణ అధికారి (DCPO) ఉంటారు. |
| | సి) బాలల న్యాయ మండలి / బోర్డ్ (Juvenile Justice Board) | నేరారోపణ చేయబడిన బాలలకు సంబంధించిన కేసుల పరిశీలనకు గాను ప్రతి జిల్లాలో (పాత జిల్లాలు) వీటి ఏర్పాటు చేయనైనది. ఒక మెజిస్ట్రేట్ మరియు ఎంపిక చేయబడిన ఇద్దరు సమాజ సేవకులతో ఒక బెంచ్‌గా ఏర్పాటు చేయబడినది. |
| | డి) బాలల సంక్షేమ కమిటి (CWC) | ఒక చైర్‌పర్సన్, నలుగురు సభ్యులతో ఈ కమిటీలను ఏర్పాటు చేయబడినది. తెలంగాణలో పాత జిల్లాల (10)లో ఏర్పాటు చేయబడినవి. బాలలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి, వారికి సరిపడా ఉత్తర్వులు జారీ చేస్తారు. |
| | ఇ) చైల్డ్‌లైన్ – 1098 | బాలల పరిరక్షణకై ఏర్పాటు చేసిన అత్యవసర, ఉచిత టెలిఫోన్ నెంబర్. 24 గంటలు పనిచేస్తుంది. |
| | ఎఫ్) సంరక్షణ సదనాలు<br><br>1. ప్రత్యేక దత్తత ఏజన్సీ (SAA) | బాలల దత్తత, సంస్థాగతేతర సేవలు అందించడానికి రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికార సంస్థ. తెలంగాణలో పాత జిల్లాల్లో 11 ప్రత్యేక దత్తత ఏజెన్సీలు – శిశుగృహాలు ఏర్పాటు చేయబడినవి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, తాండూర్, |

| స్థాయి | వ్యవస్థ | విధులు |
|---|---|---|
| | | వికారాబాద్‌లలో ఒకటి, నల్లగొండలో 2 శిశుగృహలు మరియు హైద్రాబాద్‌లో ఒక శిశువిహార్ నిర్వహించబడుతున్నాయి. |
| | 2. బాల సదనాలు (Children Homes) | • రక్షణ, సంరక్షణ అవసరమైన బాలలకు వసతి కల్పించి, వారి సంరక్షణ, విద్య, శిక్షణ, చికిత్స, అభివృద్ధి, పునరావాసానికి ప్రభుత్వం లేదా ప్రభుత్వేతర లేదా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన సదనాలు.<br>• మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ 35 బాల సదనాలను నిర్వహిస్తున్నది. ఇందులో బాలికలను మాత్రమే చేర్చుకుంటారు. వీరికి చదువు, వసతి, భోజనం మొ॥ సౌకర్యాలు ఇవ్వడం జరుగుతుంది. ములుగు, గూడూర్, జనగాం, కరీంనగర్, హుజూరాబాద్, జగిత్యాల, ఖమ్మం, భద్రాచలం, మణుగూరు, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, అసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, బాన్స్‌వాడ, భువనగిరి, నల్గొండ, మిర్యాలగూడ, మహబూబ్‌నగర్, అచ్చంపేట, వనపర్తి, ఆత్మకూర్, గద్వాల, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, నారాయణ్‌ఖేడ్, పరిగి, వికారాబాద్, అల్వాల్, మోయినాబాద్, వరంగల్, హైద్రాబాద్ (రెండు)లలో ఇవి పనిచేస్తున్నాయి.<br>• జువెనైల్ డిపార్ట్‌మెంట్ ద్వారా బాలల సదనాలు హైద్రాబాద్, వరంగల్ (బాలురకు)లో నిర్వహించ బడుతున్నాయి.<br>• ప్రవేట్ బాల సదనాలు అన్ని జిల్లాల్లో మొత్తం 365 వరకు నిర్వహించబడుతున్నాయి. |
| | 3. జువెనైల్ హోమ్స్ | నేరారోపణ, విచారణ ఎదుర్కొంటున్న బాలల రక్షణ, సంరక్షణ, పునారావాసం సౌకర్యం కలిగించే గృహాలు. ప్రభుత్వం నడిపిస్తున్న స్పెషల్‌హోమ్స్ 2 హైద్రాబాద్‌లో పనిచేస్తున్నాయి. అబ్జర్వేషన్ హోమ్స్ హైద్రాబాద్, వరంగల్, నిజామాబాద్‌లలో పనిచేస్తున్నాయి. |
| 3. గ్రామస్థాయి | గ్రామ బాలల పరిరక్షణ కమిటీ (VCPC) | గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామంలోని బాలల రక్షణకై ఏర్పాటు చేసిన కమిటీ. కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్ పనిచేస్తారు. |



## చైల్డ్ లైన్ - 1098

### చైల్డ్‌లైన్ అంటె ఏమిటి?

చైల్డ్‌లైన్ 1098 నంబర్ దేశవ్యాప్తంగా 24 గంటలు పనిచేసే పిల్లల అత్యవసర టోల్ ఫ్రీ నంబర్. ఇది పిల్లలకోసమే ఏర్పాటు చేసినటువంటిది.

### ఎలా పని చేస్తుంది :

- ఆపదలో ఉన్న పిల్లలు ఎవరైనా సహాయం కొరకు ఈ 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చును.
- ఫోన్ వచ్చిన వెంటనే చైల్డ్‌లైన్ సిబ్బంది అక్కడికి చేరుకొని వెంటనే సహాయం అందించడం జరుగుతుంది.
- ఒక్కోసారి దగ్గరలో ఉన్న సంబంధిత అధికారులకు సమాచారం అందించి వెంటనే తగిన సహాయం పిల్లలకు అందించే విధంగా చైల్డ్‌లైన్ పని చేస్తుంది.
- అలాగే చైల్డ్‌లైన్ పిల్లల రక్షణ, సంరక్షణ కొరకు ఎక్కువ జన సమూహం ఉన్నటువంటి ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

### ఎలాంటి పిల్లలకోసం ఫోన్ చేయవచ్చు

- ఇంటి నుండి పారిపోయిన
- తప్పిపోయిన
- తల్లిదండ్రులు లేని
- బాల్యవివాహ బాధితులు
- అడుక్కుంటున్న
- బాల కార్మికులు
- వేదింపులకు గురి అవుతున్న
- వదిలి వేయబడిన
- ఆశ్రయం అవసరం ఉన్న
- హింసకు గురి అవుతున్న పిల్లలు







### చైల్డ్‌లైన్ ఏ శాఖలతో కలిసి పనిచేస్తుంది

- పోలీస్ శాఖ
- విద్యా శాఖ
- ఆరోగ్య శాఖ
- న్యాయ శాఖ
- రెవెన్యూ శాఖ
- మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
- కార్మిక శాఖ
- మున్సిపాల్ శాఖ

### రక్షించడం మరియు పునరావాసం

సంబంధిత శాఖల అధికారులతో కలిసి చైల్డ్‌లైన్ పిల్లలను రక్షిస్తారు మరియు వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని కల్పిస్తారు. వారి దగ్గర నుండి పూర్తి సమాచారాన్ని తీసుకొని “చైల్డ్ వెల్ఫేర్ కమిటి” కి అందించడం జరుగుతుంది. ఈ కమిటీ ఆదేశానుసారంగా సంబంధిత హోమ్‌లలో పునరావాసం కల్పించడం జరుగుతుంది.

### చైల్డ్‌లైన్ కు ఎందుకు ఫోన్ చేస్తారు

- కుటుంబాలను చేరడం కోసం
- ప్రమాదం నుండి రక్షణ కోసం
- పునరావాసం, ఆశ్రయం కోసం
- కౌన్సిలింగ్, సలహాల కోసం
- స్పాన్సర్ షిప్ కోసం (చదువు, మెడికల్)

# 5. బాలల న్యాయం (బాలల రక్షణ, సంరక్షణ) చట్టం - 2015
# (Juvenile Justice Act - JJ Act)

నేరారోపణ ఎదుర్కొంటున్న, నేరం చేసినట్లుగా రుజువైన మరియు రక్షణ, పోషణ అవసరమైన బాలలకు సరైన సంరక్షణ, ఆదరణ, అభివృద్ధి, రక్షణ, సామాజిక పునరేకీకరణలతో వారి ప్రాథమిక అవసరాలను తీర్చటం, వారితో స్నేహపూరిత విధానంలో న్యాయ నిర్ణయాలు తీసుకోవటం మరియు వారి పునరావాసం కొరకు వివిధ పద్ధతులు, సంస్థలు ఏర్పాటు చేసి వారికి సంబంధించిన విషయాలు మరియు ప్రయోజనాల కొరకు, వారికి సంబంధించిన చట్టాలను ఏకం చేస్తూ సవరించిన చట్టం ఇది.

## ఈ చట్టం ప్రకారం రెండు రకాల పిల్లలున్నారు

**1. పోషణ, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలు**

- ఏ రకమైన ఇల్లు / స్థిరనివాసం లేని పిల్లలు
- భిక్షాటన
- వీధులలో
- కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న పిల్లలు
- గార్డియన్ అయినా, కాకపోయిన వ్యక్తితో ఉంటున్న పిల్లలు

**2. చట్టంతో విభేదించిన పిల్లలు**

- ఒక నేరాన్ని చేసినట్లుగా వెల్లడైన
- నేరారోపణకు గురై ఆ నేరం జరిగిన సమయానికి 18 సం॥ల వయస్సు పూర్తికాని వారు.

## బాల న్యాయ మండలి / బోర్డ్ ( Juvenile Justice Board )

- నేరారోపణ చేయబడిన బాలలకు సంబంధించిన కేసుల పరిశీలనకు గాను ప్రతి జిల్లాలో బాల న్యాయ మండలి ఏర్పాటు చేయనైనది.
- ఒక మెజిస్ట్రేట్ మరియు ఎంపిక చేయబడిన ఇద్దరు సమాజ సేవకులతో ఒక బెంచ్ గా ఏర్పాటు చేయబడుతుంది.
- ఈ బోర్డు నిర్దేశించిన సమయంలో, నియమాలను పాటిస్తూ సమావేశాలు నిర్వహించాలి. ఇవి సాధారణ న్యాయ స్థానాలను పోలి ఉండకుండా, బాలలకు స్నేహపూరిత వాతావరణంలో విచారణను జరుపుతుంది.
- విచారణ ప్రక్రియ జరిగే ప్రతిసారి బాలల తల్లిదండ్రులు లేదా గార్డియన్ పాల్గొనవచ్చు.
- న్యాయ సహాయ సంస్థల ద్వారా బాలలకు న్యాయ సహాయం అందుబాటు లో ఉండేటట్లు చేస్తుంది.
- కేసు పరిష్కారం మరియు చివరి ఉత్తర్వులు జారీ చేసే సమయంలో బాలల పునరావాసం, వారి సంరక్షణకు జిల్లా బాలల రక్షణ విభాగాన్ని లేదా ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధిని ఆదేశించవచ్చు.

### నేరారోపణ ఎదుర్కొంటున్న బాలల గురించి బోర్డుచే విచారణ

- విచారణను 4 నెలలలోపు పూర్తి చేయాలి.
- విచారణ చాలా సున్నితంగా స్నేహపురిత వాతావారణంలో జరపాలి
- పోలీసు లేదా మరే ఇతర వ్యక్తి బాలలను ఏ రకంగాను క్షోభ పెట్టలేదని నిర్ధారించుకోవాలి. క్షోభ పెట్టినట్లయితే దానిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలి.
- బాలల అభిప్రాయాలను వినేందుకు అవకాశం ఇవ్వాలి. విచారణలో పాలుపంచుకునేట్లు చేయాలి.
- నేర తీవ్రతను బట్టి విచారణ చేస్తారు.
- నేరానికి పాల్పడినట్లు భావిస్తే మందలించి బాలలను ఇంటికి పంపడం, జరిమానా విధించడం, కమ్యూనిటీ సేవలు అందించడం, విడుదల చేసి ఒకరి ఆధీనంలో ఉంచడం, సదనాలకు పంపడం లాంటి ఉత్తర్వులు ఇవ్వవచ్చు.

## బాలల సంక్షేమ కమిటీ (Child Welfare Committee - CWC)

- రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీకి ఒక చైర్‌పర్సన్, నలుగురు సభ్యులను నియమించాలి. వారిలో ఒకరు మహిళ, మరొకరు బాలలకు సంబంధించిన విషయాల్లో నిపుణులు ఉండాలి.
- తెలంగాణలో పాత 10 జిల్లాల్లో ఈ కమిటీలు ఏర్పాటు అయ్యాయి.
- కమిటీ ఒక బెంచ్‌లాగ పని చేస్తుంది. ఒక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ / మొదటి తరగతి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు ఉన్న అధికారాలు ఈ బెంచ్‌కు వర్తిస్తాయి.
- ఈ కమిటీకి జిల్లా మేజిస్ట్రేట్ ఫిర్యాదుల పరిష్కార అధికారిగా ఉంటారు. బాలలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి సరిపడా ఉత్తర్వులు జారీ చేస్తారు.
- ఈ కమిటీ నెలలో కనీసం 20 రోజులు సమావేశం కావాలి.
- చైల్డ్ కేర్ యూనిట్లు ( బాలల సదనాలు ) సందర్శించి, వాటి పని తీరును, బాలల బాగోగులను విచారిస్తారు.
- రక్షణ, సంరక్షణ అవసరమైన బాలల పోషణ, రక్షణ, అభివృద్ధి, చికిత్స, పునరావాసానికి సంబంధించిన కేసులు నిర్ణయించి పరిష్కరిస్తారు.
- అనాథలు, విడచిపెట్టబడిన, అప్పగించబడిన బాలల విచారణ అనంతరం వారు దత్తత ఇచ్చేందుకు స్వేచ్ఛ ఉన్నట్లు ప్రకటిస్తారు.
- లైంగిక వేధింపులకు గురి అయిన బాలలను వారి ముందు ప్రవేశ పెట్టినపుడు వారి పునరావాసానికై చర్యలు తీసుకుంటారు.
- బాలలను దూషించినట్లు ఫిర్యాదు ఉంటే, కమిటీ విచారించి, సంబంధిత శాఖకు తగిన నిర్దేశాలు ఇస్తుంది.
- బాలలకు తగిన న్యాయసేవలు అందిస్తుంది.
- రోజూ పత్రికల్లో వస్తున్న బాలల సమస్యల పట్ల జోక్యం చేసుకుంటుంది.




- రక్షణ, సంరక్షణ అవసరమైన బాలలను పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగి, చైల్డ్‌లైన్, బాలల సంక్షేమ అధికారి, సామాజిక కార్యకర్త లేదా సామాజిక స్పృహ ఉన్న పౌరుడు, బిడ్డ తనంతటతాను, వైద్య సిబ్బంది ఎవరైనా 24 గంటలలో బోర్డు ముందు హాజరుపరచాలి.
- విచారణ పూర్తయిన తర్వాత బాలల వయస్సును బట్టి ప్రత్యేక దత్తత ఏజెన్సీ లేదా బాలల గృహంలాంటి ప్రదేశాలకు పంపవచ్చును.
- దత్తత ఇచ్చేందుకు చట్టపరంగా స్వేచ్ఛ ఉన్నట్లు ప్రకటిస్తారు.

## సంస్థాగత మరియు ఇతర ఏర్పాట్లు

- ఓపెన్ షెల్టర్స్ – తాత్కాలికంగా పోషణ, రక్షణ అవసరమైన పిల్లల కొరకు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తారు.
- ఆశ్రయ సంరక్షణ – రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లలకు కొంత కాలం బాలల స్వంత తల్లిదండ్రులు లేదా దత్తత పొందిన తల్లిదండ్రులు లేదా ప్రభుత్వం గుర్తించిన కుటుంబం లేదా కమ్యూనిటీ ఆశ్రయ పోషణలో ఉండేలా కమిటీ ఉత్తర్వులు ఇవ్వవచ్చు.
- స్పాన్సర్‌షిప్ (ప్రాయోజితం) – ఎవరైనా స్పాన్సర్ చేసి బిడ్డ జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చు. కుటుంబాలకు / ప్రత్యేక గృహాలకు / బాలల గృహాలకు ఆర్థికంగా మద్దతునివచ్చు.
- పరిశీలన గృహాలు (అబ్జర్వేషన్ హోమ్స్) – నేరారోపణలున్న బాలలకు తాత్కాలికంగా రక్షణ, సంరక్షణ అందించేవి.
- ప్రత్యేక గృహాలు (స్పెషల్ హోమ్స్) – విచారణ ఎదుర్కొంటున్న బాలల పునరావాసం సౌకర్యం కలిగించి, తప్పిదాలకు పాల్పడకుండా చూసేవి.
- బాలల గృహాలు – రక్షణ, సంరక్షణ అవసరమైన బాలలను ఉంచి వారి సంరక్షణ, చికిత్స, విద్య, శిక్షణ, అభివృద్ధి, పునరావాసాల కొరకు ప్రభుత్వం / స్వచ్ఛంద / ప్రభుత్వేతర సంస్థల ద్వార ఏర్పాటు చేసినవి.
- రాష్ట్ర బాలల రక్షణ సంఘం, జిల్లా బాలల రక్షణ సంఘం – ఈ చట్టాన్ని అమలు పరచడానికి, బాలలకు సంబంధించిన విషయాలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఏర్పాట్లు.
- బాలల సంక్షేమ పోలీస్ అధికారి, ప్రత్యేక బాలల పోలీస్ విభాగం – ప్రతి పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ హోదాకు తగ్గని అధికారిని బాలల సంక్షేమ అధికారిగా నియమించి, ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

## దత్తత

- 'దత్తత' అనేది అనాథ, వదిలేసిన, అప్పగించబడిన పిల్లలకు కుటుంబం కలిగి ఉండే హక్కును నిర్ధారించే విషయం.
- మతంతో సంబంధం లేకుండా ఒక బంధువు వద్ద నుండి మరొక బంధువు దత్తత తీసుకోవచ్చు.
- హిందూ దత్తత, నిర్వహణ చట్టం, 1956 కింద బాలల దత్తతకు సంబంధించిన విషయాలకు ఈ చట్టం వర్తించదు.
- ఇతర దేశాల వ్యక్తులకు కూడా ఈ నియమాల ప్రకారం మాత్రమే దత్తత ఇవ్వాలి.
- న్యాయస్థానం నుంచి చెల్లుబాటు కాని విధంగా ఏ వ్యక్తి అయినా బిడ్డను ఇతర దేశానికి తీసుకువెళ్ళినా, పంపినా, విదేశాలలో ఉంటున్న వేరొక వ్యక్తికి పోషణ, ఆధీనాలకై బిడ్డను పంపేందుకు జరిపిన ఏరకమైన ఏర్పాట్లలో పాలుపంచుకున్నా ఈ చట్టంలోని సెక్షన్ 80 ప్రకారం శిక్షార్హులు.

**దత్తత తల్లిదండ్రులు కావాలనుకునే వారి అర్హత :**

- శారీరకంగా, మానసికంగా బిడ్డను చక్కగా తీర్చిదిద్దే ఆరోగ్యం, ప్రేరణగలవారై ఉండాలి.
- దత్తతకు భార్యా భర్తల ఇద్దరి అంగీకారం కావాలి.
- ఒంటరి లేదా విడాకులు పొందిన వ్యక్తి కూడా దత్తత తీసుకొనవచ్చు.
- ఒంటరిగా నివసించే మగ వ్యక్తి బాలికలను దత్తతను తీసుకునేందుకు అనర్హుడు.

### భారత దేశంలో నివసిస్తూ దత్తత తీసుకొనగోరే తల్లిదండ్రులు అవలంభించే విధానం :

- భారత దేశంలో నివసిస్తూ దత్తత తీసుకోవాలనుకునే వారు ఏ మతానికి చెందిన వారు అన్న విషయంతో సంబంధం లేకుండా దత్తత నియమాలలో పొందుపరచిన పద్ధతి ప్రకారం ప్రత్యేక దత్తత ఏజన్సీకి దరఖాస్తు చేసుకోవాలి.
- రాష్ట్ర ప్రభుత్వం 10 జిల్లాల్లో 11 ప్రత్యేక దత్తత ఏజన్సీలను, శిశు గృహాలను ఏర్పాటు చేయడం జరిగింది.
- దత్తత ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేసుకోవాలి. వెబ్‌సైట్ అడ్రస్ – www.cara.nic.in
- ప్రత్యేక దత్తత ఏజన్సీ వారు, దత్తత తీసుకోదలచిన తల్లిదండ్రుల గృహ అధ్యయన నివేదికను తయారుచేసి, వారు అర్హులని తెలియజేస్తారు. "చట్టప్రకారం దత్తతకు స్వేచ్ఛ ఉన్నట్లు" అని ప్రకటించబడిన బిడ్డను, దత్తత నియమాలలో చెప్పిన ప్రకారం వీరికి చూపించ టమౌతుంది.
- బిడ్డ యొక్క అధ్యయన మరియు వైద్య నివేదికలపై దత్తత తీసుకుబోయే తల్లిదండ్రులు సంతకం చేసి, బిడ్డను తీసుకునేందుకు ఆమోదం తెలపాలి. తరువాత, ప్రత్యేక దత్తత ఏజన్సీ బిడ్డను వారికి అప్పగించి, దత్తత ఉత్తర్వులు కోసం న్యాయస్థానంలో ఒక దరఖాస్తు ఇవ్వాలి.
- న్యాయస్థానం నుంచి ధృవీకరించిన ఉత్తరువులు అందగానే, వెంటనే దత్తత తీసుకోదలచిన తల్లిదండ్రులకు ప్రత్యేక దత్తత ఏజన్సీ పంపాలి.
- భారత దేశంలో ఉండే తన బంధువు వద్ద నుంచి బిడ్డను దత్తత తీసుకోవాలని ఆశించే విదేశాలలో ఉండే బంధువు, దత్తత నియమాల ప్రకారం దత్తత తీసుకోవచ్చును.

**దత్తత ప్రభావం :**

- న్యాయస్థానం నుంచి దత్తత ఉత్తర్వులు పొందిన బిడ్డ దత్తత తీసుకున్న దంపతుల బిడ్డ అవుతారు. కన్న బిడ్డకుండే హక్కులన్నీ దత్తత ఉత్తర్వులు మంజూరయిన తేదీ నుంచి వర్తిస్తాయి. బిడ్డ పుట్టిన కుటుంబంతో బిడ్డకు ఉన్న హక్కులన్నీ తెగతెంపులవుతాయి. అవన్నీ దత్త కుటుంబంతో భర్తీ అవుతాయి.
- దత్తత ఉత్తర్వులు అమలు అయ్యే ముందు తేదీ వరకు దత్తత ఇచ్చిన బిడ్డకు సంబంధించిన ఏరకమయిన ఆస్తి అయినా, యాజమాన్యపు హక్కులపై ఏవైనా బాధ్యతలున్నా లేదా ఆస్థి నిర్వహణకు సంబంధించి కుటుంబ బంధువులు దాని నిర్వహణ చూడాల్సివున్నా సదరు బాధ్యతలకు లోబడి బిడ్డకు ఆస్తి హక్కు కొనసాగుతుంది.

**రిజిస్టరు కాని దత్తత సంస్థలలోని పిల్లల దత్తత**

ఈ చట్టం కింద రిజిస్టరు అయివుండి, ప్రత్యేక దత్తత ఏజేన్సీలుగా గుర్తించబడకున్నా వారి రక్షణ, సంరక్షణ కింద ఉన్న బాలలను కమిటీ ముందు ప్రవేశపెట్టి, చట్ట ప్రకారం దత్తతకు స్వేచ్ఛ ఉన్న పిల్లలుగా నిర్ధారణ చేయవచ్చు. ఈ సంస్థలన్నీ, దగ్గరలో ఉన్న ప్రత్యేక దత్తత ఏజన్సీలతో సంబంధం ఏర్పరుచుకునీ ఈ పిల్లల జాబితాను, సంబంధిత నమోదు పత్రాలతో సదరు ప్రత్యేక దత్తత ఏజన్సీకి అందజేయాలి.

## బాలలపై ఇతర నేరాలు

**బాలల గుర్తింపు వెల్లడి నిషేధం :**

- చట్టంలో విభేధించబడిన, రక్షణ లేదా సంరక్షణ అవసరమైన, ఒక నేరానికి గురై లేదా నేరానికి సాక్షిగా ఉన్న బాలల గురించి, వారికి సంబంధించిన ఏ విచారణ లేదా పరిశోధన లేదా న్యాయ ప్రక్రియల సందర్భంలో వారి పేరు, చిరునామా లేదా పాఠశాల లేదా బాలలను గుర్తించేందుకు అవకాశం వున్న ఏవిషయాన్నయినా వార్తాపత్రిక, పత్రిక, ఛానల్‌కి అందచేయడం, బాలల ఫోటోలు ఇవ్వడం నిషేధం.
- పోలీసు ఈ కేసుకు సంబంధించిన ఏ రికార్డునూ వెల్లడించకూడదు.
- ఈ అంశాలను ఉల్లంఘించిన వారికి గరిష్టంగా 6 నెలల వరకు జైలు శిక్షను, గరిష్టంగా రెండు లక్షల రూపాయల వరకు జరిమానాను విధించవచ్చు.

**బాలల పట్ల క్రూరత్వానికి శిక్ష:**



- బాలలను ఆధీనంలో లేదా నియంత్రణలో ఉంచుకున్న ఏవ్యక్తి అయినా వారిని అనవసరమైన మానసిక శారీరక వేదనకు గురిచేసే విధంగా ప్రవర్తించినా గరిష్ఠంగా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, ఒక లక్ష రూపాయల జరిమానా వారికి విధించవచ్చు.
- అంతేకాకుండా ఏదైనా సంస్థలో నియమించబడిన వ్యక్తి కానీ, బాలల పోషణ, రక్షణ బాధ్యత అప్పగించబడిన సంస్థను నడిపించే వ్యక్తి గానీ ఈ రకమైన నేరానికి పాల్పడినట్లయితే, ఆ వ్యక్తికి గరిష్టంగా ఐదేళ్ళ వరకు కఠిన కారాగార శిక్ష, దాంతోబాటు గరిష్టంగా ఐదు లక్షల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.
- ఈ క్రూర చర్యల ఫలితంగా బాలలు శారీరకంగా అసమర్ధతకు, మానసిక అస్వస్థతకు గురై రోజువారీ పనులు చేసుకునేందుకు పనికిరాకపోయినా లేదా శారీరకంగా గాయపడినా ఆ వ్యక్తికి గరిష్టంగా 10 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్షతో పాటు, 5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు

**బాలలచే భిక్షాటన చేయించడం:**

- ఎవరైనా బాలలచే బిక్షాటన చేయించేందుకు ప్రయత్నించినా, అందుకు ఉపయోగించుకున్నా ఆవ్యక్తికి గరిష్టంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, దానితోబాటు లక్ష రూపాయల జరిమానా విధించవచ్చును.
- బిక్షాటనకోసం బాలల శరీరానికి గాయం చేసినా, ఏదైనా అవయవాన్ని తొలగించినా ఆ వ్యక్తికి పదేళ్ళవరకు కఠిన కారాగార శిక్షతోపాటు, 5 లక్షల జరిమానా విధించవచ్చు.
- ఆధీనంలో లేదా నియంత్రణలో బాలలను ఉంచుకున్న వ్యక్తి ఏదేని నేరం జరిగేందుకు పురిగొల్పినట్లయితే ఆ వ్యక్తికి పై అదే శిక్ష విధించవచ్చు మరియు వ్యక్తిని అనర్హునిగా చేయవచ్చు.



**బాలలకు మత్తునిచ్చే మద్యాన్ని లేదా మాదక ద్రవ్యాన్ని లేదా మానసిక ప్రభావం చూపే పదార్థాలను ఇచ్చినందుకు జరిమానా:**

- సరైన అర్హతలు కల్గిన వైద్యుని ఉత్తర్వుల మేరకు తప్ప, వేరేవిధంగా ఎవరైనా ఏబిడ్డకు అయినా మత్తునిచ్చే మద్యాన్ని గానీ, ఏ రకమైన మాదక ద్రవ్యాన్ని గానీ, మానసిక ప్రభావం చూపే ఏ పదార్థాన్ని గానీ, పొగాకు ఉత్పత్తులను గానీ ఇచ్చినా, ఇచ్చినందుకు కారకులైనా, ఆ వ్యక్తికి గరిష్టంగా ఏడేళ్ళ వరకు కఠిన కారాగార శిక్ష, దానితోపాటు గరిష్టంగా లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

**మత్తుని ఇచ్చే ఏ మద్యాన్ని గానీ, మారక ద్రవ్యాన్ని లేక మానసిక ప్రభావం చూపే పదార్ధాల పంపిణీకి (అమ్మటానికి, మోయటానికి లేదా స్మగ్లింగ్ చేయటానికి) బాలలను ఉపయోగించటం :**

- ఎవరైనా బాలలను మత్తునిచ్చే మద్యాన్ని మాదక ద్రవ్యాన్ని లేక మానసిక ప్రభావం చూపే ఏ పదార్ధాన్ని పంచటానికి, మోయటానికి కాని లేదా పంపిణీకి గానీ ఉపయోగించనట్లయితే వారిపై గరిష్టంగా ఏడేళ్ళ వరకు కఠిన కారాగార శిక్షతోపాటు ఒక లక్ష రూపాయలు జరిమానా విధించవచ్చు.

**బాల కార్మికత :**

- బాలలను పనిలో పెట్టుకొని ఉద్యోగం కోసం కట్టుబడి ఉండేటట్లు చేయటం లేదా వారి సంపాదనను వారికి ఇవ్వకుండా ఆపడం లేదా ఆ సంపాదనను తనకోసం ఉపయోగించుకోవటం, చేసిన వ్యక్తికి గరిష్టంగా ఐదేళ్ళ వరకు కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధించవచ్చు.



**వివరణ :** ఉద్యోగం అంటే ఆర్థిక లాభం కోసం సేవలు, వస్తువుల విక్రయం, బహిరంగ ప్రదేశాలలో వినోదం కోసం ఉపయోగించటం వంటివి

**నిర్దేశిత విధానం అనుసరించకుండా జరిపే దత్తతకు శిక్షాత్మక చర్యలు :**

- ఏ వ్యక్తి లేదా సంస్థ అయినా, ఈ చట్టంలో చెప్పిన పద్దతులు అనుసరించకుండా అనాథ లేక విడిచిపెట్టబడిన లేదా అప్పగించబడిన పిల్లలను దత్తత పొందినా, దత్తత ఇచ్చినా లేక ప్రతిపాదించినా సదరు వ్యక్తి లేదా సంస్థకు గరిష్టంగా మూడేళ్ళ వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించవచ్చు.
- ఒక వేళ నేరానికి పాల్పడినది గుర్తించబడిన దత్తత ఏజెన్సీ అయినట్లయితే, దానిని నియంత్రించే సదరు దత్తత ఏజెన్సీ రోజువారీ కార్యక్రమాలు నడిపే వ్యక్తికి పైన పేర్కొన్న శిక్షకు అదనంగా ఆ ఏజెన్సీ రిజిస్ట్రేషన్, దాని గుర్తింపును కనీసం సంవత్సరంపాటు ఉపసంహరించవచ్చు

**పిల్లల్ని కొనటం, అమ్మటం :**

- ఏదైనా ప్రయోజనం కోసం ఒక బిడ్డను అమ్మటం కానీ, కొనటం కానీ జరిపితే వారికి గరిష్టంగా ఐదేళ్ళ వరకూ కఠిన కారాగార శిక్ష, దాంతోబాటు లక్ష రూపాయల జరిమానా విధించవచ్చు.
- ఒక వైద్య శాలలో లేదా నర్సింగ్ హోంలో లేదా ప్రసూతి గృహంలోని వ్యక్తులతో సహా, ఎవరయినా బాలలను అధీనంలో ఉంచుకుని పైన చెప్పిన నేరానికి పాల్పడినట్లయితే వారికి విధించే జైలు శిక్షా కాలం గరిష్టంగా ఏడేళ్ళ వరకు ఉంటుంది.

**శారీరక శిక్ష :**



- చైల్డ్ కేర్ సంస్థలో అధికార బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తి గాని, అందులో ఉద్యోగి గాని బాలలను క్రమశిక్షణలో ఉంచేందుకు శారీరక శిక్షకు గురిచేసినట్లయితే, మొదటి తప్పుకు 10,000/- రూపాయలు జరిమానా, అనంతరం జరిగే ప్రతి తప్పుకు గరిష్టంగా 3 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
- సంస్థలో ఉద్యోగి అయిఉండి, నేరం చేసినట్లయితే ఆ వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగించవచ్చు. అంతేకాక ఆపై అతను/ఆమె నేరుగా బాలలతో కలిసి పని చేయకుండా బహిష్కరించవచ్చు.

- ఒకవేళ ఎక్కడైనా ఒక సంస్థలో శారీరక శిక్ష విధించినట్లుగా ఫిర్యాదు వచ్చిన సందర్భంలో సదరు యాజమాన్యం ఎటువంటి విచారణకు సహకరించకపోయినా లేదా కమిటీ / బోర్డు / న్యాయస్థానం / రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అమలుపరచకపోయినా, ఆ సంస్థ యాజమాన్యపు అధికార బాధ్యతలు నిర్వహించే వ్యక్తికి కనిష్టంగా మూడేళ్ళకు తగ్గకుండా జైలు శిక్ష మాత్రమే కాక లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

**తీవ్రవాదులు, పెద్దవారు బాలలను ఉపయోగించుకొనడం :**

- తీవ్రవాద సమూహం గా గుర్తించబడి కేంద్ర ప్రభుత్వం నిషేధిస్తున్నట్లు ప్రకటించిన ఏదైనా సంస్థ పిల్లలను చేర్చుకున్నా, అందుకోసం ఉపయోగించుకున్నా ఐదేళ్ళ వరకు కఠిన కారాగార శిక్ష, దానితోపాటు 5,00,000/- జరిమానా విధించవచ్చు.
- ఎవరైనా వయోజన వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం పిల్లలను వ్యక్తిగతంగా కానీ, ఒక ముఠాగా కానీ చట్ట వ్యతిరేక చర్యలకు ఉపయోగించుకున్నట్లయితే అందుకు 7 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష, దానితోపాటు 5,00,000/- జరిమానా విధించవచ్చు.

**బాలలను అపహరించడం, కిడ్నాప్ చేయడం :**



- 18 సంవత్సరాల వయస్సు కంటే తక్కువ వయసుఉన్న బాలలపై జరిగే, ఈ నేరాలకు భారతీయ శిక్షాస్మృతిలోని 359 నుంచి 369 వరకు గల సెక్షన్లు యదాతధంగా వర్తిస్తాయి.

**వికలాంగ పిల్లల పై జరిగే దాడులు:**

- వైద్యుని ధృవీకరణలో వికలాంగ బాలలుగా గుర్తించబడ్డ వారి పై జరిగే ఏ నేరానికైనా రెండింతలు శిక్ష, పరిహారము విధించవచ్చు.

**పురిగొల్పడం :**

- ఈ చట్టం కింద ఎవరైనా ఏదైనా నేర చర్యకు పురికొల్పితే, అలా పురికొల్పిన కారణంగా నేరం జరిగిట్లయితే, ఆ నేర చర్యకు ఏ శిక్ష పడుతుందో అదే శిక్ష విధించాలి.

**వివరణ :** ఒక నేర చర్యకు పూనుకోవడమనేది పురికొల్పిన ఫలితంగా లేదా ప్రోద్బలం చేసిన ఫలితంగా లేదా జరిపిన కుట్ర ఫలితంగా లేదా సహాయ పడినందువలన నేరం జరగటం వంటి చర్యలన్నీ "పురిగొల్పడం" కిందికే వస్తాయి.

## బాల్య వివాహాలకు సరే చెప్పడం వల్ల, ఒక అమ్మాయి జీవితం మీద దారుణమైన ప్రభావం ఉంటుంది



నిరక్షరాస్యత



హింస / వేధింపు



ప్రసూతి మరణాలు



మానసిక ఆరోగ్యం



బీదరికం



శిశు మరణాలు

# 6. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చటం, 2012

(The protection of children from sexual offences (POCSO) Act, 2012)

జాతీయ నేర నమోదు సంస్థ (నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో) సేకరించిన వాస్తవాంశాల నివేదిక ప్రకారం, పిల్లలపై లైంగిక నేరాలు పెరుగుతున్నట్లు తెలుపుతున్నది. కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జరిపిన "పిల్లలపై నేరపూరిత ప్రవర్తన – 2007" అధ్యయనంలో కూడా ఇదే విషయం బలపడింది. అంతే కాకుండా పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాల పరిష్కారానికి ఇప్పుడున్న చట్టాలు సంపూర్ణంగా లేవు. చాలా కేసుల్లో ఇలాంటి నేరాలకు నిర్దిష్ట శిక్ష, సరిపడ శిక్ష విధించడం జరగడం లేదు. బిడ్డకు, బాధితులకు, సాక్షికి సరైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నది. అలాగే, పిల్లలపై జరిగే నేరాల్ని ప్రత్యేకంగా నిర్వచించి, భారీస్థాయి శిక్షలను నిర్దేశించి, సరైన విధంగా ఎదుర్కోవాలని భావించి ఒక సమగ్రమైన చట్టం తెచ్చేందుకు ప్రతిపాదించటమైనది.

### చట్టం ఉద్దేశ్యం







పిల్లలపై లైంగికంగా దాడి చేయడం, అవమానించటం, వేధించటం, నగ్నచిత్రీకరణ వంటి నేరాల నుంచి రక్షణ కలిగించి, ఇటువంటి నేరాల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసి, సంబంధిత అంశాలతో వ్యవహరించేందుకు ఈ చట్టం ఉద్దేశించింది.

1. పిల్లలపై వివిధరకాల లైంగిక దాడులు – యావజ్జీవం వరకు జైలు శిక్షతో పాటు జరిమానాలు కూడా విధించవచ్చు.
2. లైంగిక వేధింపులు – మూడేళ్ళ వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు.
3. కామదృష్టితో నగ్నంగా ఉపయోగించడం – యావజ్జీవం వరకు కఠిన జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు.
4. నేరాన్ని ప్రోత్సహించడం, నేరానికి ప్రయత్నించడం – ఒకటిన్నర జీవిత ఖైదు శిక్ష వరకు పెంచే విధంగా జరిమానాతో గానీ, జరిమానా లేకుండా గానీ శిక్షించవచ్చు.

### ఫిర్యాదు చేయడం

నేరం జరగవచ్చని భయంతో ఉన్న లేదా అలాంటి నేరం జరిగి నట్లు తెలిసినా, బిడ్డతో సహా ఎవరైనా సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక బాలల పోలీస్ విభాగం లేదా స్థానిక పోలీసుకు తెలపాలి. ఈ పోలీసులు 24 గంటలలో చైల్డ్ వెల్ఫేర్‌కమిటీకి, పిల్లల ప్రత్యేక న్యాయస్థానానికి తెలియజేయాలి. కేసును ఫిర్యాదు లేక నమోదు చేయకుండా ఉన్నా, తప్పుడు ఫిర్యాదు లేదా సమాచారం ఇచ్చినందుకు గాను శిక్షలు విధించవచ్చు.

### ప్రత్యేక న్యాయస్థానాలు

ఈ కేసుల విచారణ వేగవంతంగా జరిపేందుకు గాను ప్రత్యేక న్యాయస్థానాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలి. విచారణను గోప్యంగా బిడ్డ తల్లిదండ్రులు లేదా బిడ్డకు విశ్వాసం, నమ్మకం ఉన్న వ్యక్తి సమక్షంలో జరపాలి. బిడ్డ సాక్ష్యం నమోదు చేసుకునేందుకు 30 రోజులు, కేసు ముగించేందుకు 1 సంవత్సరం సమయం తీసుకోవాలి. న్యాయ విచారణ సమయంలో బిడ్డ నిందితుడిని చూసే అవకాశం లేకుండా న్యాయస్థానం చూసుకోవాలి. బిడ్డపై నేరం జరిగిన సందర్భంలో వైద్య పరీక్షలు జరిపించవచ్చు.

## పిల్లల పై లైంగిక వేదింపులు / ఆకృత్యాలు నిరోధించడం

పిల్లలపై లైంగిక వేదింపులు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఈ వేదింపులు పిల్లలకు తెలిసినవారు లేదా నమ్మినవారు మరియు అపరిచితుల వలన కలుగుతున్నాయి. అందుకే వీటిని పసిగట్టే పరిజ్ఞానాన్ని పిల్లలకు సరైన రీతిలో వివరించాలి. తల్లిదండ్రులు మరియు పిల్లల సంరక్షకులు కొన్ని సలహాలు ఇవ్వడం ద్వారా దీనిని నిరోధించవచ్చు. ప్రస్తుతం సమాజంలో అశ్లీల ఫోటోలు, చిత్రాలు తీస్తున్న సందర్భంలో తల్లిదండ్రులు మరియు సంరక్షకులు చాలా జాగ్రత్తగా ఉండాలి మరియు పిల్లలకు సున్నితంగా ఇలాంటి సమాచారం తెలియ జేస్తూ హెచ్చరిస్తుండాలి. ఇలాంటి సమాచారం తల్లిదండ్రులకు తెలుసుకోడానికి ఆన్‌లైన్‌లో కూడా చూడవచ్చును.

### పిల్లలకు సరైన స్పర్శ (మంచి, చెడు) గురించి తెలియజేయడానికి కొన్ని సూచనలు/టిప్స్

1. పిల్లలకు తల్లిదండ్రులు, తాత, నానమ్మలు హత్తుకున్నపుడు, ముద్దు చేసినపుడు ఎలాంటి అనుభూతి కలుగుతుంది, వారి స్పర్శ ఎలాగ ఉంటుంది గుర్తింపజేసి, ఆ స్పర్శ మంచి సర్శ అని తెలుసుకునేలా చేయాలి.





2. పిల్లలకు తమ శరీరంలో ప్రవేట్ భాగాలు గుర్తింపుజేసి, ఆ భాగాలను స్నానం చేసేపుడు, మలవిసర్జన తర్వాత కడుక్కునేపుడు తల్లి లేదా అమ్మమ్మ/నానమ్మ మాత్రమే తాకాలని, వేరే వ్యక్తులు తాకరాదని తెలియజేయాలి, డాక్టర్ కూడా తల్లిముందు పరీక్షిస్తారని తెలపాలి.





3. ఒక వేళ ఎవరైనా శరీరంలో ప్రవేట్ భాగాలను తాకుతూ ఇబ్బంది కలిగిస్తే, తల్లిదండ్రులకు లేదా ఇంట్లో తాత, నానమ్మలకు తెలియజేయాలి.



3. మంచి, చెడు స్పర్శలంటే ఏమిటో తెలుసుకునేలా వివరణ ఇవ్వాలి ఏ భాగాలను తాకితే చెడు స్పర్శ అని గుర్తించగలిగేలా పిల్లలకు తెలియజేయాలి.



4. ముద్దులు, చెక్కిలిగింతలు మొదలైనవి కూడా కొంత వరకు సరైనవి కానీ పదే పదే, ఎక్కువ సేపు పెట్టుకున్నా, కొత్త వ్యక్తులు చేసినా అది చెడు స్పర్శ అని గుర్తింపజేయాలి

5. కొత్త వ్యక్తులలో ఎక్కడికి వెళ్ళకూడదు. చాక్లెట్స్ లాంటివి ఇచ్చి మభ్యపెడతారని చెప్పాలి.



6. ఎవరైనా (ముఖ్యంగా మగవారు) చేయి పట్టుకున్నా లేదా ఒడిలో కూర్చోమన్నా ఎందుకు అని అడగాలని చెప్పాలి.



7. పిల్లలకు ఏ వ్యక్తి వల్ల చెడు స్పర్శగా గుర్తిస్తే, గట్టిగా 'నో' అని అరవడం, దూరంగా వెళ్ళిపోవడం, పెద్దవారికి తెలియ జేయాలని చెప్పాలి.



8. ఇతరులు పిల్లల పై వీడియోలు, ఫోటోలు తీయడం లాంటివి చేస్తున్నది గమనిస్తుండాలి. పిల్లలకు కూడా ఈ విషయాలు తెలిసి ఉండాలి.

# నాయకత్వం

“నాయకత్వం” అనే పదం సామూహికంగా విధులు, కార్యక్రమాలు నిర్వహించు సందర్భములో వివిధ సమాజాలలో, సంస్థలలో, కార్యాలయాల్లో, రాజకీయాల్లో మరియు కుటుంబంలో తరచుగా వినబడుతుంది. నాయకత్వం అంటే ఏంటి అనే సందర్భంలో, సభ్యులకు ఆదేశాలు ఇవ్వడమా లేదా ఏకాభిప్రాయాన్ని ఏర్పరచడం ద్వారా లక్ష్యాన్ని సాధించడమా అనే చర్చ జరుగుతుంది. దీనిపై సమగ్రమైన అవగాహన కల్పించుకోవడం అనేది అత్యంత ఆవశ్యకం.

**నాయకత్వం అంటే ఏంటి?**

ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ ప్రకారం, “ఒక వ్యక్తి సమూహాన్ని లేదా ఒక సంస్థను నిర్దేశించిన లక్ష్యాలను సాధించే క్రమంలో సభ్యులను ముందుండి నడిపించడం” అనే చర్యనే నాయకత్వం అంటారు. నాయకులు అంటే తను సభ్యులకు మార్గనిర్దేశం చేస్తూ, ప్రేరేపిస్తూ, వారిని ప్రభావితం చేస్తూ ముందుకు తీసుకువెళ్ళే వ్యక్తులు.

**నాయకత్వం ఎందుకు ముఖ్యమైంది?**

నాయకత్వం ప్రాముఖ్యత సమాజ, సంస్థ, వ్యవస్థల యొక్క నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి నాయకత్వం అనేది అత్యంత కీలకమైనది. నాయకత్వం యొక్క ముఖ్యమైన ఆవశ్యకత ఈ క్రింది విధంగా ఉంటుంది.

1. **దిశ చూపుతుంది**: నాయకులు భవిష్యత్తుకు ఒక స్ఫూర్తిదాయక దిశను చూపిస్తారు. ఇది లేకపోతే బృందం గమ్యం తెలియక ఇబ్బంది పడుతుంది.

2. **ప్రేరణను నింపుతుంది**: నాయకులు ఉత్సాహాన్ని పెంచే చురుకైనవారు. వారు బృందాన్ని కేవలం పనులు చేయడం నుంచి, సంస్థ లక్ష్యాన్ని విశ్వసించడం వరకు తీసుకువెళ్తారు.

3. **నిర్ణయాలను సులభం చేస్తుంది**: తక్షణ సమస్యలకు స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం అవసరం. నాయకులు సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతారు.

4. **మార్పును ఆహ్వానిస్తూ ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తారు**: ప్రపంచం వేగంగా మారుతున్నప్పుడు, మార్పును సమర్థంగా ఎదుర్కోవడం అవసరం. సరైన నాయకత్వం మార్పును ఆహ్వానిస్తూ ఎదురయ్యే సవాళ్ళను అధిగమించి లక్ష్యాన్ని సాధిస్తారు.

## నాయకత్వ రకాలేమిటి?

వివిధ సమాజాలలో సందర్భానుసారంగా భిన్నమైనటువంటి నాయకత్వాలు సమాంతరంగా పనిచేస్తుంటాయి. ఉదాహరణకు భారతీయ గ్రామీణ వ్యవస్థలో సాంప్రదాయబద్ధంగా వచ్చే కుల పెద్దల ఆచారం, వంశపారంపర్యంగా వచ్చే ఆధ్యాత్మిక, వ్యక్తిగత ప్రతిభతో సాధించే మరియు ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా పొందునటువంటి నాయకత్వాలను ఏక కాలంలో మనం గమనించవచ్చు.

**1. సాంప్రదాయ నాయకత్వం**: సంఘం సాంప్రదాయాల ద్వారా నాయకత్వ స్థానం పొందే వారు. ఉదాహరణకు, వర్ణ వ్యవస్థలో పెద్దలు.

**2. ఆధ్యాత్మిక నాయకత్వం**: వంశపారంపర్యంగా నాయకత్వం పొందే వారు. ఉదాహరణకు: పూజారులు, ధర్మకర్తలు.

**3. ప్రతిభావంత నాయకత్వం**: తమ ప్రత్యేక ఆకర్షణ గుణాల ద్వారా నాయకత్వం పొందే వారు. ఉదాహరణకు: సినీ నటులు, క్రీడాకారులు.

**4. ప్రజాస్వామ్య నాయకత్వం**: ఎన్నికల ద్వారా, రాజ్యాంగ ప్రక్రియ ద్వారా నాయకత్వం పొందేవారు.

## నాయకత్వ విధానాలు:

వివిధ ప్రక్రియల ద్వారా నాయకత్వ స్థానం పొందిన వారు భిన్నమైన నాయకత్వ శైలులను కలిగి ఉంటారు. వాటిలో ప్రధానమైనవి:

**1. ఆటోక్రాటిక్ (నిరంకుశ) నాయకత్వం**: నాయకుడు ఆదేశాలు ఇవ్వడం మాత్రమే చేస్తారు. సభ్యులందరిని పూర్తి నియంత్రణలో ఉంచుకుంటారు. బృంద సభ్యులకు వారి ఆలోచనలు చెప్పే అవకాశం ఉండదు.

**2. లైజె-ఫెయిర్ నాయకత్వం**: నాయకుడు తన బృంద సభ్యులకు స్వేచ్ఛ ఇస్తాడు. వారు స్వతంత్రంగా పనిచేయడానికి అవకాశం కల్పిస్తూ తను సమన్వయ కర్తగా ఉంటాడు.

**3. ప్రజాస్వామ్య నాయకత్వం**: నాయకుడు, బృందం కలిసి నిర్ణయాలు తీసుకుంటారు.

**4. బ్యూరోక్రాటిక్ నాయకత్వం**: నియమాల ప్రకారం క్రమబద్ధంగా పనిచేస్తారు.

**5. సానుభూతి నాయకత్వం**: ఇది ఆధునిక విధానం. బృంద భావాలను అర్థం చేసుకుని సహాయక వాతావరణం కల్పిస్తారు.

**<u>మంచి నాయకుడి లక్షణాలు:</u>**

నాయకత్వం వివిధ ప్రక్రియల ద్వారా పొందినటువంటి నాయకులు ఈ క్రింది లక్షణాలు కలిగి ఉండాలి.

1. నైతికత: సత్యనిష్ఠకు ప్రాధాన్యం ఇవ్వాలి.

2. ఆత్మవిశ్వాసం: సంకట సమయంలోనూ ధైర్యంగా బృందానికి దారి చూపే సామర్థ్యం కలిగిఉండాలి.

3. స్ఫూర్తి: స్వతహాగా స్ఫూర్తి పొందుతూ తన సభ్యులకు స్ఫూర్తి నివ్వాలి.

4. సంభాషణ నైపుణ్యం: మంచి సంభాషణ నైపుణ్యాన్ని అలవరచుకొని సంస్థ యొక్క విజన్ ని బృందానికి స్పష్టంగా వివరిస్తూ మార్గనిర్దేశకం చేయాలి.

5. దార్శనికత: సంస్థను ముందుకు తీసుకెళ్ళే దార్శనికత అవసరం.

6. సహనశీలత: విభిన్న సవాళ్లను ఎదుర్కొంటూ సంస్థను లక్ష్య సాధనవైపు నడిపించాలి.

7. అంతర్ దృష్టి : జటిల పరిస్థితుల్లో సొంత అవగాహన మరియు ఆలోచనా విధానంతో సంస్థను నడిపించాలి

8. సానుభూతి: బృంద సభ్యుల సమస్యలను సానుభూతితో పరిశీలించి తగిన విధంగా నిర్ణయాలు తీసుకోవాలి.

9. న్యాయం: సానుభూతి- సహజ న్యాయానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలి.

10. తెలివితేటలు: సమస్యలకు విశ్లేషణాత్మక పరిష్కారం కనుగొనాలి.

11. సృజనాత్మకత: కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తూ నవీకరించుకోవాలి.

12. ధైర్యం: పట్టుదలతో పాటు లక్ష్య సాధన పట్ల బలమైన విశ్వాసంతో పనిచేయాలి.

13. భావోద్వేగ మేధస్సు: సానుకూల పరిస్థితులను కల్పిస్తూ ప్రేరణ కల్పించాలి

14. అనుకూలత: పరిస్థితులకు తగ్గట్టుగా ఆలోచనా సరళిలో మార్పులు చేసుకుంటూ పనిచేయాలి.

**<u>నాయకుడి అలవాటు చేసుకోవలసిన సాంకేతిక నైపుణ్యాలు :</u>**

- స్పష్టంగా సంభాషించగలగడం
- త్వరగా నిర్ణయం తీసుకోవడం
- సంక్షోభ సమయంలో సమయస్ఫూర్తిని ప్రదర్శించడం
- సంఘర్షణలను పరిష్కరించే నైపుణ్యం కలిగియుండడం
- బృంద సభ్యుల సామర్థ్యానికి అనుగుణంగా విధులు కేటాయించడం

**నాయకుడు ఉత్తమ నాయకుడుగా మారడానికి చేయవలసిన పనులు:**

1. **ప్రశ్నించడం**: అన్ని సమాధానాలు తనకు తెలుసని భావించకుండా, సమస్యలపై అవగాహన ఏర్పరచుకొనుటకు కావలసిన సమాచారాన్ని పొందటానికి మెరుగైన ప్రశ్నలు వేసి వివిధ కోణాలలో సమాచారాన్ని విశ్లేషిస్తారు మరియు విషయ పరిజ్ఞానాన్ని పొందాలనే జిజ్ఞాసతో ఉండాలి.
2. **ఇతరుల వివరణలను వినే లక్షణం**: కేవలం సమాధానం ఇవ్వడానికి కాకుండా, అర్థం చేసుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి మరియు సమస్యకు సరైన పరిష్కారం కనుగొనే ప్రయత్నంలో ఇతరులు ఇచ్చే సమాచారాన్ని వినడం అనేది అత్యంత కీలకమైనది. కావున నాయకుడుకి వినే లక్షణం కలిగి ఉండాలి.
3. **భిన్నమైన అభిప్రాయాలను స్వాగతించే లక్షణం**: నిజాయితీగా ఇచ్చే అభిప్రాయం (ప్రత్యేకంగా వినడానికి కష్టం కలిగించే విధమైనది అయినప్పటికీ) వీటిని స్వీకరించడం ద్వారా పొరపాట్లను సవరించుకొనే అవకాశం కలుగుతుంది. కావున నాయకుడుకి భిన్నమైన అభిప్రాయాలను స్వాగతించే లక్షణం కలిగియుండాలి.
4. **నాయకులు తప్పులను/పొరపాట్లను అంగీకరించడం**: నాయకుడు వివిధ సందర్భాలలో వారి నిర్ణయం వల్ల జరిగిన తప్పులను / పొరపాట్లను స్వీకరించి, వాటి నుండి గుణపాఠాలు నేర్చుకుని, మరింత స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్ళాలి.
5. **పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే లక్షణం**: సమకాలీన పరిస్థితులపై అవగాహన కలిగియుండి వేగంగా పరిష్కారాలు కనుగొనడంతో పాటు, ప్రతికూల పరిస్థితులలో కూడా తన లక్ష్య సాధనకు కావలసిన ప్రత్యామ్న్యాయ మార్గాలను కనుగొనేటటువంటి లక్షణం కలిగియుండాలి.
6. **సంస్థ యొక్క లక్ష్యాలను సాధించాలనే దృఢ సంకల్పం** : నాయకునికి తన సంస్థ యొక్క లక్ష్యాలను సాధించాలనే దృఢ సంకల్పంతో సభ్యుల అభివృద్ధికి తోడ్పడడంతో పాటు వారిని బలమైన బృందాలుగా తయారుచేసి, సమిష్టి కృషి తో లక్ష్యాలను సాధించే విధంగా ప్రయత్నించాలి.
7. **నాయకుడు పారదర్శకంగా వ్యవహరించాలి**: నాయకుడు తమ నిర్ణయాలు, ఉద్దేశాలు స్పష్టంగా సభ్యులకు వివరించడం ద్వారా బృందానికి సక్రమమైన అవగాహన ఏర్పడుతుంది. ఈ ప్రక్రియలో నాయకుడు పారదర్శకంగా వ్యవహరించాలి.

8. **సమయానుకూల ప్రతిస్పందన**: నాయకుడు నిర్ణయాలు తీసుకోవడానికి ముందు, పరిస్థితిని పరిశీలించి, అవకాశాలను విశ్లేషించి ప్రణాళికబద్ధంగా ప్రతిస్పందించాలి.
9. **జ్ఞాన నవీకరణ**: నాయకుడు తన విషయ పరిజ్ఞానాన్ని నవీకరించుకుంటూ ముందుకు నడవాలి. ఈ ప్రక్రియలో భాగంగా వివిధ రూపాలలో సమచారాన్ని పొందే ప్రక్రియలో భాగంగా నిరంతం ఉత్తర ప్రత్యుత్తరాలను, నియమ నిబంధనలను తెలుసుకోవడం, వివిధ శిక్షణా కార్యక్రమాలల్లో పాల్గొనడం, మెంటర్లను సంప్రదించడం మరియు స్వీయ ఆలోచనలను హేతుబద్ధీకరించుకోవడం ద్వారా నిరంతర ప్రక్రియగా జ్ఞాన నవీకరణ చేసుకోవాలి.

పై లక్షణాలతో పాటు నాయకుని ప్రవర్తన, స్వీకరించి స్పందించే విధానం, భాష మరియు భావవ్యక్తీకరణ, హావభావాలు తను నాయకత్వం వహిస్తున్న సమాజ / సంస్థ లోని సభ్యుల ప్రవర్తన మరియు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపెడుతుంది. కావున ఈ విషయాలలో నాయకుడు సభ్యుల యొక్క గౌరవాన్ని పొందేవిధంగా ఉండాలి.

**‘‘చిరునవ్వుకు విలువ లేదు, కానీ అది మీ ముఖ విలువను పెంచుతుంది’’**

# భావ ప్రసారం

# (కమ్యూనికేషన్) (communication )

నాయకులుగా ఎన్నుకోబడ్డ వారు తమ లక్ష్యాలను సాధించటానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. అందుకు గాను వారు తమ నాయకత్వ లక్షణాలను మరింత మెరుగు పరుచు కోవటానికి కృషి చేయవలసి ఉంటుంది. అందులో భాగంగా వారు తమలోని వివిధ నైపుణ్యాలను పదును పెట్టుకోవటం పై దృష్టి సారించాలి. ముఖ్యంగా నాయకత్వం పటిష్టం చేసుకోవటానికి ప్రజలలో అనుకూలతలను పెంచుకోవటం, విశ్వాసాన్ని పొందటం, సృజనాత్మకతను కలిగి ఉండటం మరియు భావ ప్రసార (Communication) సామర్ధ్యం పెంచుకోవటం అత్యంత ఆవశ్యకత గల అంశాలుగా చెప్పవచ్చు.

ప్రతిభావంతమైన నాయకులుగా ఎదగటానికి అవసరమైన అంశాలు: అందరినీ సమానంగా ఆదరించటం, ప్రజల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వటం, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించటం, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం, అందరి విషయాలనూ శ్రద్ధగా వినటం, ప్రేరణ కలిగించేలా ఉండటం, ఆత్మ గౌరవం కాపాడుకోవటం, సరియైన వ్యక్తులకు పనిని అప్పగించటం, సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండటం, విషయాన్ని సూటిగా క్లుప్త సుందరంగా చెప్ప గలగటం, నైతికత, బాధ్యత కలిగి ఉండటం, నిబద్ధత, సమయానికి తగినట్లు ఉండటం, సమన్వయ లోపాలు లేకుండా చూచుకోవడం. ఈ అంశాలు అన్నింటికీ మూలమైనది భావ ప్రసారం (Communication). ఏ విషయాన్నైనా స్పష్టంగా తెలియజేయ గలగటం వల్ల కావలసిన పనులను చేయించ గలగటం, సత్ ఫలితాలను రాబట్టటం సులభతరం అవుతుంది.

భావప్రసారం వివిధ రూపాల్లో ఉండవచ్చు. అవి : శ్రద్ధగా వినటం, బాడీ లాంగ్వేజ్, సంజ్ఞలు, మాటలు, రాతలు, చేతలు.

1. శ్రద్ధగా వినటం: వినటం కూడా భావ ప్రసారంలో భాగమే! నాయకుడికి/నాయకురాలికి ఎదుటి వారు చెప్పే విషయాన్ని శ్రద్ధగా విని ఆకళింపు చేసుకున్న తర్వాత నే స్పందించటం మంచిది. వినేటప్పుడు ఏమాత్రం ఏకాగ్రత పోగొట్టుకోరాదు. ఎటువంటి భావోద్వేగాలకు లోనవ్వకుండా విషయాన్ని ఆలకించటం మంచి నాయకత్వ లక్షణం.
2. బాడీ లాంగ్వేజ్: ప్రజల మధ్యలో ఉన్నప్పుడు గానీ, సభలూ సమావేశాలలో గానీ నాయకుడి శరీర భాష (బాడీ లాంగ్వేజ్) ఎంతో సహజంగా, మర్యాద పూర్వకంగా, ఉన్నతంగా ఉండాలి. అలా కాక, దర్పాన్ని ప్రదర్శించేలా కనిపించటం వల్ల ప్రజలకు అనవసర అపోహలు కలిగించే అవకాశం ఉంటుంది.
3. సంజ్ఞలు : ఎవరికైనా సైగల ద్వారా విషయాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు సులభంగా అర్థం అయ్యే రీతిలో చెప్పే ప్రయత్నం చేయాలి. లేని యెడల అపార్థాలకు తావు ఇవ్వవచ్చు, లేదా కావలసిన పని చేయలేకపోవచ్చు.
4. మాటలు : మాటల ద్వారా తెలియజేసే సమయంలో సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా తెలియజేసే ప్రయత్నం చేయాలి. మాటల్లో అధికార దర్పం కానీ, అనకూడని పదజాలం కానీ రాకుండా జాగ్రత్త పడాలి. మాట్లాడే సమయంలో మన స్వరం లో ఏ విధమైన భావోద్వేగాలు కనిపించ కుండా ఉండాలి. మాటలూ, ముఖంలోని భావాలూ ఒకే విధమైన భావాన్ని పలికించాలి. మాటలు దురుసుగానూ, వేగంగానూ ఉండకుండా చూసుకోవాలి. అందరికీ అర్థం అయ్యే రీతిలో భావ ప్రకటన ఉండాలి. ఎంచుకున్న మాధ్యమం సక్రమమైనదిగా, అందరికీ అందుబాటులో ఉండేదిగా చూసుకోవాలి.

5. రాతలు : వ్రాత పూర్వక సమాచారం ఇవ్వ వలసి వచ్చినప్పుడు ఆయా సందర్భాలను బట్టి, ఏ విధమైన లేఖలు వ్రాయ వలసి ఉంటుందో అందుకు గల అధికారుల సహాయం పొందటం వల్ల కొన్ని ఇబ్బందులను తప్పించుకొన వచ్చు.
6. చేతలు : అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రజలందరికీ అవసరమైన విషయాల పట్ల శ్రద్ధను చూపాలి. పూర్తి చేసిన లక్ష్యాలన్నీ అందరిలో సానుకూలతను కలిగించాలి.

## బహిరంగ ఉపన్యాసం

నాయకులుగా ఎన్నిక కాబడ్డ వారికి బహిరంగ ఉపన్యాసం ఇవ్వటం దాదాపు దైనందిన కార్యక్రమాలలో భాగంగా ఉంటుంది. కానీ అందరికీ ఉపన్యాసానుభావం ఉండకపోవచ్చు. అందువల్ల వారిలో భయాందోళనలు కలగటం చాలా సహజం. వాటిని అధిగమించటానికి కావలసిన అంశాలను ఇక్కడ చర్చిద్దాం.

మొదటగా ఉపన్యాసం ఇవ్వటానికి జంకు కలగటం కొన్ని కారణాల వల్ల జరుగుతుంది. ఆ కారణాలను తెలుసుకున్నట్లయితే, వాటిని అధిగమించే మార్గాలను అన్వేషించటం సులభం అవుతుంది.

1. ఇంతకు ముందు ఎప్పుడూ స్టేజి మీద మాట్లాడకపోవడం.
2. ఇతరుల లాగా ఆకట్టుకునే ప్రసంగాలు చేయలేననే అనుమానం.
3. ఉపన్యాసం చేసే లాంటి భాష రాదన్న భయం.
4. ప్రసంగ పాఠం ఆసాంతం గుర్తు ఉండదేమో ననే సందేహం.
5. ప్రత్యర్థులు సభలో ఏపైనా అవాంతరాలు కల్పిస్తారనే ఆందోళన.
6. అంతమంది ప్రజలను ఎదురుగా చూస్తే నోట మాట రాదేమో ననే చింత.

7. ఎవరైనా ప్రశ్నిస్తే జవాబు తెలిసినా చెప్పలేమన్న బెదురు.

ఈ విధమైన సందేహాల వలన సభలూ సమావేశాలలో ఉపన్యాసం ఇవ్వటానికి వెనుకాడటం సహజం. అయినప్పటికీ, వీటిని అధిగమించటానికి కావలసిన మార్గాలను అన్వేషించటం, ఆకళింపు చేసుకొని, ఆచరించటం వల్ల జటిలం అనిపించిన ఉపన్యాసాలను సైతం సులభంగా జనరంజకంగా పూర్తి చేయవచ్చు. మొదటిగా గమనించవలసిన అంశం, పైన తెలిపిన సందేహాలన్నీ ఊహాత్మకమైనవి. యదార్ధ అనుభవం కన్నా ఈ ఊహాత్మక భయం అత్యంత ప్రభావం చూపి, మనిషిని నిస్తేజ పరుస్తుంది. సానుకూల దృక్పథం తో ఆలోచిస్తూ, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగటం వల్ల మంచి వక్తలుగా రాణించవచ్చు. చరిత్రలో గొప్ప వక్తలుగా చెప్పబడే వారు కూడా ప్రారంభంలో భయాందోళనలకు లోనైనా వారే! తమ భయాలకు చక్కటి పరిష్కార మార్గాలను తెలుసుకొని, ఆచరించి, గొప్ప వక్తలుగా పేరు పొందారు. అందరూ అదే బాటలో నడిచి మంచి వక్తలుగా రాణించవచ్చు.

మంచి వక్తలుగా ఎదగటానికి తెలుసుకోవలసిన, ఆచరించదగ్గ 10 సలహాలు:

1. ఏ విధమైన సభలో మాట్లాడుతున్నామో, మన శ్రోతలు ఎవరో తెలిసి ఉండాలి. దీనివల్ల, సభలో ఉన్నవారి పట్ల గల సందేహాలు తీరిపోతాయి.
2. మైకు ముందు నిలబడి , 5 సెకండ్లు మౌనంగా ఉండి, అప్పుడు ఉపన్యాసం ప్రారంభించాలి.
3. ముందుగా అందరికీ నమస్కారాలతో ప్రారంభించాలి. సందర్భానికి తగిన మంచి కొటేషన్ తో ప్రారంభిస్తే అందరిలో కొంత కుతూహలం కలుగుతుంది.
4. సభ ఉంటుందనే విషయం ముందుగా తెలిసిన సందర్భాలలో, ముందుగానే ఉపన్యాసానికి కావలసిన విషయ సేకరణ చేసుకొని, ఇంటివద్దనే సాధన చేయాలి. ముఖ్యమైన అంశాలను ఒక కాగితంపై వ్రాసుకుని, పునశ్చరణ చేసుకోవాలి. కానీ ఉపన్యాసాన్ని బట్టీ పెట్టరాదు.

5. ఉపన్యాస అనుభవం పెరిగే కొద్దీ, శ్రోతల అభిప్రాయ సేకరణ కూడా చేసుకోవాలి. దానికి అనుగుణంగా ఉపన్యాసంలో మార్పులు చేసుకోవాలి.
6. భాష సహజంగా ఉండేలా జాగ్రత్త పడాలి. ఎక్కువమంది ఎదురుగా ఉన్నప్పుడు, తెలియ కుండానే వేగంగా మాట్లాడటం కద్దు. అలా జరగకుండా జాగ్రత్త పడాలి.
7. మన స్వరం స్పష్టంగా ఉండే లాగా చూసుకోవాలి. భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోవాలి.
8. విషయానికి తగ్గట్టుగా మన స్వరంలో హెచ్చు తగ్గులు ఉండాలి.
9. ముఖ్యమైన అంశాలు ప్రస్తావించే ముందు మూడు క్షణాల మౌనం పాటించండి. అందువల్ల అందరికీ కుతూహలం పెరుగుతుంది. ఆ తరువాత చెప్పే అంశాన్ని శ్రద్ధగా వినే ప్రయత్నం చేస్తారు.
10. ఉపన్యాసంలోని అంశంపై చక్కటి అవగాహన కలవారిలా స్థిరమైన బాడీ లాంగ్వేజ్ ఉండాలి.
11. చెప్పవలసిన అంశం మీదనే ధ్యాస ఉండాలి. మరి ఏ ఇతర అంశాల పైనా దృష్టి పోకుండా జాగ్రత్త పడాలి.
12. ఉపన్యాసం ఇచ్చే తొలి నాళ్లలో - సభికులలో ఉన్నవారిని చూస్తున్నట్లుగా ఉండాలి. అంతే కానీ ఎవరు ఉన్నారో బాగా గమనించటం వల్ల కొంత భీతి కలుగ వచ్చు.
13. సభికులు ఎవరైనా పెద్దగా అరవటం, కేకలు వేయటం లాంటివి జరిగినా, వాటి వైపు దృష్టి పోనివ్వక పోవటమే మంచిది. (అది పెద్ద గలాటా కానంతవరకు)
14. ప్రసంగించవలసిన అంశానికి సంబంధించిన డేటా ఉన్నట్లయితే, దానిని ఉదహరించ వచ్చు. కానీ, ఆ డేటా అధీకృతమైనది అయి ఉండాలి. దినపత్రికలలో సమాచారాన్ని ఉదహరించక పోవడమే మంచిది.
15. ఆయా సందర్భాలకు తగిన ఉదాహరణలను ఇవ్వటం వల్ల సభికులకి మరింత బాగా అర్థం అవుతుంది.

16. ఆఖరుగా చెప్పే మాటలు బాగా స్పష్టంగా, స్థిరంగా ఉండాలి. అందరినీ ఆకట్టుకునే విధంగా మంచి ఉత్సాహ పూరితమైన మాటతో ముగించాలి.
17. ముగింపులో అవకాశం ఇచ్చిన వారికి, సభికులకి కృతజ్ఞతలు తెలిపి, అభినందించ వలసిన వారు ఉన్నట్లయితే అభినందించటం ఆనవాయితీ.

ఉపన్యాసం ముగిసిన వెంటనే వేగంగా మీ స్థానానికి చేరే ప్రయత్నం చేయకుండా, నిదానంగా వెళ్ళాలి. అక్కడ కూర్చొన్న వెంటనే పక్కనున్న వారు అభినందిస్తే చిరు నవ్వుతో స్వీకరించాలి తప్ప మన మనసులో కలిగిన భయాందోళనలు, వాటితో ఉపన్యాసం చెప్పిన వైనం వారితో అక్కడే చర్చించరాదు. ప్రతి ఉపన్యాసం తరువాత సమీక్ష చేసుకొని, మరింత ప్రభావంతంగా ఉపన్యసించేందుకు సిద్ధం కావాలి.

***